www.andhrajyothi.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



13

రూ.500 కోట్లతో మైక్రోలింక్ పరిశ్రమ

రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రం: దుద్దిళ్ల

శుక్రవారం | 12-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) :104 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మఋతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: షష్ఠి మ. 12.33 తదుపరి సప్తమి; నక్షత్రం: ఉత్తర సా. 4.09 తదుపరి హస్త; వర్జ్యం: రా.1.38-3.26; దుర్ముహూర్తం: ఉ.8.27-9.19, మ.12.46-1.38; అమృతఘడియలు: ఉ.8.01-9.48; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 5.51; సూర్యాస్తమయం: 6.49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



రాబడులపై సమీక్షలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

ఖజానా నిండాల్సిందే!

నిర్దేశిత వార్షిక రాబడుల లక్ష్యాలను సాధించాలి

ప్రతి విభాగం నెలవారీ లక్ష్యాన్ని పెట్టుకోవాలి

జూన్ వరకు ఆదాయం ఆశాజనకంగా లేదు!

పన్ను ఎగవేతలు లేకుండా చూడండి

రిజిస్ట్రేషన్ల రాబడి పెరిగే చర్యలు చేపట్టండి

శాఖల లక్ష్యాలపై ప్రతి శుక్రవారం భట్టి సమీక్ష

ప్రతి నెలా తొలి వారంలో నేను సమీక్షిస్తా: రేవంత్

కలెక్టర్లు, ఎస్పీలతో త్వరలో సీఎం సమావేశం!

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయాన్ని తెచ్చిపెట్టే శాఖలన్నీ నిర్ణీత వార్షిక లక్ష్యాలను సాధించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఖజానాను నింపేందుకు ప్రతి విభాగం కృషి చేయాలన్నారు. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం రాబడి పెరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పన్ను ఎగవేతలు లేకుండా అన్ని విభాగాలు కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. పన్నుల వసూళ్లపై అధికారులు నిక్కచ్చిగా ఉండాలని ఆదేశించారు. వార్షిక లక్ష్య సాధనకు వీలుగా ప్రతి విభాగం నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. సాధించిన పురోగతిని ఎప్పటికప్పుడు బేరీజు వేసుకోవాలని సూచించారు. సంబంధిత విభాగాన్ని అవసరమైతే పునర్వ్యవస్థీకరించుకోవాలని, ఆదాయాన్ని రాబట్టేందుకు వీలైనన్ని సంస్కరణలు చేపట్టాలని

మిగతా 13వ పేజీలో...

ఆగస్టులో అమెరికాకు సీఎం రేవంత్

దక్షిణ కొరియాకు కూడా.. పెట్టుబడులే లక్ష్యంగా.. 13

మరో సిక్సర్!

కాంగ్రెస్‌లోకి మరో ఆరుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

జీహెచ్ఎంసీ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని వారే!

నేడు కాంగ్రెస్‌లోకి ప్రకాశ్‌గౌడ్, రేపు అరికెపూడి గాంధీ

హైదరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ కీలక ఎమ్మెల్సీ సైతం

ఇప్పటికే హస్తం పార్టీలోకి ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

టార్గెట్ 26.. ఆపై సీఎల్పీలో బీఆర్ఎస్ఎల్పీ విలీనమే!

అసెంబ్లీ మొదలయ్యే నాటికి పూర్తయ్యేలా రేవంత్ కసరత్తు



హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష బీఆర్ఎస్ నుంచి మరో ఆరుగురు ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలుస్తోంది. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ శుక్రవారం, శేరిలింగంపల్లి శాసనసభ్యుడు అరికెపూడి గాంధీ శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో అధికార పార్టీలో చేరడం ఖాయమైంది. గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని మరి కొందరు ఎమ్మెల్యేలు కూడా నాలుగైదు రోజుల్లో ఒకరి తర్వాత ఒకరు ఇదే బాటన నడవనున్నట్లు చెబుతున్నారు. వీరితో సీఎం సన్నిహిత వర్గాలు సంప్రదింపులను పూర్తి చేశాయి. ఈ మేరకు అంతా సిద్ధమైనట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. అందరూ ఒకేసారి వెళ్లాలని తొలుత భావించినా.. వ్యక్తిగత ముహూర్తాలకు అనుగుణంగా ఒకరి తర్వాత ఒకరు చేరాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. వీరేకాక నగరానికి చెందిన, గత ప్రభుత్వ హయాంలో హవా సాగించిన కీలక ఎమ్మెల్సీ కూడా బీఆర్ఎస్‌ను వీడనున్నట్లు

మిగతా 3వ పేజీలో...

24 నుంచి బడ్జెట్ సమావేశాలు

అసెంబ్లీ స్పీకర్ అధ్యక్షతన భేటీలో నిర్ణయం

వారం రోజుల పాటు కొనసాగే అవకాశం

ఈ నెల 25 లేదా 26న పూర్తిస్థాయి బడ్జెట్!

31లోపు ద్రవ్య బిల్లు ఆమోదం తప్పనిసరి

'రైతు భరోసా' పథకంపై శాసనసభలో చర్చ

రాష్ట్ర చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహంపైనా!

ఇతర బిల్లులను సభలో ప్రవేశపెట్టే చాన్స్



హైదరాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 24న ప్రారంభం కానున్నాయి. ఇవి దాదాపు వారం రోజుల పాటు కొనసాగే అవకాశం ఉంది. 25న లేదా 26న రాష్ట్ర పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టవచ్చని సమాచారం. ఈ మేరకు సమావేశాల ప్రారంభ తేదీని ప్రభుత్వం ఖరారు చేసింది. బడ్జెట్ సమావేశాలను ఈ నెలలోపే పూర్తి చేసి, రాష్ట్ర వ్యయాలకు సభ అనుమతి పొందాల్సి ఉన్నందున.. గురువారం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. శాసన మండలి

మిగతా 12వ పేజీలో...



ఆత్మహత్యల్లో భారత్ టాప్

ప్రతి లక్ష మందిలో 12కు పైగా బలవన్మరణాలు

2022లో 1.71 లక్షల మంది ఆత్మహత్య

2

యూజీసీ-నెట్ ప్రశ్నపత్రం లీక్ కాలేదు

స్ర్కీన్‌షాట్‌పై తేదీ మార్చి టెలిగ్రామ్‌లో వైరల్ చేశారు

సీబీఐ దర్యాప్తులో వెల్లడి

త్వరలోనే చార్జిషీట్

రికవరీ బంధు!


రైతుబంధు పథకం కింద ఇచ్చిన సొమ్ము తిరిగి స్వాధీనం

మేడ్చల్ కలెక్టర్ ఆదేశాలు

జిల్లాలో 33 ఎకరాల భూమిలో 1981లోనే లే-అవుట్

అయినా గత ఐదేళ్లలో పథకం కింద రూ.17 లక్షలు లబ్ధి

ఫిర్యాదు రావడంతో రికవరీ



హైదరాబాద్, మేడ్చల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 33 ఎకరాల వ్యవసాయేతర భూమికి రైతుబంధు సాయం దక్కింది! ఒక సీజన్‌లో కాదు.. ఏకంగా ఐదేళ్లు! దీనిపై ఫిర్యాదు రావడంతో ఆ సొమ్ము రికవరీకి ఆ జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని కీసర రెవెన్యూ డివిజన్ పరిధి ఘట్‌కేసర్ మండలం పోచారం గ్రామంలో మోత్కుపల్లి యాదగిరి రెడ్డి అనే వ్యక్తికి సర్వే నంబర్లు- 38, 39, 40లో 30 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని 1981లోనే లే అవుట్లుగా అమ్ముకున్నారని రెవెన్యూ

మిగతా 14వ పేజీలో...

సిరిసిల్లకు పవర్‌లూమ్ క్లస్టర్

తీసుకురండి

కేంద్ర మంత్రిగా మీకు వచ్చిన అవకాశాన్ని వాడుకోండి

బండి సంజయ్‌కి కేటీఆర్ లేఖ

రాహుల్.. రేవంత్.. ఇద్దరిలో ఎవరు సన్నాసి? 12

అదానీపై ద్వంద్వ వైఖరి ఎందుకు?

రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన బీఆర్ఎస్ నేత

ఇన్నాళ్లకు నేతన్నలు గుర్తొచ్చారా?

పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారు

సిరిసిల్లలో ఆత్మహత్యలను ఆపలేదేం?

పవర్‌లూంలు మూతపడేలా చేసింది మీరు కాదా.. కేటీఆర్‌కు బండి సంజయ్ కౌంటర్

టీటీడీ వీరప్పన్ వారసుల చేతిలో ఉండేది

ఎర్రచందనం దొంగలను వదిలేది లేదు

తిరుమలలో మీడియాతో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి 12

ఆత్మహత్యల్లో భారత్ టాప్



న్యూఢిల్లీ, జూలై 11: ఇటీవల ముంబైలో తండ్రీ కొడుకుల ఆత్మహత్య సంఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. భారత్‌లో యువకులతోపాటు వృద్ధులు కూడా ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఆత్మహత్య అని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవును.. ఇది నిజం అనేలా ప్రపంచంలోనే అత్యధిక ఆత్మహత్యలు జరిగిన దేశంగా భారత్ నిలవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) ఏప్రిల్‌లో విడుదల చేసిన నివేదిక ప్రకారం 2022లో ప్రపంచంలోనే అత్యధికంగా భారత్‌లో 1.71 లక్షల మంది ఆత్మహత్య చేసుకున్నారు. దేశంలో ఆత్మహత్యల రేటు ప్రతి లక్షకు 12.4 మందికి పెరిగిందని ఈ నివేదిక స్పష్టం చేసింది. ఇలాంటి పరిస్థితులకు దారితీస్తున్న అంశాలేమిటి అనే చర్చ ఇప్పుడు దేశవ్యాప్తంగా మొదలైంది. అయితే.. మానసిక ఒత్తిడే దీనికి ప్రధాన కారణమని ఆరోగ్య రంగ నిపుణులు చెబుతున్నారు. కొంతమందిలో జన్యుపరమైన కారణాలు, కొన్నిరకాల ఒత్తిళ్ల వల్ల ప్రేరేపితమవుతున్న మానసిక అనారోగ్యంగా దీన్ని అభివర్ణిస్తున్నారు. 'ఆత్మహత్యకు అత్యంత సాధారణ కారణం డిప్రెషన్. దీన్నే మేం ఒత్తిడి అని పిలుస్తాం. వెంటాడుతున్న సమస్యల వల్ల ఒత్తిడికి గురికావొచ్చు. ఒక్కోసారి హఠాత్తుగా క్షణికావేశంలోనూ ఆత్మహత్య నిర్ణయాలు తీసుకోవచ్చు. ఎక్కువ శాతం కేసుల్లో ఒత్తిడే ప్రధాన కారణంగా ఉంటుంది' అని ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ రాజీవ్ మెహతా చెప్పారు. సాధారణంగా ఈ ఒత్తిళ్లకు పని, ఆర్థిక పరమైన, మానవ సంబంధాలు, ఆరోగ్య పరమైన సమస్యలు ప్రధాన కారణమని ఆయన చెప్పారు. ఒత్తిడి తీవ్రమైనప్పుడు అది డిప్రెషన్‌గామారి ఆత్మహత్యకు దారితీస్తుందని పేర్కొన్నారు. ఆత్మహత్య చేసుకున్న వారిలో 50-90% మంది నిరాశ, ఆందోళన, బైపోలార్ డిజార్డర్ వంటి మానసిక అనారోగ్యంగో బాధపడినవారేనని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

ఆత్మహత్యలు సామాజిక సమస్య: సుప్రీం కోర్టు

భారత్‌లో ఆత్మహత్యలు పెరగడాన్ని సుప్రీం కోర్టు సామాజిక సమస్యగా అభివర్ణించింది. ఆత్మహత్యలను నివారించడానికి ప్రజారోగ్య కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిల్‌పై అత్యున్నత ధర్మాసనం గురువారం స్పందించింది. ఈ అంశంపై నాలుగు వారాల్లోగా పూర్తి వివరాలతో వివరణ ఇవ్వాలని కోరుతూ కేంద్రాన్ని ఆదేశించింది. పెరుగుతున్న ఆత్మహత్యలను ఎదుర్కోవడానికి పటిష్ట చర్యలు అవసరమని న్యాయవాది, పిటిషనర్ గౌరవ్ కుమార్ బన్సాల్ చేసిన వాదనలను పరిగణనలోకి తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం దీనిపై పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది.

లోకం తీరు



మణిపూర్ సమస్యపై పార్లమెంటులో గళమెత్తుతాం

- సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- మణిపూర్‌పై ప్రధాని ఎప్పుడు మాట్లాడతారు ? : ప్రియాంక గాంధీ

న్యూఢిల్లీ, జూలై 11: మణిపూర్‌లో శాంతి స్థాపన అంశంపై పార్లమెంట్ సమావేశాల్లో బలంగా మాట్లాడతామని కాంగ్రెస్, ఇండియా కూటమి తరఫున లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి మణిపూర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రకటించారు. అలాగే, మణిపూర్‌లో పర్యటించి శాంతి స్థాపనకు కృషి చేయాలని ప్రధాని మోదీని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో సోమవారం పర్యటించిన రాహుల్ గాంధీ అక్కడి పలు పునరావాస శిబిరాలను సందర్శించి ప్రజలతో స్వయంగా మాట్లాడారు. ఇందు కు సంబంధించిన వీడియోను గురువారం ఎక్స్(ట్విటర్)లో పోస్ట్ చేసిన ఆయన.. ఇప్పటికీ ఆ రాష్ట్రం రెండు ముక్కలుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో హింస చెలరేగినప్పటి నుంచి ఇప్పటిదాకా మూడు సార్లు ఆ రాష్ట్రంలో పర్యటించానని.. పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేదని పేర్కొన్నారు. మణిపూర్‌లో హింస కొనసాగుతోందని, అమాయక ప్రజలు ప్రాణాపాయంలో ఉన్నారని, వేలాది కుటుంబాలు పునరావాస శిబిరాల్లో తలదాచుకుంటున్నాయని వివరించారు. ఈ పర్యటనలో మూడు జిల్లాల్లోని వేర్వేరు పునరావాస శిబిరాలను సందర్శించిన రాహుల్ గాంధీ.. మైతేయులు, కుకీలతో మాట్లాడారు. రాహుల్ గాంధీ చేసిన పోస్ట్‌కు స్పందించిన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ.. మణిపూర్ సమస్యపై ప్రధాని మోదీ ఎప్పుడు మాట్లాడతారని ప్రశ్నించారు. మణిపూర్‌లో శాంతి స్థాపనకు ప్రభుత్వం ఎందుకు ప్రయత్నించడం లేదని నిలదీశారు.

మాజీ అగ్నివీరులకు 10% రిజర్వేషన్

- సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్ చీఫ్‌ల వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 11: కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నిర్ణయానికి అనుగుణంగా మాజీ అగ్నివీరులకు తమ బలగాల్లో 10 శాతం కానిస్టేబుళ్ల పోస్టులను రిజర్వు చేయనున్నట్టు సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నీనా సింగ్, బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నితిన్ అగర్వాల్ గురువారం వెల్లడించారు. "మాజీ అగ్నివీరుల నియామకానికి సంబంధించి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తీసుకున్న కీలక నిర్ణయానికి అనుగుణంగా వారి నియామక ప్రక్రియను సీఐఎస్ఎఫ్ కూడా సిద్ధం చేస్తోంది" అని సింగ్ పేర్కొన్నారు. వయోపరిమితిలో సడలింపుతోపాటు దేహదారుఢ్య పరీక్షల్లోనూ సడలింపులు ఉంటాయని చెప్పారు. మొదటి సంవత్సరంలో వయోపరిమితి సడలింపు ఐదేళ్లు, తర్వాతి సంవత్సరంలో మూడేళ్లు ఉంటుందని ఓ న్యూస్ చానల్‌కు ఆమె తెలిపారు.

ఐఫోన్ యూజర్లకు హెచ్చరికలు

- 'కిరాయి స్పైవేర్'తో జాగ్రత్త: యాపిల్

వాషింగ్టన్, జూలై 11: భారత్‌తోపాటు.. 98 దేశాల ఐఫోన్ యూజర్లకు యాపిల్ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. 'కిరాయి స్పైవేర్' దాడులు జరుగుతున్నాయని అప్రమత్తం చేసింది. ఐఫోన్లలో స్పైవేర్ చొరబడ్డ యూజర్లను గుర్తించి, వారికి వ్యక్తిగతంగా సందేశాలు పంపుతోంది. "మీరు ప్రముఖులు కావడం వల్ల.. మీ ఐఫోన్‌పై కిరాయి స్పైవేర్ చొరబడింది. మీరు మీ డివైజ్ రక్షణకు జాగ్రత్తలు తీసుకోండి" అని సూచించింది.

అదానీ ప్రాజెక్టులను విమర్శించారని ఎన్జీవో ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ రద్దు

న్యూఢిల్లీ, జూలై 11: అదానీకి మంజూరు చేసిన ప్రాజెక్టుల వల్ల పర్యావరణం దెబ్బతింటుందని విమర్శించిన ఓ ఎన్జీవోకు విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) రిజిస్ట్రేషన్‌ను కేంద్ర హోం శాఖ రద్దు చేసింది. సదరు సంస్థకు ఆన్‌లైన్‌లో రద్దు విషయాన్ని తెలియజేసింది. సెంటర్ ఫర్ ఫైనాన్సియల్ అకౌంటబులిటీ (సీఎఫ్ఏ) అనే సంస్థ దేశీయ, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల పాత్రను.. అభివృద్ధి, మానవ హక్కులు, పర్యావరణం, తదితర రంగాల్లో వాటి ప్రభావాన్ని పర్యవేక్షించడంతో పాటు విశ్లేషణ చేస్తుంది. గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో అదానీ గ్రూప్ నిర్వహిస్తున్న ప్రత్యేక ఆర్థిక మండలికి మంజూరు చేసిన అదనపు ప్రాజెక్టుల వల్ల పర్యావరణం కలుషితమవుతుందని సీఎఫ్ఏ నివేదికలో పేర్కొంది. ఈ నివేదిక వెల్లడించిన కొన్ని రోజులకే సీఎఫ్ఏ.. ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్‌ను కేంద్ర హోం శాఖ రద్దు చేసింది. కేంద్రం నుంచి ఇంకా ఉత్తర్వులు రాలేదని, ఆన్‌లైన్‌లో ఈ విషయాన్ని తెలియజేశారని సీఎఫ్ఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెల్లడించారు.

కేంద్రం, రాష్ట్రాల మధ్య వారధిగా ఈ ఆఫీస్!

- వేగంగా అనుమతుల మంజూరుకు మార్గం

న్యూఢిల్లీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఒక రాష్ట్రం నుంచి ఏదైనా ఫైలు కేంద్రానికి వచ్చిందంటే ఆ పని ఎప్పుడు పూర్తవుతుందో తెలియదు! ఆ ఫైలు ఎక్కడుందో? ఏ శాఖలో ఉందో? అంతుచిక్కదు. ఆయా రాష్ట్రాల అధికారులు ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిందే. దీనికి 'ఈ-ఆఫీస్'తో చెక్ పెట్టాలని భావిస్తోంది కేంద్రం. మోదీ 3.0 ప్రభుత్వం వంద రోజుల ఎజెండాలోని ప్రధానమైన వాటిలో ఈ-ఆఫీస్ కూడా ఒకటి. తొలుత కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో అమలుకు కార్యాచరణ సిద్ధం చేసింది. అందులో భాగంగా ఎంపికచేసిన 133 కార్యాలయాల్లో వంద రోజుల్లో ఈ-ఆఫీస్ అమలు చేయాలని ఆదేశించింది. అయితే కొన్ని రాష్ట్రాలు కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఈ-ఆఫీస్ ద్వారా రాష్ట్రాల సమాచారాన్ని కేంద్రం పర్యవేక్షిస్తుందనే భయం నెలకొంది. అది సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని భావిస్తున్నాయి.

భారత జనాభా @ 170 కోట్లు!

- 2062నాటికి గరిష్ఠానికి చేరనున్న సంఖ్య
- ఐరాస 2024 నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 11: ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ ఇప్పటికే రికార్డులకెక్కింది. గత ఏడాదే చైనాను దాటి, అగ్రస్థానంలో నిలిచింది. ఈ క్రమంలో 2062వ సంవత్సరానికల్లా భారతదేశ జనాభా 170 కోట్లకు చేరుతుందని ఐరాస నివేదిక వెల్లడించింది. ఇక 2054 నాటికి 100 దేశాల్లో పనిచేసే జనాభా సంఖ్య (20 నుంచి 64 ఏళ్ల వారు) భారీగా పెరుగుతుందని తెలిపింది. ఇలాంటి దేశాల్లో అభివృద్ధికి అపార అవకాశాలు ఉంటాయని.. వాటిని అందిపుచ్చుకోవాలంటే విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెట్టాలని పేర్కొంది. ఉద్యోగాలను సృష్టించేందుకు సంస్కరణలను అమలు చేయాలని, ప్రభుత్వాల సామర్థ్యాన్ని మెరుగుపర్చుకోవాలని సూచించింది. ప్రస్తుతం(2024) 820 కోట్లుగా ఉన్న ప్రపంచ జనాభా 2080 నాటికి 1030 కోట్లకు చేరుతుందని నివేదిక తెలిపింది. 2070 నాటికి ప్రపంచ జనాభాలో 65 ఏళ్లు, ఆ పైబడిన వారి సంఖ్య 220 కోట్లకు చేరుతుందని.. ఇది 18 ఏళ్లలోపు వారి సంఖ్య కంటే అధికమని పేర్కొంది. ప్రపంచంలోని 63 దేశాల్లో 2024 చివరి వరకు జనాభా గరిష్ఠానికి చేరుతుందని, మరో 48 దేశాల్లో 2024 నుంచి 2054 మధ్యలో గరిష్ఠానికి చేరుతుందని వివరించింది. భారత్, ఇండోనేషియా, నైజీరియా, పాకిస్థాన్, అమెరికా సహా మిగిలిన 126 దేశాల్లో 2054 తర్వాత జనాభా పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఇక ప్రపంచవ్యాప్తంగా మనుషుల జీవిత కాలం(ఆయుర్దాయం) కరోనా సమయంలో 70.9 ఏళ్లకు తగ్గగా.. ప్రస్తుతం (2024) అది 73.3 ఏళ్లకు పెరిగిందని తెలిపింది.

యూజీసీ-నెట్ ప్రశ్నపత్రం లీక్ కాలేదు

లీకేజీకి ఆధారంగా చూపిస్తున్న స్ర్కీన్‌షాట్‌పై తేదీ మార్చి.. టెలిగ్రామ్ చానల్‌లో వైరల్ చేశారు

సీబీఐ దర్యాప్తులో వెల్లడి త్వరలోనే చార్జిషీట్

న్యూఢిల్లీ, జూలై 11: 'యూజీసీ-నెట్ ప్రశ్నపత్రం లీక్‌కు సంబంధించి సీబీఐ దర్యాప్తులో సంచలన అంశాలు వెల్లడయ్యాయి! ఆ ప్రశ్నపత్రం అసలు లీక్ కాలేదని.. టెలిగ్రామ్ చానళ్లలో వైరల్ అయిన ప్రశ్నపత్రం స్ర్కీన్‌షాట్‌పై తేదీని ఓ యాప్ సాయంతో మార్చారని సీబీఐ దర్యాప్తులో తేలింది. దీని వెనుక ఒక పాఠశాల విద్యార్థి ఉన్నాడని.. ఒక యాప్ సాయంతో ఆ విద్యార్థి తయారుచేసిన స్ర్కీన్‌షాట్లను ఒక వ్యక్తి సర్క్యులేట్ చేశాడని వెల్లడైంది. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి అనధికారికంగా తీసుకెళ్లిన సీబీఐ.. ఆ వ్యక్తిపై చార్జిషీట్ దాఖలు చేసేందుకు, చీటింగ్ కేసు పెట్టేందుకు సిద్ధమైనట్లు సమాచారం. వర్సిటీలు, కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకాలకు అర్హత సాధించడానికి, పీహెచ్‌డీల్లో ప్రవేశాలకు, జూనియర్ రిసెర్చ్ ఫెలోషి‌ప్‌కు అర్హత సాధించడానికి ఏటా నిర్వహించే యూజీసీ-నెట్‌ను కేంద్రం ఈ ఏడాది జూన్ 18న నిర్వహించిన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా 317 నగరాల్లో 1205 పరీక్షా కేంద్రాల్లో 11 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్ష రాశారు. ఆరోజు ఈ పరీక్షను రెండు సెషన్లలో (ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 దాకా ఒక సెషన్. మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల దాకా రెండో సెషన్) నిర్వహించారు. అయితే.. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల సమయంలో యూజీసీ ప్రశ్నపత్రం స్ర్కీన్‌షాట్ పేరిట ఒక ఫొటో ఓ టెలిగ్రామ్ చానల్‌లో ప్రత్యక్షమైంది. జూన్ 17 తేదీతో ఉన్న ఆ స్ర్కీన్‌షాట్ వైరల్ కావడంతో యూజీసీ-నెట్ పరీక్షను రద్దు చేస్తున్నట్టు జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. దీనిపై దర్యాప్తు చేసిన సీబీఐ.. ఆ స్ర్కీన్‌షాట్ ఓ పాఠశాల విద్యార్థి తయారుచేసిందని, దీని వెనుక పెద్ద స్థాయి కుట్ర ఏదీ లేదని గుర్తించింది.



నీట్ పేపర్ లీకేజీ కేసులో కీలక నిందితుడు రాకీ అరెస్టు!

- పట్నాలో అదుపులోకి తీసుకున్న సీబీఐ

నీట్-యూజీ పేపర్ లీక్ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకడైన రాకేశ్ రంజన్ అలియాస్ రాకీ అనే వ్యక్తిని సీబీఐ పట్నాలో అరెస్ట్ చేసింది. బిహార్‌లోని నలందకు చెందిన రాకీ.. పేపర్ లీకేజీ దందా సూత్రధారి అయిన సంజీవ్‌ముఖియాకి బంధువు. నీట్ పేపర్ లీక్ అయిన విషయం బయటపడినప్పటి నుంచీ రాకీ పరారీలో ఉన్నాడు. గురువారం ఉద యం సీబీఐ అధికారులు అతణ్ని పట్నా శివార్లలో అదుపులోకి తీసుకున్నారు. వెంటనే అతణ్ని పట్నాలోని ప్రత్యేక కోర్టులో హాజరుపరిచి 10రోజుల కస్టడీకి తీసుకున్నారు. గురువారం అతడు ఇచ్చిన సమాచారం ఆధారంగా పట్నాలోని మూడు చోట్ల, కోల్‌కతాలో ఒకచోట సోదాలు నిర్వహించారు. ఇప్పటిదాకా సీబీఐ ఈ కేసులో బిహార్, ఝార్ఖండ్‌కు రాష్ట్రాలకు చెందిన 8 మందిని అరెస్ట్ చేసింది. రాకీ అరెస్టుతో ఆ సంఖ్య తొమ్మిదికి చేరింది. కాగా, నీట్ అక్రమాలపై ఆరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, ముమ్మరంగా దర్యాప్తుచేస్తున్న సీబీఐ పట్నాలో రెండుచోట్ల, కోల్‌కతాలోని మరో రెండు చోట్ల సోదాలు నిర్వహించినట్టు తెలుస్తోంది. మొత్తం ఈ పేపర్ లీక్‌కు కేంద్రం హజారీబాఘ్ (ఝార్ఖండ్)లోని ఒయాసిస్ స్కూలేనని అంచనాకు వచ్చినట్టు సీబీఐ వర్గాలు చెబుతున్నాయి. అక్కడ లీకయిన పేపర్ బిహార్‌కు చేరిందని సీబీఐ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. మే 5వ తేదీన నిర్వహించిన నీట్ పరీక్షకు సంబంధించి మొత్తం 9 సెట్ల పేపర్లు స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖకు మే 3న చేరాయని.. అక్కడి నుంచి రెండు సెట్ల పేపర్లను నీట్ పరీక్షా కేంద్రమైన ఒయాసిస్ స్కూల్‌కు పంపించారని.. కానీ, అప్పటికే ఆ రెండు సెట్ల పేపర్ల సీళ్లు తొలగించి ఉన్నాయని సీబీఐ వర్గాల సమాచారం. మరోవైపు.. నీట్ అక్రమాలపై దాఖలైన పిటిషన్లపై గురువారం విచారణ జరపాల్సిన సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వం, జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ బుధవారం దాఖలు చేసిన అఫిడవిట్లు ఇంకా కొంత మంది పిటిషనర్లకు అందనందున విచారణను జూలై 18కి వాయిదా వేస్తున్నట్టు తెలిపింది. సీబీఐ నుంచి దర్యాప్తునకు సంబంధించి నివేదిక తమకు అందిందని వెల్లడించింది. కాగా.. నీట్-యూజీ కౌన్సెలింగ్ ప్రక్రియ జూలై మూడోవారం నుంచి మొదలై నాలుగు రౌండ్లలో జరుగుతుందని కేంద్రం తాజాగా దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొంది. ఇక.. నీట్ వ్యవహారంపై కొనసాగుతున్న అనిశ్చితి నేపథ్యంలో ఈ పరీక్ష రాసిన పలువురు అభ్యర్థులు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌ను గురువారం ఆయన నివాసంలో కలిశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో ఆలస్యం జరిగితే.. దాని ప్రభావం అకడమిక్ క్యాలెండర్‌పై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ ప్రజాస్వామ్యం మాకొద్దు!

- పాశ్చాత్య దేశాల ప్రజల్లో వ్యవస్థపై అసంతృప్తి
- 27 దేశాల్లో ప్యూ రీసెర్చ్ సెంటర్ సర్వే

న్యూఢిల్లీ, జూలై 11: అధిక ఆదాయ దేశాలు, ప్రత్యేకంగా పశ్చిమ దేశాల్లోని ప్రజలు తమ దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ అంశంపై ప్యూ రీసెర్చ్ సెంటర్ 27 దేశాల్లో 900కు పైగా సర్వే నిర్వహించింది. ఉత్తర అమెరికాలో 68% మంది ప్రజలు ప్రస్తుత ప్రజాస్వామ్యం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మెక్సికోలో సైతం 50% మంది ప్రజలు ఇదే అభిప్రాయంతో ఉన్నారు. జస్టిన్ ట్రూడో నేతృత్వంలోని కెనడాలో కేవలం 52% మంది మాత్రమే ప్రజాస్వామ్యం పట్ల సానుకూలంగా ఉ న్నారు. యూరప్ దేశాల్లో ఒక్క స్వీడన్‌లో మాత్రమే 75% మంది ప్రజలు ప్రజాస్వామ్యంపై సంతృప్తి ప్రకటించారు. ఇక ప్రపంచంలోని అత్యంత పురాతన ప్రజాస్వామ్య దేశాల్లో ఒకటైన ఫ్రాన్స్‌లో కేవ లం 35% మంది మాత్రమే సానుకూలత తెలపడం విశేషం. గ్రీస్‌లో వీరిసంఖ్య అత్యల్పంగా 22శాతంగా నమోదైంది. ఇక ఆసియా దేశాల్లో సింగపూర్, భారత్ మాత్రమే 75శాతానికి పైగా సంతృప్తిని నమోదు చేశాయి. సింగపూర్‌లో 80శాతం, భారత్‌లో 77% మంది ప్రజాస్వామ్యం తీరుపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ జాబితాలో జపాన్ 31 శాతంతో అడుగున ఉంది. సర్వే నిర్వహించిన 11 దేశాల్లోని 50% మంది ప్రజాస్వామ్యం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. 17 పాశ్చాత్య దేశాల్లోని 11 చోట్ల మాత్రం ఈ విషయంలో ప్రజలు సంతృప్తిగా లేరు.

లా సిలబస్‌లో మనుస్మృతి.. విమర్శలతో వెనక్కి!

- ప్రతిపాదనను తిరస్కరించామని ఢిల్లీ వర్సిటీ వీసీ వివరణ

న్యూఢిల్లీ, జూలై 11: లా డిగ్రీ సిలబస్‌లో మనుస్మృతిని ప్రవేశపెట్టటానికి రంగం సిద్ధం చేసిన ఢిల్లీ విశ్వవిద్యాలయం (డీయూ) సర్వత్రా విమర్శలు రావడంతో వెనక్కు తగ్గింది. సవరించిన సిలబస్‌లో మనుస్మృతిని చేర్చాలనే ప్రతిపాదనను తిరస్కరించినట్లు గురువారం డీయూ వైస్ చాన్సలర్ యోగేశ్ సింగ్ పేర్కొన్నారు. వాస్తవానికి సవరించిన సిలబస్ పత్రంలో మనుస్మృతిని చేర్చాలనే ప్రతిపాదనపై డీయూ ఎకడమిక్ కౌన్సిల్ నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించింది. కౌన్సిల్ ఆమోదిస్తే.. రానున్న విద్యాసంవత్సరం నుంచి డిగ్రీ స్థాయి లా సిలబస్‌లో మనుస్మృతి కూడా ఒక భాగమయ్యేదే. పైగా.. విద్యార్థులు భారతీయ సంప్రదాయాలను నేర్చుకోవాలన్న నూతన విద్యావిధానం-2020 మార్గదర్శకాల ప్రకారమే సిలబస్‌లో అనుబంధ అంశంగా మనుస్మృతిని చేర్చాలని నిర్ణయించినట్లు డీయూ లా విభాగం డీన్ ప్రొఫెసర్ అంజువాలి టిక్కూ పేర్కొన్నారు. కాగా, డీయూకి చెందిన అధ్యాపక సంఘం 'సోషల్ డెమోక్రటిక్ టీచర్స్ ఫ్రంట్' దీనిని తీవ్రంగా వ్యతిరేకించింది. దేశ జనాభాలో 85 శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల పట్ల, జనాభాలో 50 శాతంగా ఉన్న మహిళల పట్ల తీవ్ర వివక్ష చూపి, వారి ప్రాథమిక హక్కులను నిరాకరించే మనుస్మృతిని సిలబస్‌లో ఎలా ప్రవేశపెడతారని ప్రశ్నిస్తూ డీయూ వీసీకి లేఖ రాసింది. ఫలితంగా ఆ 'ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్లుగా' వీసీ నుంచి ప్రకటన విడుదలైంది.

బ్రిటన్ పార్లమెంటులో భగవద్గీత

- పవిత్ర గ్రంథం సాక్షిగా పలువురు ఎంపీల ప్రమాణం
- వీరిలో మాజీ ప్రధాని సునాక్, శివానీ రాజా, కనిష్క..!

లండన్, జూలై 11: బ్రిటన్ దిగువ సభ హౌస్ ఆఫ్ కామన్స్‌కు ఎన్నికైన పలువురు భారతీయ ఎంపీలు ప్రమాణ స్వీకారం సందర్భంగా తమ ప్రత్యేకత చాటుకున్నారు. ఇటీవలి ఎన్నికల్లో మొత్తం 29 మంది భారత సంతతి వారు యూకేలో పార్లమెంటుకు ఎన్నికయ్యారు. వీరిలో జన్మతః హిందువులైన మాజీ ప్రధాని రిషి సునాక్‌తో పాటు శివానీ రాజా, కనిష్క నారాయణ్‌లు భగవద్గీతపై ప్రమాణం చేశారు. శివానీ.. గుజరాత్ నుంచి వెళ్లి బ్రిటన్‌లో వ్యాపారవేత్తగా రాణిస్తున్నారు. గత వారం ఎన్నికల్లో ఈమె కన్జర్వేటివ్ పార్టీ నుంచి గెలిచారు. యూకేలో వ్యాపారవేత్తగా రాణిస్తున్నారు. కనిష్క.. అధికార లేబర్ పార్టీ తరఫున తొలిసారిగా వేల్ ఆఫ్ గ్లామెర్గాన్ నుంచి నెగ్గారు. వేల్స్ నుంచి పార్లమెంటుకు ఎన్నికైన తొలి భారత సంతతి ఎంపీ ఈయన. సిక్కు ఎంపీలు తాన్‌దేశీ, గురీందర్ సింగ్ జోసన్, హర్‌ప్రీత్ ఉప్పల్, సత్వీర్ కౌర్, వారిందర్ సింగ్ జస్‌లు తమ పవిత్ర గ్రంథం గురు గ్రంథ్ సాహిబ్ సాక్షిగా ప్రమాణం చేశారు. అయితే, వీరు ఆ గ్రంథం చేతబట్టుకోలేదు. ఇక మాజీ మంత్రి ప్రీతి పటేల్‌తో పాటు క్లైరీ కౌటిన్హో, మునిరా విల్సన్, కేరళకు చెందిన సోజన్ జోసెఫ్ (యాష్‌ఫోర్డ్ కెంట్) తమ ప్రమాణం సందర్భంగా బైబిల్‌ను ఎంచుకున్నారు.

నిరంకుశ ముప్పులో మన ప్రజాస్వామ్యం


- తీవ్ర ఒత్తిడిలో మీడియా పౌర హక్కులు, ఎన్నికలు
- భారత్‌లో పరిస్థితి అధ్వానం
- 3.5 రేటింగ్ ఇచ్చిన అమెరికా సంస్థ

న్యూఢిల్లీ, జూలై 11: ప్రజాస్వామ్యం తీవ్ర నిరంకుశ ఒత్తిడికి గురి అవుతున్న దేశాల జాబితాలో భారత్ పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నదని అమెరికాకు చెందిన ఓ సంస్థ హెచ్చరించింది. దాదాపు వెయ్యి మంది స్కాలర్స్‌ను నమూనాగా తీసుకుని 1 నుంచి 5 వరకు సూచీల (అథారిటేరియన్ థ్రెట్ ఇండెక్స్) ఆధారంగా యాంటీ అథారిటేరియనిజం గ్రూప్' అనే సంస్థ అమెరికా సహా ఆరు దేశాలకు రేటింగ్ ఇచ్చింది. ప్రతి వారాంతంలో వీరిపై జరిపిన అధ్యయాన్ని ఆధారంగా చేసుకుని తాజాగా సూచీలను నిర్ణయించింది. ఆరోగ్య ప్రజాస్వామ్యం కలిగిన దేశానికి రేటింగ్ వన్ ఇచ్చింది. ఈ సూచీల్లో భారత్‌కు 3.5 రేటింగ్ ఇచ్చారు. అత్యధికంగా నిరంకుశత ముప్పును భారత్ కలిగి ఉన్నదని పేర్కొంది. హక్కులు, ప్రజాస్వామ్యం విషయంలో అధ్వాన్న స్థితిలో ఉన్నదని వ్యాఖ్యానించింది. ఇక మిగతా దేశాల్లో అమెరికా 2.1, పోలాండ్ 2.3., జర్మనీ 1.5, కెనడా 1.5, ఇంగ్లాండ్ 1.8 రేటింగ్‌లో ఉన్నాయి. 2017 నుంచి తీస్తున్న సూచీల ఆధారంగా తాజాగా రేటింగ్‌ను ఇచ్చినట్టు ఈ సంస్థ ను ఉటంకిస్తూ ఫైనాన్సియల్ టైమ్స్ ఒక కథనం ప్రచురించింది. ప్రధానంగా అమెరికాలోని ప్రజాస్వా మ్య వ్యవస్థలపై దృష్టి సారించిన ఈ గ్రూపు, దానితోపాటు మరో ఐదు దేశాలపైనా అధ్యయనం చేసింది. ఇందుకు ఆరు ప్రమాణాలను పెట్టుకుంది. అవి 1) మీడియా పట్ల వైఖరి 2) కార్యనిర్వాహక అవరోధాలు 3) ఎన్నికలు 4) పౌర హక్కులు 5) పౌర హింస 6) వ్యవహారిక భాష.

ట్రైనీ ఐఏఎస్‌పై విచారణకు ఏకసభ్య కమిటీ

నియమించిన కేంద్రం

- మహిళా ఐఏఎస్ తప్పుడు సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందినట్టు ఆరోపణలు



న్యూఢిల్లీ, జూలై 11: శిక్షణ దశలోనే వివాదాస్పదంగా మారిన ట్రైనీ ఐఏఎస్ అధికారిణి పూజా మనోరమ దిలీప్ ఖేడ్కర్‌పై వచ్చిన ఆరోపణల మీద విచారణ జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం ఏకసభ్య కమిటీని నియమించింది. దర్యాప్తునకు కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి స్థాయి సీనియర్ అధికారిని నియమించినట్టు సిబ్బంది, శిక్షణ శాఖ తెలిపింది. ఈ కమిటీ రెండు వారాల్లో నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. శిక్షణ సమయంలోనే ఆమె పరిధికి మించి వ్యవహరించడంతో ఆమెను మహారాష్ట్రలోని పుణె నుంచి వషీం జిల్లాకు బదిలీ చేశారు. తన సొంత ఆడీ కారుకు ఎర్రలైటు ఏర్పాటు చేయాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలంటూ అనుచితంగా ఒత్తిడి తేవడంతో అధికారులు ఈ చర్య తీసుకున్నారు. ప్రస్తుతం ఆమె అర్హతలపైనా ఆరోపణలు రావడంతో కేంద్రం దర్యాప్తు కమిటీ ఏర్పాటు చేసింది. ఓబీసీ, వికలాంగ కోటా కింద ఆమె ఉద్యోగం సంపాదించారు. అయితే ఇందుకు తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించారని ఫిర్యాదులు అందడంతో ఏకసభ్య కమిషన్ వాటిపైనా దర్యాప్తు చేయనుంది. అంధత్వ సమస్యలు, మానసిక పరమైన రుగ్మతలు ఉన్నాయన్న కారణాలు చూపి వికలాంగుల కోటా కింద ఉద్యోగం పొందారు. వార్షిక ఆదాయం రూ.8 లక్షల కన్నా తక్కువ ఉందని చూపించి ఓబీసీ నాన్ క్రీమీలేయర్ కింద కూడా అర్హత పొందారు. వాస్తవానికి ఆమె ఈ రెండు కేటగిరీలకు చెందరని సమాచార హక్కు కార్యకర్త విజయ్ కుంభార్ ఆరోపించారు. అంగవైకల్యం ఉందని నిరూపించేందుకు వైద్య పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి కాగా, ఆమె ఎలాంటి పరీక్షలు చేయించుకోలేదు. ఆమె తండ్రి ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశారు. ఆ సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో తనకు రూ.40 కోట్ల ఆదాయం ఉన్నట్టు చూపించారు. అందువల్ల ఆమె నాన్ క్రీమీలేయర్ పరిధిలోకి రారని కుంభార్ తెలిపారు. తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించి ఉద్యోగం పొందారని ఆరోపించారు. సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో 841 ర్యాంకు వచ్చినా ఐఏఎస్ ఇవ్వడంపైనా అనుమానాలు ఉన్నాయి. వీటన్నింటిపైనా ఏకసభ్య కమిషన్ దర్యాప్తు చేయనుంది. 2023 బ్యాచ్‌కు చెందిన ఆమె 24 నెలల పాటు ట్రైనీగా శిక్షణ పొందాల్సి ఉంది.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించం

- ప్లాంట్‌ను పరిరక్షించడం మా బాధ్యత
- ప్రకటించిన కేంద్ర మంత్రి కుమారస్వామి

విశాఖపట్నం, జూలై 11(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరణ చేయబోమని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ప్రకటించారు. ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, ఎంపీ ఎం. శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజుతో కలసి ఆయన గురువారం ఉదయం స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించారు. సీఎండీ అతుల్ భట్, ఇతర అధికారులు వారికి వివిధ విభాగాల పనితీరు వివరించారు. అనంతరం సమావేశ మందిరంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రస్తుతం ప్లాంట్ పరిస్థితి, ఆర్థిక వ్యవహారాల గురించి తెలిపారు. అనంతరం బయటకు వచ్చిన మంత్రి.. విజిటర్స్ బుక్‌లో తన అభిప్రాయాన్ని రాశారు. 'విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించిన తరువాత ఈ దేశ ఆర్థిక అభివృద్ధికి ఈ ప్లాంట్ ఎంతో ఉపయోగపడుతుందని అర్థమైంది. అనేక కుటుంబాలు వారి జీవనోపాధి, రోజువారీ అవసరాల కోసం దీనిపై ఆధారపడి ఉన్నారు. ఈ ప్లాంట్‌ను పరిరక్షించడం మా బాధ్యత. ఇది మూతపడుతుందని ఎవ్వరూ ఆందోళన చెందవద్దు. ప్రధానమంత్రి ఆశీస్సులు, సహాయంతో ప్లాంట్‌ను 100 శాతం సామర్థ్యంతో పనిచేయిస్తాం' అని రాశారు. అనంతరం బయటకు వచ్చి విలేకరులతో మాట్లాడారు. ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపుతారా? అని ఓ విలేకరి ప్రశ్నించగా, ప్రైవేటీకరణ చేస్తారని ఎవరు చెప్పారంటూ మంత్రి ఎదురు ప్రశ్నించారు. అలాంటి అపోహలు, భయాలు ఏమీ పెట్టుకోవద్దన్నారు. ప్రధానికి ఇక్కడి పరిస్థితిని వివరిస్తానని ఆయన చెప్పారు.

రాజ్‌తరుణ్‌తో పాటు మాల్వీపై కేసు

- ఆమె సోదరుడు మయాంక్ మల్హోత్రాపైనా!
- పలు సెక్షన్ల కింద కేసు నమోదు


హీరోయిన్ మాల్వీ

హైదరాబాద్ సిటీ/నార్సింగ్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నటుడు రాజ్‌తరుణ్ తనను మోసం చేశాడంటూ నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌లో లావణ్య చేసిన ఫిర్యాదు నేపథ్యంలో.. పోలీసులు కేసు నమోదు చేశారు. రాజ్‌తరుణ్‌కు తనకు 2014 మే 11న పెళ్లయిందని లావణ్య తన ఫిర్యాదులో పేర్కొంది. తమ వివాహానికి ఇరువైపులా పెద్దలు సమ్మతించారని.. ఇద్దరం కలిసి కాపురం కూడా పెట్టామని వెల్లడించింది. 2016లో తనకు రెండు నెలల గర్భవిచ్ఛిత్తి జరగ్గా ఖర్చులన్నీ రాజ్‌తరుణ్ చెల్లించినట్టు తెలిపింది. తమ పెళ్లిని రిజిస్టర్ చేసుకుందామని తాను పలుమార్లు కోరినప్పటికీ రాజ్‌తరుణ్ పట్టించుకోలేదని.. 2018 నుంచి ఎక్కువగా బయట ఉంటున్న రాజ్‌తరుణ్ గురించి ఆరా తీయగా అతను వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు తెలిసిందని ఫిర్యాదులో పేర్కొంది. రాజ్‌తరుణ్‌తో ఒక సినిమాలో కలిసి నటించిన మాల్వీ మల్హోత్రా అనే యువతి తమ జీవితంలో ప్రవేశించినప్పటి నుంచీ అతడు తనను దూరంగా ఉంచుతున్నాడని.. అదేమని అడిగితే జైలుకు పంపిస్తానంటూ బెదిరింపులకు దిగాడని వాపోయింది. మాల్వీ సోదరుడు మయాంక్ మల్హోత్రా కూడా తనను అసభ్య పదజాలంతో దూషిస్తూ బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు. అలాగే.. ఇప్పటి వరకూ తాను రాజ్‌తరుణ్‌కు రూ.70లక్షలు ఇచ్చినట్లు లావణ్య తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను పెళ్లి చేసుకుని మోసం చేయడమే కాకుండా మానసికంగా వేధిస్తున్న భర్త రాజ్‌తరుణ్‌తో పాటు బెదిరిస్తున్న మాల్వీ, మయాంక్‌లపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు రాజ్‌తరుణ్, హీరోయిన్ మాల్వీ మల్హోత్రా, ఆమె సోదరుడు మయాంక్ మల్హోత్రాపై పలు సెక్షన్ల కింద అభియోగాలు నమోదు చేశారు.

మరో సిక్సర్!

(మొదటి పేజీ తరువాత)

చెబుతున్నారు. కాగా, ఇప్పటికే ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరిన సంగతి తెలిసిందే. కొత్తగా వెళ్లేవారితో కలిపితే మొత్తం సంఖ్య 13కు పెరగనుంది.

మరో 13 మందినీ లాగేస్తే..

ప్రస్తుతం సాంకేతికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 38. వీరిలో మూడింట రెండొంతులు.. 26 మంది ప్రత్యేక శాసనసభాపక్షంగా ఏర్పడి కాంగ్రెస్ శాసనసభా పక్షం (సీఎల్పీ)లో విలీనం కానున్నారని చెబుతున్నారు. 2018 ఎన్నికల అనంతరం 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని బీఆర్ఎస్ ఇదే విధానాన్ని అనుసరించిన సంగతిని గుర్తుచేస్తున్నాయి. కాగా, అసెంబ్లీ సమావేశాలు మొదలయ్యే ఈ నెల 24వ తేదీ కల్లా బీఆర్ఎస్ శాసనసభా పక్షం (బీఆర్ఎస్ఎల్పీ).. సీఎల్పీలో విలీనం అయ్యేలా సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తును ముమ్మరం చేశారని పేర్కొంటున్నాయి. మరోవైపు 26 మంది వెళ్లిపోతే బీఆర్ఎస్ సభ్యుల సంఖ్య 12కు పడిపోతుంది. 119 మంది సభ్యులున్న అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష హోదా పొందేందుకు కనీసం కావాల్సిన సంఖ్య ఇది. ఒకవేళ 27వ ఎమ్మెల్యే కూడా వెళ్లిపోతే బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్ష హోదాను, కేసీఆర్ ప్రతిపక్ష నేత హోదాను కోల్పోనున్నారు. ఇక సీఎం రేవంత్ సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని ఇద్దరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల) ఇప్పటికే అధికార పార్టీలో చేరారు. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుతో సంప్రదింపులు జరుగుతున్నాయి. ఆయన కూడా వచ్చేస్తే ఆ జిల్లాలో బీఆర్ఎస్ ఖాళీ కానుందని చెబుతున్నారు.

మేం చేర్చుకోకుంటే.. బీజేపీ చేర్చుకుంటుంది..

రాష్ట్రంలో బీజేపీని కట్టడి చేసేందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుంటున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవని బీఆర్ఎస్ డీలాపడిందని, ఆ పార్టీ ఎమ్మెల్యేలు రాజకీయ భవిష్యత్తును వెతుక్కుంటున్నారని, తాము చేర్చుకోకుంటే బీజేపీలోకి వెళ్లే ఆస్కారం ఉందనీ అంటున్నారు. బీజేపీకి ఆ అవకాశం ఇవ్వకూడదని.. అధిష్ఠానాన్ని ఒప్పించిన తర్వాతనే, చేరికల ప్రక్రియను సీఎం రేవంత్ ముమ్మరం చేశారని కాంగ్రెస్ వర్గాలు వివరిస్తున్నాయి.

కేసీఆర్‌పై నమ్మకం లేకే కాంగ్రెస్‌లోకి వలసలు

ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 11: మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంపై నమ్మకం లేకనే బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. కేసీఆర్ నాయకత్వం సరిగ్గా ఉంటే ఎందుకు అందరు దూరం అవుతారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నేతలు తప్పు తెలుసుకొని పార్టీని పునర్నిర్మాణం చేసుకోవాలని, నాయకులకు నమ్మకం కల్పించి ప్రజల విశ్వాసాన్ని పొందే ప్రయత్నం చేయాలని సూచించారు. లేకుంటే బీఆర్ఎస్‌కనుమరుగవడం ఖాయమన్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో గురువారం మీడియా సమావేశంలో కేసీఆర్ కుటుంబంపై కడియం విరుచుకుపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో అవినీతి విపరీతంగా పెరిగిపోయిందని, అవినీతి అంతా కల్వకుంట్ల కుటుంబానికే పరిమితమైందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆ కుటుంబ అవినీతిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

అమృత్ పథకంలో కోట్లు కొట్టేశారు

- రేవంత్ బంధువు, మరో సంస్థకు కాంట్రాక్టులు ఇచ్చారు
- అవినీతిపై సీబీఐ, ఈడీ విచారణ కోరతా: ఏలేటి

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ యోజన అయిన అమృత్ పథకం ద్వారా రాష్ట్రానికి వచ్చిన రూ.3 వేల కోట్లను చీకటి టెండర్ల ద్వారా తమ అనుయాయులకు కట్టబెట్టి తెలంగాణ సర్కారు తీవ్ర అవినీతికి పాల్పడిందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. సీఎం రేవంత్‌కు దగ్గరి బంధువు ఇందులో రూ.కోట్ల పనులు చేస్తున్నారని, మరో ప్రముఖ సంస్థకు కూడా భారీ ఎత్తున పనులు అప్పగించారని పేర్కొన్నారు. ఈ పనులకు సంబంధించిన అంచనాలన్నీ కాంట్రాక్టర్లే రూపొందించుకున్నారని, అధిక ధరలకు అంచనాలను తయారు చేసుకున్నారని విమర్శించారు. గురువారం బీజేఎల్పీ కార్యాలయంలో మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. ఈ ప్రభుత్వం ఒక్క జీవోను, ఒక్క టెండరు డాక్యుమెంటును కూడా పబ్లిక్ డొమైన్‌లో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ సర్కారు బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నడుస్తోందని విమర్శించారు. గత 7 నెలల్లో ఈ ప్రభుత్వం చేసుకున్న చీకటి ఒప్పందాలు, టెండర్లపై విచారణకు సిద్ధమా..? అని సవాల్ చేశారు. హెటెరో డ్రగ్స్ భూమి విషయంలో, పౌర సరఫరాల శాఖలో జరిగిన అవినీతిపై విచారణకు సిద్ధమా..? అని ప్రశ్నించారు. తెలంగాణలో చీకటి కోణంలో చీకటి పాలన కొనసాగుతోందని విమర్శించారు. తెలంగాణలో కేంద్ర ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై సీబీఐ, ఈడీ విచారణ చేయాలని కోరతానని మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. కాగా, ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ల చైర్మన్ల నియామకాలతో ఖజానాపై అదనపు భారం పడుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. వీరి పదవులు రద్దుచేయాలని గవర్నర్‌ను కలుస్తామని తెలిపారు.

28 నుంచి ఫోరం ఫర్ రెగ్యులేటర్స్ భేటీ

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28వ తేదీ నుంచి హైదరాబాద్‌లో మూడ్రోజుల పాటు ఫోరం ఫర్ రెగ్యులేటర్స్ సమావేశం జరగనుంది. కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి (సీఈఆర్సీ) చైర్మన్ నేతృత్వంలో ఉండే రెగ్యులేటర్స్‌లో దేశవ్యాప్తంగా 30 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన ఈఆర్సీ చైర్మన్లు సభ్యులుగా ఉన్నారు. కమిషన్ల పనితీరు, రాష్ట్రాల్లో విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) ఏఆర్ఆర్ (వార్షిక ఆదాయ అవసరాలు), టారిఫ్ ట్రాన్స్‌మిషన్ ప్రణాళిక, మల్టీ ఇయర్ టారిఫ్, టారిఫ్ ఆర్డర్లపై ఈ భేటీలో చర్చించే అవకాశముంది. కాగా, గత పదేళ్లలో తొలిసారి తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీఈఆర్సీ) ఈ భేటీకి ఆతిథ్యం ఇస్తోంది.

25 వరకు డీఈఎల్ఈడీ, డీపీఎస్ఈ పరీక్ష ఫీజు చెల్లింపుకు అవకాశం

డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ), డిప్లమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డీపీఎస్ఈ) రెండో ఏడాది పరీక్షల రుసుమును ఈనెల 25వ తేదీ వరకు చెల్లించవచ్చని అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ తర్వాత రూ.50 ఆలస్య రుసుముతో ఆగస్టు 1 వరకు చెల్లించవచ్చని చెప్పారు. పూర్తి వివరాలకు ఆయా జిల్లాల్లోని డైట్ కళాశాలలను లేదా www.bse.telangana.gov. in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

బోధన్ రూరల్, జూలై 11 : పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు బోరు మోటారు వద్ద విద్యుదాఘాతానికి గురై చనిపోయాడు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని సాలంపాడ్ క్యాంప్ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన రైతు మారం రాంబాబు(36) గురువారం నారుమడికి నీరు పారించేందుకు వెళ్లాడు. బోరు మోటారు ఆన్ చేసే క్రమంలో ప్రమాదవశాత్తూ వైరుకు చేయి తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

ప్రజల బడ్జెట్ ప్రవేశ పెట్టాలి

- బొగ్గు బ్లాకులను సింగరేణికి అప్పగించాలి
- ఏఐఏడబ్ల్యూయూ ప్రధానకార్యదర్శి వెంకట్

న్యూఢిల్లీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఉత్పత్తి వర్గాలు, సామాన్య ప్రజలకు న్యాయం జరిగేలా కేంద్రం కార్పొరేట్ బడ్జెట్ కాకుండా ప్రజల బడ్జెట్ ప్రవేశ పెట్టాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) ప్రధానకార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. ఎన్డీఏలో కీలక భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జేడీయూ అందుకోసం చొరవ తీసుకోవాలని కోరారు. గురువారం ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలోని బొగ్గు బ్లాకుల వేలాన్ని ఆపాలని, వాటిని సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 13 నుంచి 15 వరకు తమిళనాడులో ఏఐఏడబ్ల్యూయూ జాతీయ కౌన్సిల్ సమావేశాలు జరగనున్నాయని చెప్పారు. ఇందులో దేశవ్యాప్తంగా ప్రజా సమస్యలపై ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేస్తామని పేర్కొన్నారు.

మహిళలకు ఉచితంగా ఎలక్ట్రిక్ ఆటోరిక్షా డ్రైవింగ్ శిక్షణ

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు చేయూతనిచ్చేందుకు వారికి ఉచితంగా ఎలక్ట్రిక్ ఆటో రిక్షా డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఎండీ కాంతి వెస్లే వెల్లడించారు. ఈ శిక్షణకు 100 మంది మహిళలకు అవకాశం కల్పించనున్నామన్నారు. శిక్షణ అనంతరం డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించడంతో పాటు సొంతంగా ఎలక్ట్రిక్ వాహనం పొందేందుకు మైక్రో లోన్‌ను అందిస్తామని తెలిపారు. అవసరమైతే ఇంటర్వ్యూ చేసి, ఉద్యోగం కూడా ఇప్పించేలా సహకారం అందిస్తామన్నారు. ఆసక్తి గల వారు 7660022507, 8978099499 నెంబర్‌లకు సంప్రదించవచ్చని లేదా హైదరాబాద్ కూకట్‌పల్లిలోని 'మొవో' ప్రాంగణంలో అధికారులను కలిసి మాట్లాడవచ్చని సూచించారు.

వేట కత్తితో నరికేశాడు..

వరంగల్ జిల్లాలో దంపతుల దారుణ హత్య.. తల్లిదండ్రుల ప్రాణం తీసిన కూతురి ప్రేమపెళ్లి వ్యవహారం

- తమను విడదీశారని యువతి కుటుంబంపై ఆమె భర్త కక్ష
- ఇంటి వరండాలో నిద్రిస్తున్న వారిపై కత్తితో దాడి, హత్య
- ఆపై భార్య, ఆమె సోదరుడికి కత్తిపోట్లు
- పోలీసుల అదుపులో నిందితుడు?




శ్రీనివాస్, సుగుణ(ఫైల్), నిందితుడు నాగరాజు

చెన్నారావుపేట, జూలై 11: వరంగల్ జిల్లా లో దారుణం జరిగింది. ఓ యువతి ప్రేమ, పెళ్లి వ్యవహారం ఆమె తల్లిదండ్రుల హత్యకు కారణమైంది. ఆ యువతి పెళ్లాడిన యువకుడే వేటకత్తితో దాడి చేసి వారి ప్రాణాలు తీశాడు. తన భార్యను తనకు దూరం చేశారనే కక్షతో ఈ కిరాతకానికి పాల్పడ్డాడు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పదహారుచింతల్ తండాలో జరిగిన ఈ ఘటనలో బానోతు శ్రీనివాస్ (40) బానోతు సుగుణ(35) దంపతులు దారుణ హత్యకు గురయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. పదహారు చింతల్‌తండాకు చెందిన బానోతు శ్రీనివాస్, సుగుణ దంపతులకు కూతురు దీపిక, కుమారుడు మదన్‌లాల్ ఉన్నారు. దీపిక హన్మకొండలో డిగ్రీ సెకండియర్ చదువుతుండగా, మదన్‌లాల్ అమీనాబాద్‌లో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. ఇక, గీసుకొండ మండలం కొమ్మాలకు చెందిన మేకల నాగరాజు(బన్ని) మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగలోని తన అమ్మమ్మ ఇంట్లో ఉంటూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. దీపిక పాఠశాలలో చదువుకునే రోజుల్లో నాగరాజు ఆటోలో ప్రయాణించేది. ఈ క్రమంలో వీరి పరిచయం ప్రేమగా మారింది. హన్మకొండలోని ఓ కళాశాలలో డిగ్రీలో చేరిన దీపిక అక్కడే ఓ హాస్టల్‌లో ఉండేది. అయితే, గతేడాది నవంబరులో తల్లిదండ్రులకు తెలియకుండా హైదరాబాద్ వెళ్లిన దీపిక, నాగరాజును రహస్యంగా పెళ్లి చేసుకుంది. అనంతరం నాగరాజు తల్లిదండ్రులతో కలిసి హైదరాబాద్‌లోనే ఉండేది. అయితే, పెళ్లి జరిగిన వారం రోజులకు.. తన తల్లిదండ్రులకు ఫోన్ చేసిన దీపిక.. తన పెళ్లి విషయాన్ని చెప్పింది. దీంతో హైదరాబాద్ వెళ్లి సుగుణ కూతురికి నచ్చజెప్పి ఇంటికి తీసుకొచ్చారు. అనంతరం వీరి ప్రేమ, పెళ్లి విషయంలో దీపిక తల్లిదండ్రులు, నాగరాజు పోలీసుస్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు చేసుకోగా ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు పెద్దల సమక్షంలో ఓ నిర్ణయం తీసుకోవాలని సూచించారు. దీపిక, నాగరాజు విడివిడిగా ఉండాలని పెద్దలు తీర్మానించగా ఇరుకుటుంబాలు అంగీకరించాయి. దీంతో హైదరాబాద్ వెళ్లిపోయిన నాగరాజు.. దీపిక తనకు దూరం కావడాన్ని జీర్ణించుకోలేక ఆమె తల్లిదండ్రులపై కక్ష పెంచుకున్నాడు. కొద్దిరోజుల క్రితం దీపిక ఇంటి వద్ద రెక్కీ కూడా చేశాడు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి 1.30 గంటల(తెల్లారితే గురువారం) సమయంలో ఇంటి వరండాలో నిద్రిస్తున్న దీపిక, ఆమె తల్లిదండ్రులను చూసి వెంట తెచ్చుకున్న వేటకత్తితో దాడి చేశాడు. తొలుత సుగుణ, శ్రీనివాస్, ఆ తర్వాత దీపికపై విచక్షణారహితంగా దాడి చేశాడు. వారి కేకలు విని ఇంట్లో నుంచి బయటికొచ్చిన దీపిక సోదరుడు మదన్‌లాల్‌పై కూడా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన సుగుణ అక్కడికక్కడే మరణించింది. ఇక, తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. దీపిక, మదన్‌లాల్ హన్మకొండలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, హత్యల అనంతరం గుండెంగలోని ఓ పాఠశాలకు చేరుకున్న నాగరాజు కత్తితో తన చెయ్యి కోసుకుని ఆత్మహత్యకు యత్నించగా, పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

కొత్త ఇళ్లు శిథిలమవుతున్నాయి.. ఇచ్చేది ఎప్పుడు?

- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై పేదల ఆశలు
- గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం
- ఉమ్మడి నల్లగొండలో 6,360 గృహాలు
- కేటాయించింది 1644 మందికే
- క్రమేణా పాడవుతున్న ఖాళీ ఇళ్లు



నల్లగొండ జిల్లా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీ




ఇళ్ల మధ్యలో మొలిచిన కంప చెట్లు

నల్లగొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నిర్మాణాలు పూర్తయినా కేటాయించకుండా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై ప్రభుత్వ నిర్ణయం కోసం అర్హులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అమలుచేసిన డబుల్ బెడ్‌రూమ్ పథకం స్థానంలో పలుమార్పులతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇళ్లు లేని పేదల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించింది. అయితే కోట్లాది రూపాయలు వెచ్చించి విలువైన ప్రాంతాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో సందిగ్ధత కొనసాగుతోంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిశాక ఈ ఇళ్లను అర్హులైనవారికి కేటాయించడంతో పాటు, ఆయా కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తారని భావించినా ఆ దిశగా ఎలాంటి కార్యాచరణ జరగటం లేదు. దీంతో ఆ ఇళ్లు శిథిలమయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను 20 వేల ఇళ్లను మంజూరు చేయగా వాటిలో 6,360 ఇళ్లు నిర్మించారు. ఎన్నికల సమయానికి కేవలం 1,644 మంది లబ్ధిదారులకు మాత్రమే ఇళ్లను కేటాయించారు. మిగిలినవాటిని ఎవరికీ కేటాయించకపోవటంతో ఆ ఇళ్లన్నీ ప్రస్తుతం క్రమంగా శిథిలమవుతున్నాయి. మరోవైపు, ఇళ్లు నిర్మించిన కాలనీల్లోనూ రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణాలను ఇంకా పూర్తిగా చేపట్టలేదు. వీటికి కూడా నిధులు మంజూరైనా, పనులు చేయకపోవడంతో ఆ నిధులన్నీ వెనక్కిపోయాయి. ఇళ్ల పట్టాలు అందజేసి, మౌలికవసతులు కల్పిస్తే.. ఇళ్ల నిర్మాణం కోసం వెచ్చించిన ప్రజాధనం వృథా కాకుండా ఉంటుందని, ఈ అంశంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించాలని అర్హులు కోరుతున్నారు.

సదర్మాట్, పిప్రి ప్రాజెక్టులకు మహర్దశ

- పిప్రి రూ.18కోట్లు మంజూరు
- సదర్మాట్‌లో ఎలక్ట్రిఫికేషన్‌కు మరో రూ.13కోట్లు
- ఇవి పూర్తయితే 22వేల ఎకరాల ఆయకట్టుకు నీరు
- సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో సమస్యలకు పరిష్కారం



నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్ వద్ద గోదావరి నదిపై నిర్మించిన సదర్మాట్ బ్యారేజీ(ఫైల్)

నిర్మల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నిధులు మంజూరు కాక నత్తనడకన సాగుతున్న ప్రాజెక్టులకు మహర్దశ పట్టింది. నిర్మల్ జిల్లా పరిధిలోని సదర్మాట్ బ్యారేజీ, పిప్రి ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేస్తూ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో రెండు ప్రాజెక్టులకు రూ.31కోట్లు మంజూరు కాగా.. ఇవి పూర్తయితే కొత్తగా 22వేల ఎకరాలకు నీరు అందనుంది. నిర్మల్ జిల్లా మామడ మండలంలోని పొన్కల్ వద్ద సదర్మాట్ బ్యారేజీ నిర్మాణానికి రూ.676.50 కోట్ల వ్యయంతో అంచనాలు రూపొందించారు. ఇందులో రూ.398 కోట్లను నిర్మాణ పనుల కోసం వెచ్చించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు రూ.320కోట్లతో పనులు పూర్తి చేశారు. ఇందులో భాగంగా ఇప్పటికే 55 గేట్లను నిర్మించారు. భూసేకరణ కోసం రూ.120కోట్లను గత ప్రభుత్వం మంజూరు చేయగా.. నిర్వాసితులకు పరిహారం చెల్లించారు. జగిత్యాల జిల్లాలో నిర్వాసితులకు రూ.5.30 కోట్లను చెల్లించాల్సి ఉంది. సదర్మాట్ బ్యారేజీ ఎలక్ట్రిఫికేషన్ పనుల కోసం రూ.13కోట్లు అవసరం ఉండగా, గత ప్రభుత్వం పట్టించుకోలేదు. తాజాగా రూ.13కోట్లను మంజూ రు చేస్తూ సర్కారు ఆదేశాలు జారీ చేయడంతో బ్యారేజీ నిర్మాణ పనులకు ఆటంకాలు తొలగిపోయాయి. వచ్చే అక్టోబరు లోగా సదర్మాట్ బ్యారేజీ పనులను పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్లు తెలిసింది. ఈ బ్యారేజీ పూర్తయితే నిర్మల్ జిల్లాలో 13వేల ఎకరాలు, జగిత్యాల జిల్లాలో 5 వేల ఎకరాలకు నీరు అందనుంది. మరోవైపు, నిర్మల్ జిల్లాలోని లోకేశ్వరం మండలం పిప్రి వద్ద నిర్మించ తలపెట్టిన ఎత్తిపోతల పథకాన్ని 2021లో ప్రారంభించారు. రూ.58.95 కోట్ల మేర వ్యయమవుతుందని అంచనా వేశారు. దీనికి సంబంధించి ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో జాక్ వెల్‌ను నిర్మించగా, రెండు పైప్‌లైన్ల ద్వారా సాగు భూములకు నీటిని అందించాల్సి ఉంది. అయితే, మంజూరు చేసిన నిధులు సరిపోవడం లేదంటూ అధికారులు గతంలోనే నివేదించినా.. గత ప్రభుత్వం అదనపు నిధులు విడుదల చేయలేదు. తాజాగా ఈ పథకానికి రూ.18కోట్లను మళ్లీ మంజూరు చేస్తూ కాంగ్రెస్ సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే 4,212 ఎకరాలకు నీరు అందనుంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇరాన్ గద్దెపై ఉదారవాది

ఇరాన్ కొత్త అధ్యక్షుడుగా మసూద్ పెజెష్కియాన్ ఎన్నికకావడం చాలామందిని ఆశ్చర్యపరిచింది. ఛాందసవాది, ఇరాక్ యుద్ధ వీరుడు అయిన సయ్యద్ జలీలీమీద సంస్కరణవాది మసూద్ మంచి మెజారిటీతో గెలవడం విశేషమైన పరిణామం. అమెరికాలో ఈ ఏడాది చివర్లో జరగబోయే ఎన్నికల్లో గెలవబోతున్న అధ్యక్షుడితో మళ్ళీ అణు ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇరాన్ ఇలా ముందుగానే సిద్ధమైందని కొందరు ఉత్సాహంగా వ్యాఖ్యానిస్తున్నారు. బైడెన్ వెనుకంజలో ఉన్నారని అంచనాలున్న స్థితిలో, గతంలో ఆ ఒప్పందాన్ని తుత్తునియలు చేసిన డోనాల్డ్ ట్రంప్ మహాశయుడే తిరిగి అధ్యక్షుడైతేనో అన్న ప్రశ్న ఓ పక్కన ఉండనే ఉంది. కానీ, ఇంటాబయటా పలురకాల సంక్షోభాలు ఎదుర్కొంటున్న ఇరాన్‌కు ఈ ఆపత్సమయంలో పెజెష్కియాన్ సారథ్యం ఎంతోకొంత మేలు చేస్తుందన్న నమ్మకమైతే విశ్లేషకుల్లో బలంగానే ఉంది.

రెండుదశాబ్దాల క్రితం ఆరోగ్యమంత్రిగా పనిచేసిన ఈయన, పోటీలో నిలబడిన మిగతాఛాందసులకంటే ప్రజలకు నచ్చాడు. వారి కోర్కెలకు, ఆశలకూ ఆయన ప్రతినిధి. దేశప్రజల్లో తీవ్రమైన నైరాశ్యం ఆవరించి ఉందని, వారిలో అంతర్లీనంగా రగులుతున్న ఆగ్రహం ఏదో రూపంలో చల్లార్చాల్సిన అవసరం ఉన్నదని ఇరాన్ అధినాయకుడు, ఆయన ఆధ్వర్యంలోని మతాచార్యుల మండలి గుర్తించాయి. ఈ కారణంగానే గత అధ్యక్ష ఎన్నికల్లోనూ, ఇటీవలి మజ్లిస్ ఎన్నికల్లోనూ పెజెష్కియాన్‌ను దూరంపెట్టినవారే ఇప్పుడు పిలిచి మరీ ఈ పదవికి పోటీపడమన్నారు. ఆయన రాకవల్లనే ఈ ఎన్నికలకు కళవచ్చిందనీ, ప్రజల భాగస్వామ్యం పెరిగిందనీ అంటారు. ఎన్నికలబరిలో నిలవడానికి షియా మతాచార్యుల మండలి అనుమతించిన ఏకైక ఉదారవాది పెజెష్కియాన్.

గత అధ్యక్ష ఎన్నికల్లో ఖమేనీ ఆశీస్సులతో దేశాధ్యక్షుడైన ఇబ్రాహీం రైసీ తన నిరంకుశత్వంతో, ఛాందసత్వంతో అధికశాతం ప్రజలకు శత్రువైనాడు. అమెరికా అధ్యక్షుడుగా బరాక్ ఒబామా ఉండగా, ఇరాన్‌లో హసన్ రౌహానీ సాధించిన అణు ఒప్పందం ప్రపంచానికి ఎంతో ఉపశమనం ఇచ్చింది. ఆధునికుడిగా, ఆలోచనాపరుడుగా ప్రజల్లో మంచి పేరున్న రౌహానీ దీనితో ఎంతో సులువుగా రైసీని 2017 అధ్యక్ష ఎన్నికల్లో ఓడించగలిగారు. కానీ, ట్రంప్ తిక్కచేష్టలవల్ల ఆ ఒప్పందం స్వల్పకాలంలోనే నీరుగారిపోయి, అమెరికా చేతిలో ఇరాన్ పలు ఆంక్షలనూ, వేధింపులనూ అనుభవించాల్సివచ్చింది. ఈ వాతావరణం రైసీ తరహా ఛాందసశక్తుల ఎదుగుదలకు తోడ్పడింది. ఖమేనీ పట్టు బిగించడంతో రౌహానీని రైసీ 2021అధ్యక్ష ఎన్నికల్లో సులువుగా ఓడించగలిగారు. ఉదారవాదులు, సంస్కరణవాదుల గొంతులు బలహీనమైపోయిన ఆ తరుణంలో, ఖమేనీ ఆశీస్సులతో రెచ్చిపోయిన రైసీ వివిధ రకాల ఆంక్షలు అమలుచేశారు. అక్రమ నిర్బంధాలు, అణచివేతలు, రహస్య హత్యలు ఆయన హయాంలో చాలా జరిగాయి. ప్రజలకు స్వేచ్ఛ అపురూపమైపోయింది. మహిళల వస్త్రధారణకు సంబంధించి ప్రత్యేకమైన ఆంక్షలు, నిఘా నియంత్రణ వ్యవస్థలు ఏర్పాటైనాయి. చాదోర్ వస్త్రాన్ని ధరించనందుకు మెహసా అమీనీ అనే కుర్దు యువతిని పోలీసులు తమ కస్టడీలో హతమార్చిన ఘటన దేశాన్ని కుదిపివేసింది. ప్రజల మనసుల్లో పాలకులపట్ల గూడుకట్టుకొని ఉన్న ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ మహిళా ఉద్యమాన్ని అణచివేయడంలో ఇబ్రాహీం రైసీ ప్రదర్శించిన కాఠిన్యం ఇరాన్ ఎన్నటికీ మరిచిపోదు. విమానప్రమాదంలో మొన్న మే నెలలో ఆయన మరణించినప్పుడు చాలా సమూహాలు వేడుకచేసుకున్నాయని కూడా వార్తలు వచ్చాయి.

ఛాందసవాది రైసీ స్థానాన్ని సంస్కరణవాది పెజెష్కియాన్ భర్తీ చేయడం ఇరాన్ ప్రజలు, పాలకులు కూడా ఆశిస్తున్న మార్పు. ఆయన తన ఎన్నికల ప్రచారంలో చేసిన వాగ్దానాలన్నీ నెరవేర్చలేకపోవచ్చు, వ్యవస్థలని సమూలంగా ప్రక్షాళించలేకపోవచ్చు. కానీ, రైసీ హయాంలో ప్రజలు కోల్పోయిన స్వేచ్ఛనీ, హక్కులనీ కొంతమేరకు వారికి తిరిగి ఇవ్వగలిగినా చాలు. విదేశాంగం సహా చాలా విషయాల్లో ఖమేనీ, ఆయన ఆధ్వర్యంలోని సుప్రీం కౌన్సిల్ నిర్ణయాలే చెల్లుబాటవుతాయన్నది అందరికీ తెలిసిన విషయమే. కానీ, తీవ్ర అనారోగ్యంతో ఉన్న ఖమేనీ అనంతరం ఆ స్థానాన్ని రైసీ భర్తీ చేస్తారని, మరో ఛాందసుడు దేశాధ్యక్షుడవుతాడని దేశంలోని మైనారిటీలు, సంస్కరణాభిలాషులు, ఉదారవాదులు భయపడుతున్న తరుణంలో పెజెష్కియాన్ రాక ఇంటాబయటా కూడా ఒక సానుకూల వాతావరణాన్ని నెలకొల్పేందుకు ఉపకరిస్తుంది.

మనకు తెలియని బీరు కథ!

బీరు చాలామందికి హాయినిచ్చే ఒక అనుభూతి. మన దేశంలో బీరుకు లభించినంత ఆదరణ వేరే ఏ ఇతర పానీయానికి లభించదు. అయితే గత కొన్నేళ్లుగా బీరు ఉత్పత్తి, దాని డిస్ట్రిబ్యూషన్‌లపై అనుసరిస్తున్న విధానాల వల్ల ఇటు కంపెనీలకు.. అటు వినియోగదారులకు అనేక రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రెండు రాష్ట్రాలలోను కొత్త ప్రభుత్వాలు వచ్చిన నేపథ్యంలో ఈ విధానాలపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అంతే కాకుండా సామాన్య ప్రజలకు కూడా బీరు తయారీపై అవగాహన కల్గించాల్సిన అవశ్యకత ఉంది.

మన దగ్గర బీరును బార్లీ, బియ్యం, పంచదారలతో తయారుచేస్తారు. వాస్తవానికి ఒక కోణం నుంచి చూస్తే ఇది ఒక ఆర్గానిక్ డ్రింక్ మాత్రమే! అయితే దీనిలో ఉండే ఆల్కాహాల్ కంటెంట్ వల్ల దీనిపై ప్రభుత్వం నియంత్రణ చేపట్టింది. బీరు అమ్మకాల వల్ల ప్రభుత్వానికి ప్రతి ఏడాది కొన్ని వేల కోట్ల రూపాయల ఆదాయం లభిస్తుంది. కానీ బీరు ఉత్పత్తిదారులకు లభించే ఆదాయం మాత్రం దానిలో నామమాత్రమే! ఉదాహరణకు బ్రూవరీస్ కార్పొరేషనకు ఒక క్రేట్ (పన్నెండు 650 ఎంఎల్ బాటిల్స్)కు ఇచ్చే ధర 289 రూపాయలు. దీనిని ప్రభుత్వం 1800 రూపాయలకు అమ్ముతుంది.



అంటే ఒక క్రేట్ బీరు మీద ప్రభుత్వానికి వచ్చే ఆదాయం 1500 రూపాయలు. చాలా మంది వినియోగదారులు బీరు ధర కంపెనీల చేతుల్లో ఉంటుందనుకుంటారు. కానీ అది నిజం కాదు. బీరు ధరను ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. అంతే కాదు. బీరు ధరలను నిర్ణయించటానికి ఒక పర్చేజింగ్ కమిటీ ఉంటుంది. ఇది మూడేళ్లకు ఒకసారి ధరలను నిర్ణయిస్తుంది. సాధారణంగా బీరుకు అవసరమైన ముడి సరుకును బహిరంగ మార్కెట్లోనే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కోవిడ్ తర్వాత ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. అయినా ధరలను ఇంకా సవరించలేదు. ఈ ధరల నిర్ణయాన్ని మూడేళ్లకు ఒకసారి కాకుండా ప్రతి ఏడాది నిర్ణయిస్తే బావుంటుంది. అంతే కాకుండా ప్రభుత్వం కంపెనీలకు ఇచ్చే బిల్లులను ప్రతి 15 రోజులకు ఒకసారి ఇస్తే బావుంటుంది. కొన్నిసార్లు ఈ బిల్లులు నెలలకొలది పెండింగ్ ఉండిపోతున్నాయి. దీని వల్ల కంపెనీలు తమ సప్లైయర్స్‌కు ఇవ్వటానికి ఇబ్బంది కలుగుతోంది.

బీరును తాగేవారు కొన్ని కోట్ల మంది ఉన్నారు. వారి కోసం నాణ్యమైన కల్తీలేని బీరును ఉత్పత్తి చేయటానికి అనేక కంపెనీలు కూడా సిద్ధంగా ఉన్నాయి. ఈ రెండింటిని సమన్వయం చేయగలిగితే ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. చెడు బీరును అమ్మి కొందరికి మేలు చేశారనే చెడ్డ పేరు రాదు.

ఇక చాలా మందికి విదేశాలలో కొన్ని వందల బ్రాండ్స్ అందుబాటులో ఉంటాయి కదా.. మన దగ్గర ఈ బ్రాండ్స్ ఎందుకు దొరకవనే ప్రశ్న తలెత్తుతూ ఉంటుంది. ఏ బ్రాండ్‌ను ఉత్పత్తి చేయటానికి అనుమతించాలి? ఎంత ఉత్పత్తిని అనుమతించాలి? అనే విషయాన్ని నిర్ణయించేది కూడా ప్రభుత్వమే. ఉదాహరణకు ప్రభుత్వం మూడు కంపెనీలకే అనుమతి ఇచ్చిందనుకుందాం. మూడు రకాల బీర్లే మార్కెట్లో లభ్యమవుతాయి. చాలా సందర్భాలలో ఇది వినియోగదారుల అభిరుచుల ఆధారంగా కాకుండా వేరే ఇతర కారణాల ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటూ ఉంటారు. దీనివల్ల ఇటు కంపెనీలు నష్టపోతున్నాయి, అటూ వినియోగదారులకు సరైన ఉత్పత్తులు లభించటంలేదు. గత కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న కొన్ని విధానాలే ఈ సమస్యలకు కారణం. వీటిని వెంటనే పరిష్కరించకపోతే వినియోగదారులకు ఇబ్బందులు తప్పవు.

బీరు ఉత్పత్తి చేయాలంటే ప్రభుత్వం లైసెన్స్ తప్పనిసరి. ఈ లైసెన్స్ ఫీజు సాధారణంగా చాలా ఎక్కువగా ఉంటుంది. బాగా అభివృద్ధి చెందిన దేశాల్లో.. మన దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో ఈ లైసెన్స్ ఫీజు ఉత్పత్తి ఆధారంగా ఉంటుంది. ఉదాహరణకు ప్రతి ఏడాదికి 30 లక్షల బాటిల్స్ బీరు తయారుచేసేవారు కట్టాల్సిన లైసెన్స్ ఫీజు.. 10 లక్షల బాటిల్స్ తయారుచేసే వారు కట్టాల్సిన లైసెన్స్ ఫీజు ఒకటే! దీని వల్ల కొన్ని కంపెనీలు నష్టపోతాయి, కొన్ని కంపెనీలు లాభపడతాయి. కథ ఇక్కడితో ఆగలేదు. ఒకసారి లైసెన్స్ పొంది ఉత్పత్తి ప్రారంభించటానికి ప్రభుత్వం వద్ద నుంచి పర్చేజ్ ఆర్డర్లు అవసరం. సాధారణంగా ఇవి ఉత్పత్తి సామర్థ్యం ఆధారంగా ఇవ్వాల్సి ఉంటుంది. కానీ కొన్ని కారణాల వల్ల కొన్ని పెద్ద పెద్ద విదేశీ కంపెనీలకు ఎక్కువ ఆర్డర్లు లభిస్తాయి. దీనివల్ల చిన్న కంపెనీల మనుగడ ఎప్పుడూ కష్టమే! ఒకసారి బీరు ఉత్పత్తి అయి బయటకు వచ్చిన తర్వాత దానిని బహిరంగ మార్కెట్లో విక్రయించటానికి ఉండదు. ఉత్పత్తి అంతా ప్రభుత్వానికి అప్పచెబితే ప్రభుత్వం దానిని కొనుగోలు చేసి తమ డీలర్ల ద్వారా విక్రయిస్తుంది. అయితే ఈ ఉత్పత్తి విషయంలో కూడా విధానం సరిగ్గా లేదు. సాధారణంగా బీరు ఉత్పత్తి చేసే యంత్రాలకు కోట్ల రూపాయలలో పెట్టుబడి అవసరమవుతుంది. దీనిపై జీఎస్టీ కూడా కట్టాల్సి ఉంటుంది. అయితే బీరుపై జీఎస్టీ లేదు. అంటే, యంత్రాలపై పెట్టిన పెట్టుబడికి ప్రభుత్వం పన్ను సేకరిస్తుంది కానీ దాని ద్వారా బయటకు వచ్చే ఉత్పత్తికి మాత్రం పన్ను సేకరించదు. దీనివల్ల బీరు కంపెనీలకు అదనపు ఆదాయం లభించదు.

ప్రపంచీకరణ జరిగి ప్రపంచమంతా ఒకటైపోతున్న నేపథ్యంలో స్థానిక ఉత్పత్తులు.. వాటికి ఇవ్వాల్సిన ప్రాధాన్యం గురించి మాట్లాడటం కొంత ఆశ్చర్యంగా అనిపించవచ్చు. బీరును మల్టీ నేషనల్ కంపెనీలు (ఎమ్మెన్సీ)లతో పోటీపడుతూ స్థానిక కంపెనీలు కూడా ఉత్పత్తి చేస్తున్నాయి. అయితే ఎమ్మెన్సీల ఉత్పత్తులు ఉన్నతమైనవని, స్థానికంగా తయారుచేసే బ్రాండ్స్ తక్కువనే భావన కలిగించేలా ప్రచారం సాగుతూ ఉంటుంది. ఈ ప్రచారం వల్ల స్థానిక కంపెనీలన్నీ తీవ్రంగా నష్టపోతున్నాయి. ప్రతి బీరు కంపెనీలోను ప్రతిరోజు కనీసం ఐదు వందల నుంచి వెయ్యి మంది దాకా స్థానికులకు ఉపాధి దొరుకుతూ ఉంటుంది. బీరు ఉత్పత్తులు పెరగటం వల్ల వీరందరికీ కూడా ఏడాది పొడుగునా ఉపాధి లభిస్తుంది.

బీరును తాగేవారు కొన్ని కోట్ల మంది ఉన్నారు. వారి కోసం నాణ్యమైన కల్తీలేని బీరును ఉత్పత్తి చేయటానికి అనేక కంపెనీలు కూడా సిద్ధంగా ఉన్నాయి. ఈ రెండింటిని సమన్వయం చేయగలిగితే ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. చెడు బీరును అమ్మి కొందరికి మేలు చేశారనే చెడ్డపేరు రాదు. ప్రభుత్వం ఈ విషయాలన్నింటిపై దృష్టి పెట్టి కొన్ని మంచి నిర్ణయాలు తీసుకుంటుందని ఆశిస్తున్నాం.

• నన్నపనేని రఘుకృష్ణ
అమెరికన్ బ్లూక్రాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్
(వ్యాసకర్తకు బీరు తయారీ రంగంలో మూడు దశాబ్దాల అనుభవం ఉంది)

నాడు కరువు... నేడు కనక వర్షం!

టీ20 ప్రపంచ కప్‌ను గెలిచిన టీమ్ ఇండియాకు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) నుంచి 125 కోట్ల రూపాయల నగదు నజరానా! భారతీయ క్రికెట్ ఎంతగా మారిపోయిందో ఈ ఘన బహుమానం సూచించడం లేదూ! 1950, 1960 దశకాలలో మన టెస్ట్ క్రికెటర్లకు ఒక్కో మ్యాచ్‌కు రూ.250 చెల్లించేవారు. ఒకసారి న్యూజిలాండ్‌ను భారత్ కేవలం మూడు రోజుల్లోనే ఓడించినప్పుడు విజేతలు ఒక్కొక్కరికి కేవలం రూ.150 మాత్రమే చెల్లించారు! క్రికెట్ బోర్డ్ తీరు నాడు ఆ క్రికెటర్లనే కాదు, నేడు మనలనూ విస్మయపరుస్తుంది. క్రీడాకారులను కేవలం దినసరి వేతన కూలీలుగా క్రికెట్ బోర్డ్ పరిగణించిందన్నది ఒక వాస్తవం. ఐదు రోజుల టెస్ట్ మ్యాచ్‌ను రెండు రోజులు ముందుగానే విజయవంతంగా ముగించేయడమే ఆనాటి క్రికెటర్లు చేసిన తప్పిదం! ఆ తప్పుకు శిక్షగా వారికిచ్చే పారితోషికంలో రూ.100 తగ్గించారు.

1971లో ఓవర్సీస్ టెస్ట్ క్రికెట్‌లో ఇంగ్లాండ్, వెస్టిండీస్ జట్లను భారత్ ప్రప్రథమంగా ఓడించింది. భారతీయ క్రికెట్ ఘనతను ప్రపంచానికి చాటి స్వదేశానికి తిరిగివచ్చిన ఆ విజేతలకు, ఇటీవల రోహిత్ శర్మ టీమ్‌కు కంటే కూడా ఘనమైన స్వాగత సత్కారాలు లభించాయి. నాడు ఆ విజేతలను చూసేందుకు, అభినందించేందుకు క్రికెట్ అభిమానులు అసంఖ్యాకంగా ఎగబడ్డారు. హార్దిక స్వాగతం ఎంత ఘనంగా లభించినా అంతిమంగా దక్కిన ఆర్థిక లబ్ధి పూజ్యం, నమ్మండి. ఒక జౌళి కంపెనీ మాత్రం ఉదారంగా ఆ విజేతలకు తలొక ప్యాంట్, షర్ట్ వస్త్రాలను కానుకగా ఇచ్చింది! 1983లో మహాశక్తిమంతమైన వెస్టిండీస్ జట్టును ఓడించి ప్రప్రథమంగా ప్రతిష్ఠాత్మక ప్రపంచ కప్‌ను గెలిచిన (కపిల్‌దేవ్ నాయకత్వంలోని) భారత్ జట్టు సభ్యులు ఒకొక్కరికి బీసీసీఐ చెల్లించింది కేవలం రూ.20 వేలు మాత్రమే. గాంధర్వ గాయని లతా మంగేష్కర్ ఆ విజేతల గౌరవార్థం ఒక సంగీత కచేరి నిర్వహించారు. ఆ సంగీత సభ ద్వారా లభించిన ఆదాయాన్ని ఆ క్రికెటర్లకు బహుమానంగా అందజేశారు. అలా ఒకొక్కరికి అందిన మొత్తం లక్ష రూపాయలే. ఈ నాటి క్రికెటర్లకు లభిస్తున్న కోట్లాది రూపాయలతో పోలిస్తే ఆ మొత్తం ఎంత! అన్నట్టు ఇప్పుడు టీమ్ ఇండియా సహాయ సిబ్బంది సైతం అంత కంటే అధికంగానే ఆర్థిక లబ్ధి పొందుతున్నారు.



akbar

1983 ప్రపంచ కప్ విజయం, 1990ల్లో శాటి లైట్ టీవీ విప్లవం, 2000 దశకంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఆవిర్భావం బీసీసీఐని మహా సంపద్వంతం చేశాయి. స్వతంత్ర భారత తొలితరాల క్రికెటర్లు ఊహించలేని, ఆశించలేని ఆర్థిక లబ్ధి 21వ శతాబ్ది క్రికెటర్లకు లభిస్తోంది. మరి క్రికెట్‌కు సంబంధించిన ప్రశస్త సంప్రదాయాలను సమున్నతం చేయవలసిన బాధ్యత బీసీసీఐకి ఉన్నది. క్రీడాకారులు, క్రికెట్ వ్యవహారాల నిర్వాహకుల మధ్య తేడాను పాటించడం అటువంటి అత్యుత్తమ సంప్రదాయాలలో ఒకటి.

అప్పటికీ ఇప్పటికీ భారత క్రికెట్ జగత్తులో చోటు చేసుకున్న అతి పెద్ద మార్పు క్రీడాకారులకు దక్కుతున్న విశేష ఆర్థిక లబ్ధి అని చెప్పి తీరాలి. కేవలం అంతర్జాతీయ టెస్ట్ మ్యాచ్‌లలో ఆడేవారికే కాదు, దేశీయ టోర్నమెంట్‌లలో ఆడేవారికి సైతం ద్రవ్య లాభం అధిక మొత్తంలో ఉంటోంది. ఉదాహరణకు రంజీ ట్రోఫీనే తీసుకోండి. మ్యాచ్ ఫీజుగా రోజుకు రూ. 40 నుంచి రూ.60 వేలు దాకా బీసీసీఐ చెల్లిస్తోంది. దేశీయ టోర్నమెంట్ సీజన్‌లో జరిగే అన్ని మ్యాచ్‌లలో ఆడే క్రీడాకారుడికి ఇంచుమించు రూ.30 నుంచి రూ.40 లక్షల దాకా ఆదాయం లభిస్తోంది. మరి 1960ల నాటి రంజీ ట్రోఫీ క్రీడాకారులకు ఎంత చెల్లించేవారో తెలుసా? ఒకో మ్యాచ్‌కు ఒకొక్కరికి కేవలం రూ.10 మాత్రమే లభించేది. ఆ తరం క్రీడాకారులు గౌరవ ప్రదంగా జీవించేందుకు ఎస్‌బీఐ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలోనో లేదా టాటా లాంటి ఉదారశీల ప్రైవేట్ కంపెనీలోనే భద్రమైన ఉద్యోగం మాత్రమే ఆధారం మరి.

భారత క్రికెట్ జగత్తులోకి ధన ప్రవాహం ఎలా ప్రవేశించింది? ఈ అందమైన ఆటను ధనశక్తి ప్రభావితం చేయడం ఎలా ప్రారంభమయింది? మూడు నిర్ణయాత్మక పరిణామాలు అందుకు దోహదం చేశాయి. అవే మన క్రికెట్ జగత్తులో ఈ మిలియనీర్ రాజ్‌ను నెలకొల్పాయి. మొదటిది నిస్సందేహంగా 1983 ప్రపంచ కప్ విజయం. భారత క్రికెట్ చరిత్రలో అదొక అనూహ్య మలుపు. ఆ విజయం ఒక తరం తరాన్ని చాలా పెద్ద విషయాలను స్వప్నించేందుకు పురిగొల్పింది. నాలుగు సంవత్సరాల అనంతరం ప్రపంచ కప్ టోర్నమెంట్‌ను ఇంగ్లాండ్‌లో కాకుండా భారత్‌లో (ప్రప్రథమంగా) నిర్వహించారు.



▪ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

రెండో పరిణామం 1990ల్లో అమలయిన ఆర్థిక సంస్కరణలు; అదే సమయంలో సంభవించిన శాటిలైట్ టీవీ విప్లవం. దాని ఫలితంగా క్రికెట్ క్రీడాకారులు తమ బ్రాండ్ విలువను తెలుసుకున్నారు. తమ ప్రభావశీలతను వ్యక్తిగత ఆర్థిక లబ్ధికి సద్వినియోగం చేసుకున్నారు. ముఖ్యంగా సచిన్ టెండూల్కర్ వాణిజ్య ప్రకటనల మహారాజుగా వెలుగొందారు. టీవీలో సచిన్ లేని, ఏ వస్తువుకు సంబంధించిన వాణిజ్య ప్రకటనా ప్రసారమయ్యేది కాదంటే నమ్మి తీరాలి.

మూడోది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్). క్రికెట్ జగత్తులో పెను మార్పుకు కారణమైన ఐపీఎల్, 2008లో క్రీడా ప్రపంచాన్ని ఊపేసింది. విభ్రమపరిచింది. సంబరపరిచింది. దీనితో ఒక్కసారిగా క్రికెట్ అనేది భారతీయుల మనస్సును పూర్తిగా ఆవహించిన ఆటగా..... మాత్రమే కాకుండా భారత క్రికెట్ ప్రపంచం మెచ్చే క్రీడగా వెలుగొందడం ఆరంభమయింది. సమస్త ఐపీఎల్ టీమ్‌ల విలువ వందల కోట్ల రూపాయలలో ఉండడం ఒక సాధారణ విషయమయింది. ఐపీఎల్ ఇప్పుడు ప్రపంచ రెండో మహా సంపద్వంతమైన స్పోర్ట్స్ లీగ్‌గా వెలుగొందుతోంది. మ్యాచ్ విలువ పరంగా అమెరికాకు చెందిన నేషనల్ ఫుట్‌బాల్ లీగ్ తరువాయి స్థానం ఐపీఎల్‌దే. ప్రవాసంలో ఉన్న ఐపీఎల్ ఆవిర్భావానికి ప్రధాన కారకుడు లలిత్ మోడీ తాను ఎంతటి మహా ప్రభావదాయక క్రీడా పోటీని ప్రారంభించడం జరిగిందన్న విషయమై ఆశ్చర్యపోతున్నాడేమో?!

అంతా బాగానే ఉంది. అంతా మన మంచికే. క్రికెట్ ఆకాంక్షాభరితమైనది. ప్రతిభా సమన్వితమైనది. శతాధిక కోట్ల భారతీయుల స్వప్నాలను నెరవేర్చేది. అన్ని విధాలా క్రికెట్ పెరుగుదల ప్రభావం ఇతర ఆటలపై కూడా బహుముఖీనంగా ఉంటుంది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొననున్న క్రీడాకారులు అదృష్టవంతులు. మునుపటి ఒలింపియన్లు కలలో కూడా ఆశించని ఆర్థిక లబ్ధి పారిస్ ఒలింపియన్లకు లభించనున్నది. ఈ తరం వారికి మెరుగైన, ప్రశస్తమైన శిక్షణ కూడా లభిస్తోంది. బ్యాడ్మింటన్ ఛాంపియన్‌ల నుంచి అసాధారణ జావెలిన్ హీరో నీరజ్ చోప్రా దాకా భారతీయ క్రీడాకారులు ఎందరో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారులతో సమర్థంగా పోటీ పడుతున్నారు. విజయాలు సాధిస్తున్నారు. దురదృష్టవశాత్తు మన క్రీడా సంఘాలు అన్నీ వృత్తి నిబద్ధతతో పనిచేయడం లేదు. ఈ అవలక్షణం మూలంగానే ఒలింపిక్స్‌లో మన క్రీడాకారులు మరిన్ని ప్రశస్తమైన విజయాలు సాధించలేకపోతున్నారు.

సరే, మళ్లీ బీసీసీఐ విషయానికి వద్దాం. దేశంలో అత్యంత సంపద్వంతమైన క్రీడా సంఘమది. కొంత మంది దృష్టిలో అత్యంత అపారదర్శకంగా పనిచేసే క్రీడా సంఘం కూడా అదే. జైషా నాయకత్వంలోని బీసీసీఐ సగర్వంగా చెప్పుకోగల విషయాలు కొన్ని ఉన్నాయి. గత కొద్ది సంవత్సరాలుగా మహిళా క్రికెట్‌కు అందిస్తున్న ప్రోత్సాహం వాటిలో ముఖ్యమైనది. పురుష క్రికెటర్లతో సమానంగా మహిళా క్రికెటర్లకూ పారితోషికాల చెల్లింపులు జరగడం, ప్రత్యేకంగా ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ ఏర్పాటు రెండూ చరిత్రాత్మకమైనవి, ప్రశంసించి తీరాల్సినవి. అవి జెండర్ అవరోధాలను తొలగించాయి. క్రికెట్ క్రీడా జగత్తును ప్రపంచాన్ని మరింతగా సమ్మిళితమయ్యేందుకు దోహదం చేసిన కీలక చర్యలవి, సందేహం లేదు. ఎన్నో ప్రశంసనీయమైన మార్పులను తీసుకువచ్చినప్పటికీ నేటి బీసీసీఐ ఇప్పటికీ రాజకీయ మద్దతు, ప్రాబల్యమున్న అధికారుల కోటరీ నియంత్రణలో పనిచేస్తోంది. జవాబుదారీతనం చూపని ఈ పెద్ద మనుషులు ఆ ప్రపంచ క్రీడ వ్యవహారాలను అమితంగా ప్రభావితం చేస్తున్నారు, పెత్తందారీతనంతో నియంత్రిస్తున్నారు.

భారతీయ క్రికెట్ ఒక మహాశక్తి. సూపర్ పవర్ హోదాతో వెలుగొందుతోంది. మరి అటువంటి ప్రభావశీలతకు చిత్తశుద్ధితో బాధ్యతల నిర్వహణ కూడా తోడైతే ఎంత బాగుండును! బీసీసీఐ పెద్దలు భారత క్రికెట్ సంరక్షకులే కానీ దాని యజమానులు కానేకారు. క్రికెట్ బోర్డు, ఒక ఐపీఎల్ లాంటి ఫ్రాంచైజీ ఎంతమాత్రం కాదు. మరి క్రీడకు సంబంధించిన ప్రశస్త సంప్రదాయాలను సమున్నతం చేయవలసిన బాధ్యత బీసీసీఐకి ఉన్నది. క్రీడాకారులు, క్రికెట్ వ్యవహారాల నిర్వాహకుల మధ్య తేడాను పాటించడం అటువంటి అత్యుత్తమ సంప్రదాయాలలో ఒకటి. మరి క్రికెట్ బోర్డ్ అధికారులు 'ఇండియా ఛాంపియన్' టీషర్ట్‌లు ధరించి విజేతలయిన క్రీడాకారులతో పాటు ఓపెన్ టాప్ బస్‌పై కూర్చుని క్రీడాభిమానుల కేరింతలకు క్రీడాకారుల వలే చేతులు ఊపుతూ ప్రతిస్పందించడం ఏమి సబబు? ట్రోఫీ ఎత్తిపట్టుకుని ఫోటోలు కూడా దిగడమా? ఇది ఎంత మాత్రం సరైనది కాదు.

మరి కొద్ది నెలల్లో ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ)కి జైషా తదుపరి అధ్యక్షుడు అయ్యే అవకాశమున్నది. 35 ఏళ్ల షా క్రికెట్‌కు బిగ్‌బాస్‌గా చాలా శీఘ్రగతిన ఎదిగారు. ఐసీసీకి అధ్యక్షుడు కావడం ఆయన ఉత్థానంలో మరో గొప్ప ముందడుగు. అమిత్ షా కుమారరత్నం అయిన జైషా 'నెపో బేబీ' (తండ్రి పలుకుబడితో ఉన్నత స్థాయికి ఎదిగిన బిడ్డ)కి ఒక మంచి ఉదాహరణ అని ఆయన విమర్శకులు అంటుండవచ్చు గానీ జూనియర్ షా పనితీరు ప్రశస్తమైనది అనడంలో సందేహం లేదు. అనేక మేలు మార్పులకు ఆయన ప్రధాన కారకుడు. అయితే ఇప్పుడు ట్రోఫీలను గెలవడమే కాకుండా నిజమైన క్రికెట్ సంస్కృతిని గౌరవించవలసిన అవసరమున్నదన్న విషయాన్ని జైషా, క్రికెట్ బోర్డు అధికారులు గుర్తించాలి. బీసీసీఐ అధికారులు క్రికెట్ సంరక్షకులే కానీ ఆ ఆట వ్యవహారాలను శాసించే సర్వాధికారులు కారు.

తాజా కలం: ఇంగ్లాండ్‌లో ఏటా జరిగే వింబుల్డన్ టెన్నిస్ టోర్నమెంట్ విశిష్టమైన, అద్వితీయమైన క్రీడా సంఘటన. ఈ ప్రపంచ ప్రఖ్యాత టెన్నిస్ టోర్నమెంట్ ఎందుకు ప్రశస్తమైన క్రీడా సంఘటనో వింబుల్డన్ ఇటీవలే మరోసారి నిరూపించింది. రాయల్ బాక్స్ (కులీన, ఉన్నత స్థాయి అతిథులు కూర్చునే ప్రదేశం)లో ఉన్న వారందరూ వివిధ క్రీడలలో ప్రపంచ స్థాయి ఘనాపాటీలే. మన భారత రత్న సచిన్ టెండూల్కర్ సహా వారందరూ ప్రత్యేక ఆహ్వానితులు. వింబుల్డన్ అధికారులు కానీ, కార్పొరేట్ కుబేరులు కానీ ఎక్కడా ప్రాధాన్యం పొందలేదు. మరి భారతీయ క్రికెట్ మ్యాచ్‌లో మనకు కనపడేది అందుకు పూర్తిగా విరుద్ధమైనదే కాదూ?

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

విప్లవ తేజస్వి డీవీ

కమ్యూనిస్టు విప్లవకారుల అగ్రనాయకులు దేవులపల్లి వెంకటేశ్వరరావు (డీవీ) 1984 జూలై 12న మరణించారు. విప్లవ లక్ష్యం కోసం దేశంలో ఒక మనిషిని మరో మనిషి దోచుకోవటానికి వీలులేని సమసమాజ స్థాపన కోసం తన సర్వస్వాన్ని అర్పించి, భారత విప్లవోద్యమ చరిత్రలో మార్గదర్శిగా ప్రఖ్యాతిగాంచి అమరులైన ఆ విప్లవ తేజస్వికి 40వ వర్ధంతి సందర్భంగా జోహార్లు.

1939లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించిన డీవీ, పూర్తిస్థాయి కార్యకర్తగా నల్లగొండ జిల్లాలో ఉద్యమ నిర్మాణం ప్రారంభించారు. దేశంలోనే ఒక మహోజ్వల చరిత్రను సృష్టించిన తెలంగాణ ప్రజల సాయుధపోరాటం (1946–51) అన్ని దశల్లోనూ ఆయన కీలక పాత్ర నిర్వహించారు. ఆ పోరాటాన్ని విరమించాలనే ధోరణిని తీవ్రంగా ఖండిస్తూ 1949లోనే ఆయన ఒక డాక్యుమెంటును రచించారు.



భారతదేశ ప్రజలు నేడు ఫ్యూడల్ భూస్వాముల, బడాపెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల దోపిడీలు – అనే మూడు బరువులను మోస్తున్నారని, ఈ దోపిడీలను సమూలంగా రద్దుచేసి ఒక నూతన ప్రజాతంత్ర వ్యవస్థను స్థాపించుకున్నప్పుడే అన్ని రంగాల ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం అవుతాయని డీవీ ఉద్ఘాటించారు. ఈ లక్ష్యసాధనకు, దేశప్రజల విముక్తి కోసం విప్లవ కార్యక్రమాన్ని, పంథాను రూపొందించారు. పాలకవర్గాలు తమపై కుట్రకేసు (హైదరాబాదు కుట్రకేసు) బనాయించినపుడు కోర్టులో తమ విప్లవ కార్యక్రమాన్ని, పంథాను, లక్ష్యాలను బహిరంగంగా ప్రకటించారు. అనేక నిర్బంధాలకు, జైలు శిక్షలకు గురయ్యారు. ఏళ్ళ తరబడి రహస్య జీవితాన్ని గడిపారు. సుమారు 5 ఏళ్ళపాటు వివిధ జైళ్ళలో గడిపారు.

భారత విప్లవోద్యమంలో పొడచూపిన అనేక పెడధోరణులను అతివాద, మితవాద అవకాశవాదాలను వ్యతిరేకిస్తూ రాజీలేని సిద్ధాంత పోరాటాన్ని నిర్వహించారు. ఈ విప్లవ కర్తవ్య నిర్వహణలో కమ్యూనిస్టు విప్లవయోధుడు తరిమెల నాగిరెడ్డి(టిఎన్)తో భుజం భుజం కలిపి నిర్వహించిన పాత్ర చరిత్రాత్మకమైనది. 1975 ఏప్రిల్‌లో టిఎన్‌తో కలిసి యుసిసిఆర్‌ఐ (యం–యల్)ను స్థాపించారు. డీవీ, టిఎన్ భారత విప్లవోద్యమంలో కృష్ణార్జునుల వంటివారు అని ప్రముఖ విప్లవకవి కేశే. జ్వాలాముఖి అభివర్ణించారు. నిజమైన కమ్యూనిస్టు విప్లవకారుడికి ఉండాల్సిన లక్షణాలన్నీ మూర్తీభవించిన నేత డీవీ. సత్యసంధత, చిత్తశుద్ధి, వ్యక్తిగత నిజాయితీ, నిస్వార్థబుద్ధి, త్యాగశీలత, నిరాడంబరమైన, క్రమశిక్షణాయుత జీవితం, మచ్చలేని శీలం– అత్యున్నతమైన నైతిక విలువలను ఆయన పాటించి యువ విప్లవకారులకు ఆదర్శనీయుడయ్యారు.

– సి. భాస్కర్, యుసిసిఆర్‌ఐ (యం–యల్)

అందరూ రాజ్యాంగ రక్షకులే, కానీ...

ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికలకు ముందూ, ఆ తర్వాతా కూడా, అన్ని పార్టీల నోళ్ళలోనూ, ఆ పార్టీలతో ఏకీభవించే మేధావుల రాతల్లోనూ, బాగా నానుతున్న మాట 'రాజ్యాంగం.'

'రాజ్యాంగానికి బద్ధ వ్యతిరేకులు మోదీ, షాలు! వాళ్ళు రాజ్యాంగాన్ని నాశనం చెయ్యడానికి చూస్తే, మేము ఒప్పుకోము!' – రాహుల్‌గాంధీ.

'ఒకప్పుడు ఎమర్జెన్సీ పెట్టి, రాజ్యాంగాన్ని అవమానించిన వారే, ఈ నాడు రాజ్యాంగం పేరుతో నాట్యమాడుతున్నారు!' – నరేంద్ర మోదీ.

మొత్తానికి అన్ని పార్లమెంటరీ పార్టీల వారూ, రాజ్యాంగం పట్ల తమకున్న విధేయతని గొంతెత్తి చాటుకుంటున్నారు. మోదీ అయితే, కొత్త పార్లమెంటులో, రాజ్యాంగం పుస్తకం ముందు వంగి నమస్కరించడం తెలిసిందే. రాహుల్‌గాంధీ చేతిలో మత గ్రంథం పట్టుకున్నట్టు రాజ్యాంగం పుస్తకాన్ని చేత్తో పట్టుకుని ఊపుతూ కనబడ్డ దృశ్యం కూడా తెలిసిందే. ఇంతకీ, ఆ రాజ్యాంగం ఏమి చెపుతుందో, దేశంలోని కోట్ల మంది శ్రామిక ప్రజల ప్రయోజనాల దృష్టితో చూడాలి.

కొంచెం తేలికైన మాటల్లో చెప్పుకోవాలంటే, రాజ్యాంగం అనేది ప్రభుత్వమూ పౌరులూ అనుసరించాల్సిన నియమావళి. పౌరులకూ, ప్రభుత్వానికీ వున్న హక్కులేమిటో, విధులేమిటో వివరించే సూత్రాల పత్రం అది. పౌరులు అనేవాళ్ళు ఏ దేశంలో అయినా, మూసపోసినట్టు ఒకే రకమైన పరిస్థితులలో వుండరు. వేరు వేరు వర్గాలుగా వుంటారు. అయితే, ప్రభుత్వం అనేది అన్ని వర్గాల పౌరులకూ ప్రతినిధిగా వుంటుందా? అలాంటప్పుడు రాజ్యాంగం మాత్రం అన్ని వర్గాల ప్రయోజనాలనూ కాపాడుతుందా? ఈ విషయాలు తెలియాలంటే, భారత రాజ్యాంగం ఎలా తయారైందో చూడాలి.

భారత రాజ్యాంగాన్ని తయారు చేయించినదీ, ఆమోదించినదీ రాజ్యాంగ సభ. అంటే, ఆ నాటి పార్లమెంటులాంటిది. కానీ, ఆ సభలోని సభ్యులు, ఇప్పటిలాగా, దేశంలోని ఓటు హక్కువున్న పౌరులందరూ ఓట్లు వెయ్యగా ఎన్నికైనవాళ్ళు కాదు. జనాభాలో నాలుగో వంతు మందికి మాత్రమే వుండిన ఓటు హక్కు ద్వారా, స్థానిక శాసనసభలకు ఎన్నికైన వాళ్ళు మాత్రమే ఓటు వెయ్యగా రాజ్యాంగ సభ్యులయ్యారు. నేరుగా ఎన్నిక కానివారే కాక, ఏ రకమైన ఎన్నికా లేకుండానే, రాజాస్థానాల ప్రతినిధులు 96 మంది (మొత్తం సభ్యుల్లో పావు వంతు మంది) కూడా కూచుని, రాజ్యాంగాన్ని ఆమోదించారు. అంటే, ఈ రాజ్యాంగం దేశ ప్రజలంతా ఓట్లు వెయ్యగా కలిసి ఏర్పర్చుకున్నది కాదు; భారతదేశపు పాలక వర్గాలు తయారు చేయించుకున్నది మాత్రమే! కానీ, 'భారత ప్రజలమైన మేము...' అని రాజ్యాంగంలోని మొట్టమొదటి వాక్యం మొదలవుతుంది. రాజ్యాంగం ఎలా తయారైనప్పటికీ, దానిలో వున్న నియమాలు, శ్రామిక ప్రజల ప్రయోజనాలను కాపాడేలా వున్నాయో లేవో చూడాలి. కొన్ని వందల పేజీల్లో వున్న రాజ్యాంగంలోని అన్ని విషయాలనూ ఇక్కడ చూడలేము. మచ్చుకి కొన్ని మాత్రమే చూడగలం.

పౌరులకి తగిన జీవనాధారం కల్పించాలని 39వ సూత్రం. రాజ్యాంగ రచయితలకీ, రాజ్యాంగ సభ సభ్యులకీ అవసరానికి మించిన జీవనాధారం ఎందుకు వుందీ, ఇతరులకు ఎందుకు లేదూ? అసలు జీవనాధారాలకు వీలునిచ్చే భూమి వంటి సాధనాలుగానీ, ఉద్యోగాలుగానీ కోట్లాదిమందికి ఎందుకు లేవు? అనే ప్రశ్నే వేసుకోలేదు రాజ్యాంగ రచయితలు!



srini

రాజ్యాంగం మీద గౌరవం లేకుండా, కాంగ్రెసు పార్టీ ఎమర్జన్సీని విధించిందని బీజేపీ విమర్శ. కానీ, రాజ్యాంగంలోనే వున్న 352వ సూత్రం ప్రకారం, ప్రత్యేక పరిస్థితుల్లో ఎమర్జన్సీని విధించడానికి రాజ్యాంగమే వీలు కల్పించింది. ఇదంతా, పాలకవర్గాల వారు ముందు చూపుతో పెట్టుకున్న వెసులుబాటు!

రాజ్యాంగాన్ని మెచ్చుకునేవారు చెప్పే విషయం, ఈ రాజ్యాంగం ప్రసాదించిన కొన్ని హక్కులు: అభిప్రాయ ప్రకటనా స్వేచ్ఛా, సమావేశం అయ్యే స్వేచ్ఛా, సంఘాలు పెట్టుకునే స్వేచ్ఛా. ఇదే రాజ్యాంగంలో, 1963లో చేసిన సవరణ ప్రకారం ఈ హక్కుల్ని కత్తిరించే అధికారాన్ని కూడా రాజ్యాంగమే ప్రభుత్వానికి ఇచ్చింది. ఇది కూడా పాలకవర్గాలు గడుసుగా పెట్టుకున్న నిబంధన! రాజ్యాంగంలో 23వ, 24వ సూత్రాలు దోపిడీ వ్యతిరేక హక్కుని కల్పించాయని చెపుతారు, రాజ్యాంగ సమర్థకులు. కానీ, ఈ రాజ్యాంగం ప్రకారం, 'దోపిడీ' అంటే శ్రమ దోపిడీ అని కాదు. ఆ సూత్రాల అర్థం, శ్రమ చేయించుకుని జీతం ఇవ్వకపోవడం మాత్రమే దోపిడీ కిందకి వస్తుంది. అంతేగానీ, అదనపు విలువ రూపంలో, జరిగే శ్రమ దోపిడీ గురించి కాదు. కాబట్టి, ఈ పూత, శ్రమ దోపిడీ అనే రాకాసి పుండుని మార్చజాలదు.

47వ సూత్రం ప్రకారం, ప్రజలకి పోషకాహారం అందేలా ప్రభుత్వం చూడాలి. ప్రజల్లో కొందరికి సరైన ఆహారం అందకపోవడానికీ, కొందరికి పొట్టపగిలేలా తినగలిగినంత ఆహారం ఉండడానికీ, కారణం 'దోపిడీ స్వంత ఆస్తే' అనే సంగతి రాజ్యాంగం రాసినవాళ్ళకి తెలీదా? ఉన్నవాళ్ళూ–లేనివాళ్ళూ అనే నిజం కళ్ళముందు కనపడలేదా? కాబట్టి, ప్రజలకి పోషకాహారం అందేలా చూడమని చెప్పడం వల్ల దారిద్ర్యం అనే రాకాసి పుండు మానదు.

అందరికీ సమానావకాశాలు అని 17వ సూత్రం చెపుతూ వుంటే, 18వ సూత్రమేమో చాతుర్వర్ణాల లాగా, 4 రకాల బిరుదుల్ని ప్రసాదించింది. దేశ పౌరుల్లో కొందరు పద్మశ్రీలు, పద్మ భూషణులు, పద్మ విభూషణులు, భారత రత్నలు. మిగతా అందరూ ఉత్తుత్తి మనుషులు!

బాల కార్మికుల శ్రమని నిషేధించడానికి 24వ సూత్రం. భూములూ, ఫ్యాక్టరీలూ, గనులూ, వగైరా ఆస్తులున్న కుటుంబాలలో బాలలెవరూ ఇతరుల ఇళ్ళల్లో, పని స్థలాలలో శ్రమలు చేయడానికి ఎందుకు వెళ్ళరో, రాజ్యాంగ రచయితలకు కారణం తెలియలేదా? కాబట్టి, ఈ సూత్రం కూడా, బాల కార్మిక వ్యవస్థ అనే రాకాసి పుండును మాన్పదు.

పౌరులకి తగిన జీవనాధారం కల్పించాలని 39వ సూత్రం. రాజ్యాంగ రచయితలకీ, రాజ్యాంగ సభ సభ్యులకీ అవసరానికి మించిన జీవనాధారం ఎందుకు వుందీ, ఇతరులకు ఎందుకు లేదూ? అసలు జీవనాధారాలకు వీలునిచ్చే భూమి వంటి సాధనాలుగానీ, ఉద్యోగాలుగానీ కోట్లాదిమందికి ఎందుకు లేవు? అనే ప్రశ్నే వేసుకోలేదు రాజ్యాంగ రచయితలు!

ఎస్సీ, ఎస్టీల మీద జరిగే 'అత్యాచారాల' నిరోధించే చట్టం ఒకటి వుంది. కానీ, మెజారిటీ కేసుల్లో దానివల్ల ఏ ప్రయోజనమూ లేదు. కంచికచర్లా, కారంచేడూ, చుండూరూ ఘటనలు మనకి తెలుసు. దేశ చరిత్రలో అత్యంత కిరాతకమైన అత్యాచారమూ, హత్యాకాండా, మహారాష్ట్రలోని ఖైర్లాంజీలో జరిగింది. ఆ హంతకులకి ఏమీ జరగలేదు. ఈ దురంతం గురించి, 'ఆంధ్రజ్యోతి'లో, 'వివిధ' పేజీలో, గుంటూరు ఏసుపాదం అనే కవి ఒక గొప్ప వచన కవిత రాశాడు. దానిలో, మొట్టమొదటి పాదంలోనే, 'రాజ్యాంగం పూతలకు, రాకాసి పుండ్లు మానవు...' అంటారు ఏసుపాదం గారు. పేదరికం, నిరుద్యోగం, అనారోగ్యం, దళిత బహుజనుల మీదా, ఆదివాసీల మీదా జరిగే దాడులూ... ఇలాంటి సమస్యలన్నీ 'రాకాసి పుండ్లే! (కాన్సర్ పుండ్లే)'.

అందుకే, పార్లమెంటరీ రాజకీయాలలో నమ్మకం లేని వారు, ఇప్పుడున్న దానిని 'శ్రమ దోపిడీకి వీలునిచ్చే రాజ్యాంగం' అని భావించి, 'దీన్ని తిరస్కరించి, కొత్తదాన్ని రాసుకుందాం' అంటారు. గుంటూరు ఏసుపాదం, తన అద్భుత కవితలో చెప్పినట్టు, 'కులాతీత, మతాతీత మానవుడు/ మా'నవ రాజ్యాంగాన్ని' రచిస్తాడు/ ఆగామి యుగాన్ని అనుశాసిస్తాడు!' ఆ 'నవ' రాజ్యాంగం ఎలా ఉంటుందో, కవి చెప్పకపోయినా, ఇప్పుడున్నదానికి పూర్తి వ్యతిరేకంగానూ, భిన్నంగానూ వుంటుంది. సామాజిక రాచపుండ్లకి వీలునివ్వనిదిగా వుంటుంది. అంటే, శ్రమ దోపిడీని అనుమతించనిదిగా వుంటుంది. పౌరులందరూ, ఇతరుల శ్రమని దోచేవారిగా కాక, తాము కూడా శ్రమలు చేసే వారిగా నిర్దేశిస్తుంది. కులాలుగా గడ్డకట్టించిన అసమాన శ్రమవిభజన స్థానంలో, నూతన సమాన శ్రమ విభజనను ప్రవేశపెడుతుంది. అలాంటి రాజ్యాంగం రూపొందాలంటే, ఇప్పుడున్న రాజ్యాంగం స్వభావాన్ని, శ్రామికవర్గ దృక్పథంతో పరిశీలించే పని జరగాలి. అంతేగానీ, దీనికే, 'పూతలు' (సంస్కరణలు) పూసే పనిలో మనం సమయం వృథా చెయ్యకూడదు. ముఖ్యంగా ప్రజల పక్షాన నిలబడే మేధావులు!

▪ బి.ఆర్. బాపూజీ



యువకుడి..ఉన్మాదం

ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతి తల్లిదండ్రులపై వేటకత్తితో దాడి



నిందితుడు మేకల నాగరాజు

- భార్యను దూరం చేశారన్న కక్షతో నరికి చంపిన వైనం
- గాఢ నిద్రలో ఉండగా ఘాతుకం
- భార్య, ఆమె సోదరుడిపైనా దాడి.. తీవ్రగాయాలు
- వరంగల్ జిల్లా పదహారు చింతల్‌తండాలో ఘటన



బానోతు శ్రీనివాస్ మృతదేహం



సుగుణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



సుగుణ, శ్రీనివాస్ దంపతులు (ఫైల్)

చెన్నారావుపేట, జూలై 11: కూతురి ప్రేమ, పెళ్లి వ్యవహారం ఆ దంపతుల దారుణ హత్యకు దారి తీసింది. ప్రేమించి పెళ్లి చేసుకున్న తమను పెద్దల్లో పంచాయితీ పెట్టి విడదీశారని యువతి తల్లిదండ్రులపై కక్ష పెంచుకున్న ఆ యువకుడు.. వారి పాలిట కాలయముడయ్యాడు. గాఢ నిద్రలో ఉన్న వారిపై వేట కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి హత మార్చాడు. ఇక ఈ దాడిలో ఆ యువకుడి భార్య ఆమె సోదరుడు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పదహారుచింతల్ తండాలో జరిగిన గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ దారుణ ఘటన కలకలం రేపింది. పోలీసులు, గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం.. పదహారు చింతల్ తండాకు చెందిన బానోతు శ్రీనివాస్ (40) బానోతు సుగుణ (35) దంపతులకు ఓ కుమార్తె, ఓ కుమారుడు ఉన్నారు. గ్రామంలోనే వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న ఆ దంపతుల కూతురు దీపిక హనుమకొండలోని పింగిళి కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం, కుమారుడు మదన్‌లాల్ అమీనాబాద్ మోడల్ పాఠశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నారు. ఇక గీసుకొండ మండలం కొమ్మాలకు చెందిన మేకల నాగరాజు(బన్నీ) అనే యువకుడు మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ గ్రామంలోని తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ.. నిత్యం గుండెంగ నుంచి నెక్కొండకు ఆటోను నడుపుతుంటాడు. అయితే గతంలో

మిగతా 7వ పేజీలో..

నర్సంపేటలో ఉద్రిక్తత

'చింతల్‌తండా' మృతుల కుటుంబానికి న్యాయం చేయాలంటూ గ్రామస్థుల రాస్తారోకో

ఆందోళనకారులను కలెక్టర్‌తో మాట్లాడించిన డీసీపీ.. ఆందోళన విరమణ

బల్దియాలో బదిలీల సందడి



బల్దియా సి-1 సెక్షన్‌లో ఉద్యోగుల సందడి

- ఈ నెల 20లోపు దరఖాస్తుల సమర్పణకు గడువు
- బల్దియా సి-1 కార్యాలయంలో ఉద్యోగుల జాతర
- స్థానచలనం కాకుండా కొందరి అడ్డదారులు
- ప్రజాప్రతినిధులు, గాడ్‌ఫాదర్ల వద్దకు పరుగులు
- తమను బదిలీ చేయొద్దని పారిశుధ్య ఉద్యోగుల వేడుకోలు

వరంగల్ కార్పొరేషన్, జూలై 11: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు కాజీపేట, కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాల్లో బదిలీల సందడి నెలకొంది. కిందిస్థాయి ఉద్యోగుల నుంచి సీనియర్ అసిస్టెంట్స్, నాలుగో తరగతి ఉద్యోగుల స్థానచలనానికి రంగం సిద్ధమైంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలలో మూడేళ్లకు మించి ఒకే చోట పని చేసిన ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు చేస్తోంది. ఈ మేరకు ఈనెల 3న విడుదలైన జీవో ఎం.ఎస్ నెంబర్ 80 ప్రకారం అందరు ఉద్యోగులు తప్పక దరఖాస్తు చేసుకోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేసే ప్రతీ పభుత్వ ఉద్యోగి ఈ నెల 20లోపు బయోడేటా ఆప్షన్ ఫామ్ పూర్తి చేసి ప్రధాన కార్యాలయంలోని సి-1 సెక్షన్‌లో అప్పగించాలని షెడ్యూల్ విడుదలైంది. దీంతో ప్రతీ రోజు బల్దియాలోని సి-1 కార్యాలయం వద్ద ఉద్యోగుల జాతర కనిపిస్తోంది. ఈనెల 20వ తేదీ తర్వాత పూర్తిస్థాయిలో బదిలీలు, పోస్టింగ్‌లు వెలువడుతాయి.

40 శాతానికి మించకుండా..

బల్దియా పరిధిలో పనిచేసే సిబ్బందిని 40 శాతానికి పైగా ప్రభుత్వం బదిలీ చేయనుంది. దీంతో రెండు సర్కిళ్లతో పాటు ప్రధాన కార్యాలయంలోని శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్ సెక్షన్, ట్యాక్సీ వసూలు, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌ల నుంచి మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారిని బదిలీ చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రధానంగా పబ్లిక్ హెల్త్ వర్కర్లు, జవాన్లు, సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఫీల్డ్ వర్కర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్ ముకదమా, నాన్ పీహెచ్ వర్కర్లు, మ్యాన్ మజ్దూర్, గ్యాంగ్ కూలీ, ఆపరేటర్లు, లైన్‌మెన్లు, హెడ్ డ్రాఫ్టమెన్, బ్లూప్రింట్ ఆపరేటర్లు, ట్రెజర్లు, చైన్‌మెన్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు (బిల్ కలెక్టర్లు) అటెండర్లు, వాచ్‌మెన్లను బదిలీ చేస్తారు. సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లను జోనల్ స్థాయిలోకి బదిలీ చేస్తుండగా, 4వ తరగతి ఉద్యోగులను జిల్లా స్థాయికి బదిలీ చేస్తారు. కాగా, వీరిలో స్పౌజ్ కేసులు, మానసిక వికలాంగుల పిల్లలు, బైపాస్ సర్జరీ అయిన వారు, వైద్యపరమైన సమస్యలు ఉన్నవారికి బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

బదిలీలు కాకుండా ప్రయత్నాలు

కొందమంది ఉద్యోగులు బదిలీ కాకుండా శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. కొందరు ఉద్యోగులు గాడ్‌ఫాదర్ల చుట్టూ తిరుగుతుండగా, మరికొందరు సెక్షన్ అధికారులను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఇదే అదునుగా కొందరు ప్రజాప్రతినిధులు, మాజీ ఉద్యోగ సంఘాల నాయకులు, బ్రోకర్లు బదిలీ కాకుండా చేస్తామని బేరసారాలు కుదుర్చుకుని అందినకాడికి డబ్బులు దండుకుంటున్నట్టు తెలిసింది. అయితే సీనియారిటీ బుక్ ఆధారంగా బదిలీలు జరగాల్సి ఉండగా, అలా జరగడం లేదని తెలిసింది. అధికారులు సైతం సీనియారిటీ చూడకుండా కొందరిని ఇతర ప్రాంతాలకు పంపించే ప్రయత్నాలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. కాజీపేట సర్కిల్‌లో పని చేసే ఓ ఉద్యోగి జేఏసీ సంఘం అధ్యక్షుడవుతాడనే కుట్రలో అధికారులపై ఒత్తిడి తెచ్చి భద్రాద్రి కొత్తగూడెం 4వ జోన్‌కు బదిలీ చేసేందుకు పావులు కదుపుతున్నట్టు సమాచారం. అలాగే ప్రధాన కార్యాలయంతో పాటు సర్కిల్ కార్యాలయాల్లో పలు విభాగాల్లో 8మంది సూపరింటెండెంట్లు పని చేస్తుండగా వీరిని కదిలిచేవాళ్లే లేకుండాపోయారు.

నాలుగో తరగతి ఉద్యోగులకు కూడా..

70 ఏళ్ల బల్దియా చరిత్రలో ఎప్పుడూ 4వ తరగతి ఉద్యోగులను జిల్లా దాటి బదిలీలు చేయలేదు. ఇప్పుడు పీహెచ్ (పబ్లిక్ హెల్త్) వర్కర్లను ఇతర ప్రాంతాలకు బదిలీ చేసేందుకు అధికారులు పూనుకున్నారు. అయితే తాము ఇతర ప్రాంతాలకు వెళితే ఇళ్లు కూడా అద్దెకు ఇవ్వరని, కనీసం నీళ్లు కూడా ఇవ్వరని కార్మికులు వాపోతున్నారు. రోడ్లు, డ్రైనేజీలు శుభ్రం చేసే తమ బదిలీలపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతున్నారు. లేదంటే కోర్టును ఆశ్రయిస్తామని చెబుతున్నారు.

కానరాని జేఏసీ నాయకులు?

గతంలో బల్దియాలో ఏ ఉద్యోగికి సమస్య వచ్చినా బల్దియా ది జాయింట్ కౌన్సిల్ మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (జేఏసీ) నాయకులు పరిష్కరించేవారు. కానీ ఇటీవల జేఏసీ అధ్యక్షుడు ఉద్యోగ విరమణ చేయడంతో పట్టించుకునేవారు లేరు. నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి పదవుల కోసం పాకులాడుకుంటున్నట్టు తెలిసింది. దీంతో బల్దియా ఉద్యోగుల సమస్యలు పట్టించుకున్న నాదుడే కరువయ్యారు.

వాహినీ వాసినిగా అమ్మవారు

ఆరో రోజుకు భద్రకాళి శాకంబరీ ఉత్సవాలు



విరోధిని అలంకారంలో ఉత్సవమూర్తి

వరంగల్ కల్చరల్, జూలై 11: భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలు గురువారానికి ఆరో రోజుకు చేరుకున్నాయి. ఉదయం 4 గంటలకు నిత్యాహ్నికం అనంతరం ఉత్సవమూర్తులలో ఇచ్ఛాశక్తి కాళీ క్రమాన్ని అనుసరించి భద్రకాళి అమ్మవారిని వాహినీవాసినిగా అలంకరించి పూజారాధనలు నిర్వహించారు. అలాగే ఉత్సవమూర్తిని విరోధినిగా అలంకరించారు. శాకంబరీ ఉత్సవాల సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవార్లను దర్శించుకుంటే కర్మఫల ప్రాప్తి, ఐశ్వర్యాభివృద్ధి కలుగుతాయని ప్రధానార్చకుడు భద్రకాళి శేషు తెలిపారు.

వనమహోత్సవంలో ప్రథమస్థానంలో నిలవాలి

- ప్రతీ ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలి
- అటవీ, పర్యాటకశాఖ మంత్రి కొండా సురేఖ
- ఈఎస్ఐ ఆస్పత్రిలో మొక్కలు నాటిన మంత్రి

ఖిలావరంగల్, జూలై 11: వన మహోత్సవంలో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటి, జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని అటవీ, పర్యాటకశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా గురువారం వరంగల్ నగర పాలక సంస్థ, అటవీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మేయర్ గుండు సుధారాణి, వరంగల్ కలెక్టర్ సత్యశారదా దేవి, కమిషనర్ అశ్వినితానాజీ సంయుక్తతో కలిసి ఆమె వరంగల్ ఈఎస్ఐ ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 2024లో 20కోట్ల మొక్కలను నాటడమే లక్ష్యమన్నారు. అందులో భాగంగా వరంగల్ జిల్లాకు 24 లక్షలు కేటాయించారని, 12 అడుగుల ఎత్తున్న పలురకాల మొక్కలను పంపిణీ చేస్తామన్నారు. రైతులకు శాండల్ వుడ్, వెదురు, ఈత, ఆగ్రో ఫారెస్టు కింద మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రణాళికబద్ధంగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని మంత్రి అధికారులకు సూచించారు. వానరాలు జనావాసాలను వీడి అడవుల్లోకి వెళ్లిపోవాలంటే అడవిలో పండ్ల మొక్కలు నాటాలని ఆదేశించారు. ఇక మానవాళికి ప్లాస్టిక్ వినియోగంతో పెను ముప్పు వాటిల్లుతోందని, ప్లాస్టిక్ నిర్మూలనను అందరూ బాధ్యతగా తీసుకుని పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు.

మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లల పుట్టినరోజు వేడుకలతో పాటు మొక్కలను నాటి వాటిని సంరక్షించేలా చూడాలన్నారు. కలెక్టర్ సత్యశారదా దేవి మాట్లాడుతూ.. సెంట్రల్ మీడియా, అవెన్యూ బ్లాక్ ప్లాంటేషన్, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, చెరువులు, కుంటలను పర్యావరణ పరిరక్షణతోపాటు ఆక్రమణకు గురవకుండా ప్రణాళికా బద్ధంగా మొక్కలను నాటాలన్నారు. అంతకుముందు వనమహోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఐ ఆస్పత్రి ఇన్‌చార్జ్ డాక్టర్ అశోక్, వరంగల్ జిల్లా అటవీ శాఖాధికారి అనూజ్ అగర్వాల్, కార్పొరేటర్లు వస్కుల బాబు, మరుపల్ల రవి, సురేష్‌జ్యోషి, రామతేజస్విని శిరీష్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో కృష్ణవేణి, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, నాయకులు తాండ్ర లాజర్, జన్ను రవి, వివేక్, గిరిగిరి పుష్ప, సంగరబోయిన చందర్, కిన్నెర రవి, శ్యామ్‌కుమార్, ఎం.ఫ్రాన్సిస్ జాషువా, బల్దియా, అటవీ, ఈఎస్ఐ ఆస్పత్రి, మెప్మా అధికారులు, ఆర్పీలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మొక్కలను నాటుతున్న మంత్రి సురేఖ, మేయర్, కలెక్టర్, కమిషనర్

గంజాయి రహిత కమిషనరేట్‌గా మారుద్దాం..

- యువతను గంజాయి నుంచి కాపాడుకుందాం..
- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జులై 11: వరంగల్ కమిషనరేట్‌ను గంజాయి రహిత కమిషనరేట్‌గా మారుద్దామని, యువతను గంజాయి నుంచి కాపాడుకుందామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులకు సూచించారు. గురువారం హనుమకొండలోని కమిషనరేట్‌లో మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ట్రైసిటీస్‌తో పాటు గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలు, వినయోగం జరిగే ప్రాంతాల వివరాలు కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా మాట్లాడుతూ.. మత్తు పదార్థాల బారిన పడిన యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. సులభంగా డబ్బు సంపాదించాలని కొంతమంది గంజాయి అక్రమ రవాణా చేస్తున్నారని తెలిపారు. ప్రతీ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయాలు, మత్తు పదార్థాలను వినయోగించే వారి వివరాలు సేకరించి నిఘా పెట్టాలని ఆయన సూచించారు. అందరం సమన్వయంతో పనిచేసి గంజాయిని సమూలంగా నిర్మూలిద్దామని అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ రవి, ఏసీపీ జితేందర్‌రెడ్డి, తిరుపతి, భీమ్‌శర్మ, తిరుమల్, డేవిడ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

పన్నుల వసూళ్లలో పురోగతి సాధించాలి

- అక్రమాలకు పాల్పడే అధికారులను ఉపేక్షించేది లేదు
- మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 11: వరంగల్ నగరంలో వివిధ రకాల పన్నుల వసూళ్లలో సిబ్బంది పురోగతి సాధించాలని, ఈ యేడు పెద్ద మొత్తంలో సకాలంలో పన్నులు వసూలు చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. గురువారం బల్దియా కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేసి మేయర్ మాట్లాడారు. కిందటేడుతో పోలిస్తే ఈ యేడు పన్నుల వసూళ్లు తగ్గిపోయాయని, సిబ్బంది వేగవంతంగా పన్నుల వసూళ్లలో ముందంజలో ఉండాలన్నారు. యేటా నీటి పన్నులు 70 శాతం జరిగేవని, ఈ యేడు 40శాతం మాత్రమే జరిగాయన్నారు. 10 లక్షలు ఉన్న బల్దియా పరిధిలో 700 నల్లా కలెక్షన్లు ఉండడం సరికాదని, క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలు పర్యటించి కమర్షియల్ నల్లా కలెక్షన్లను గుర్తించాలన్నారు. నగరంలో ఖాళీగా ఉన్న స్థలాలకు వీఎల్‌టీ (వెకెంట్ ల్యాండ్ ట్యాక్స్)ని విధించాలని ఆదేశించారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) సాంకేతిక సమస్య త్వరితగతిన పరిష్కరించాలన్నారు. మునిసిపాలిటీకి నుంచి అద్దెకు కేటాయించిన షాపుల నుంచి క్రమం తప్పకుండా అద్దె డబ్బులు వసూలు చేయాలన్నారు. అనధికారిక ఇళ్లకు ఇంటి నెంబరు జారీ చేయకూడదని, కొందరు ఆర్ఐ స్థాయి అధికారులు తప్పులు చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. ఎవరైనా తప్పు చేసినట్టు దొరికితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కమిషనర్ నిమ్మ కృష్ణారెడ్డి, డిప్యూటీ కమిషనర్ రవీందర్, రెవెన్యూ అధికారులు యూసుఫుద్దీన్, సుదర్శన్, శ్రీనివాసలతోపాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

వచ్చే ఏడాదిలో రూ.500కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 11: వచ్చే ఏడాదిలో రూ.500కోట్ల నిధులతో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించానని తెలిపారు. 15ఏళ్లలో నియోజకవర్గం అభివృద్ధి కాలేదన్నారు. 2023లో తాను గెలిచినా నియోజకవర్గం అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరానని స్పష్టం చేశారు. ఆ తర్వాత నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతిపాదనలను సిద్ధం చేసి సీఎంకు అందజేశానన్నారు. వాటిలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు కోసం నిధులు, స్టాఫ్‌ను మంజూరు చేయాలని, డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ స్థలాన్ని ఆస్పత్రికి ఇవ్వాలని సీఎంకు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు జరిగినప్పటికీ డివిజనల్ ఆఫీసులు సరిగ్గా పని చేయడం లేదన్నారు. డివిజినల్, సబ్ డివిజినల్ మొత్తం 15 కార్యాలయాలు ఒకే చోట పనిచేసే విధంగా ఇంటిగ్రేటెడ్ రెవెన్యూ డివిజనల్ ఆఫీస్‌ల కాంప్లెక్స్‌ను (సమీకృత రెవెన్యూ డివిజినల్ కార్యాలయాల సముదాయం) నిర్మించడానికి ప్రతిపాధనలు సీఎంకు ఇచ్చానని తెలిపారు. 50వేల స్క్వేర్ ఫీట్‌ల విస్తీర్ణంతో కాంప్లెక్స్‌ను నిర్మాణం చేయాలని, 15 కార్యాలయాలు ఒకే దగ్గర ఉండి ప్రజలకు సేవలు అందించేలా ప్రతిపాదనలు ఇచ్చామన్నారు. ఘన్‌పూర్-నవాబుపేట దేవాదుల మెయిన్ కెనాల్, సబ్ కెనాల్స్ లైనింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 6 ప్రధానమైన ఆర్అండ్‌బీ రోడ్లను రూ 120 కోట్లతో ఏర్పాటు చేయాలని మంత్రి కోమటిరెడ్డికి వినతి పత్రం ఇచ్చానని, చిలుపూర్, వేలేరు మండల కేంద్రాలలో మండల కాంప్లెక్స్ నిర్మాణాలకు నిదులు ఇవ్వాలని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. రూ 500 కోట్ల విలువైన వివిధ పనులు చేయాలని మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

పక్కాగా రుణమాఫీ, రైతు భరోసా అమలు

ప్రతిపక్షపార్టీలు అనేక మాటలు మాట్లాడినా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసాను పక్కాగా అమలు చేస్తుందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు తెలంగాణ అభివృద్ధికి సహకరించడం లేదన్నారు. గత పదేళ్ల కాలంపాటు బీజేపీ అధికారంలో ఉండి తెలంగాణకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించబోతున్నారని. యువతను రెచ్చగొడుతున్న బీజేపీ పదేళ్ల కాలంలో ఏ ఒక్కరికైన ఉద్యోగం ఇచ్చారా అని ప్రశ్నించారు. రాముడిపేరు చెప్పుకొని రాజకీయాలు చేసే బీజేపీ నిరుద్యోగులకు చేసిందేంటని ప్రశ్నించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రాష్ట్రానికి ఏమీ చేశారని ప్రశ్నించారు. ఏరకంగా ప్రభుత్వాన్ని నడిపారు ఏ రకంగా అవినీతిని పెంచి పోషించారు.. కుటుంబానికే పరిమితమైన అధికారం, కుటుంబానికే పరిమితమైన అవినితి, కుటంబానికే పరిమితమైన అహంకారం వల్లనే కదా బీఆర్ఎస్ ఓడిపోయిందన్నారు. అయిన్పటికీ జ్ఞానోదయం కావడం లేదని ఎద్దేవా చేశారు. రాజకీయ వలసలగూర్చి మాట్లాడే నైతికత కేసీఆర్ కుటుంబానికి లేదన్నారు. రాష్ట్రంలో రాజకీయపార్టీలను విలీనం చేసుకొని రాజకీయ వ్యవస్థకు విలువలు లేకుండా చేసింది, భ్రష్టుపట్టించింది మీరు ఏ ముఖం పెట్టుకొని మాట్లాడుతున్నారు వలసల గూర్చి అని ప్రశ్నించారు. మీరు చేస్తే సంసారం వేరేవాళ్లు చేస్తే వ్యభిచారమా అని ప్రశ్నించారు. ఎందుకు ద్వందనీతి అని మండిపడ్డారు. చట్టం తనపని తాను చేసుకుంటుంది తప్పకుండా కోర్టులు, స్పీకర్లు స్పందిస్తారని తెలిపారు. రాజకీయ వలసల గూర్చి స్పీకర్‌గాని కోర్టులుగాని వారి అభిప్రాయాలను చెబుతాయని హితవుపలికారు. నాశనం పట్టించిన కేసీఆర్ చివరకు ఏ ఒక్క రాజకీయ పార్టీకి ప్రాతినిధ్యం లేకుండా అసెంబ్లీలో అన్ని పార్టీల ఎమ్మెల్యేలను విలీనం చేసుకొని ప్రతిపక్షాల నోళ్లు మూయించిన మీరు ఇప్పుడు పూనీతులు అయినట్లుగా తప్పుచేయని వారిగా మాట్లాడడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు బెలిదె వెంకన్న, నరేందర్‌రెడ్డి, నాగరబోయిన శ్రీరాములు, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, మామిడాల లింగారెడ్డి, భూక్య రమేష్‌నాయక్, నాగరబోయిన యాదగిరి, బూర్ల శంకర్, రాజాక్‌యాదవ్, గుర్రం రాజు, తోట సత్యం, నీల శ్రీధర్, గన్ను నర్సింహులు, నీరటి ప్రభాకర్, చింత ఎల్లయ్య, చిగురు సరిత, జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నర్సంపేట పోలీస్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో చేస్తున్న పదహారుచింతల్ తండావాసులు

నర్సంపేటలో ఉద్రిక్తత

- 'చింతల్‌తండా' మృతుల కుటుంబానికి న్యాయం చేయాలంటూ గ్రామస్థుల రాస్తారోకో
- ఆందోళనకారులను కలెక్టర్‌తో మాట్లాడించిన డీసీపీ రవీందర్.. ఆందోళన విరమణ

నర్సంపేట టౌన్, జూలై 11: చెన్నారావుపేట మండలం పదహారు చింతల్ తండాలో యువకుడి చేతిలో హతమైన బానోతు సుగుణ, శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితుడికి ఉరిశిక్ష విధించాలని, అతడికి సహకరించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలంటూ మృతుల కుటుంబ సభ్యులు, తండావాసులు నర్సంపేట పట్టణంలోని పోలీస్‌స్టేషన్, అమరవీరుల స్థూపం సెంటర్లలో గురువారం ఆందోళనలు చేశారు. ఆందోళనకారుల్లో ఓ యువకుడు పెట్రోల్ మీద పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం ఉద్రిక్తతకు దారితీసింది. హత్యకు గురైన దంపతులు బానోతు సుగుణ, శ్రీనివాస్ మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టమ్ నిమిత్తం నర్సంపేటకు తీసుకొచ్చారు. పోస్టుమార్టం అనంతరం మధ్యాహ్నం 2గంటలకు పదహారుచింతల్ తండావాసులు, మృతుల బంధువులు, గిరిజన సంఘాలు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని నిందితుడిని ఉరితీయాలని, అతడికి సహకరించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ పోలీస్‌స్టేషన్‌లోకి చొచ్చుకుపోవడానికి ప్రయత్నించారు. స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. టౌన్ సీఐ రమణమూర్తి, పోలీసు సిబ్బంది వారికి ఎంత నచ్చచెప్పినా ఆందోళన విరమించలేదు. ఈ సమయంలో తండాకు చెందిన ఓ యువకుడు తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంటానని హెచ్చరించడంతో అక్కడే ఉన్న పోలీసులు అతడిని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడినా మంత్రి సీతక్క రావాలని, కలెక్టర్ రావాలంటూ నినాదాలు చేశారు. ఆ తర్వాత అక్కడి నుంచి వరంగల్ క్రాస్‌రోడ్డులోని అమరవీరుల స్థూపం సెంటర్ వద్దకు చేరుకొని సాయంత్రం వరకు ఆందోళన చేపట్టారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో పోలీసులు ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. అయితే మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు పట్టణంలో రాస్తారోకో ఆందోళనలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఉత్కంఠ వాతావరణం నెలకొంది. అమరవీరుల స్థూపం వద్ద జరుగుతన్న ఆందోళన వద్దకు చేరుకున్న డీసీపీ రవీందర్.. వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారదతో సెల్‌ఫోన్ ద్వారా గిరిజన సంఘాల నాయకులతో మాట్లాడించారు. చట్ట ప్రకారం నిందితులను కఠినంగా శిక్షించడం జరుగుతుందని, బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


హనుమకొండలో బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

పోస్టుమార్టం గది వద్ద మిన్నంటిన రోదనలు

పోస్టుమార్టం గది వద్ద మృతుల కూతురు, కుమారుడు చేసిన రోదనలు మిన్నంటాయి. తీవ్రగాయాలతో హనుమకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారు.. తల్లిదండ్రులను చివరి చూపునకు వచ్చారు. విగతజీవులుగా పడి ఉన్న తల్లిదండ్రులను చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ సంఘటనను చూసిన అక్కడికి వచ్చిన వారి కంటతడిపెట్టారు.

రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : పెద్ది

సుగుణ, శ్రీనివాస్ మృతదేహాలను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, పెద్ది స్వప్న సందర్శించి, వారి కుమారుడు, కూతురిని పరామర్శించారు. అనంతరం రాస్తారోకోకు వద్దకు చేరుకున్న పెద్ది మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం మృతుల కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు మృతుల కూతురు, కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు. నర్సంపేట నియోజకవర్గంలో ఈ మధ్యకాలంలో జరుగుతున్న సంఘటనలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయని, పోలీసులు, అధికారులు అధికార పార్టీ నాయకుల చెప్పులు మోసే ప్రయత్నం చేస్తున్నారే తప్ప శాంతిభద్రతలను పరిరక్షించడం లేదన్నారు. ఇక తన సొంత మండలానికి చెందిన మృతుల కుటుంబాన్ని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరామర్శించకపోవడం దురదృష్టకరమన్నారు.

రూ.లక్ష సాయం అందించిన పెద్ది

బాలసముద్రం: చెన్నారావుపేట మండలం పదహారు చింతల్ తండాలో యువకుడి చేతిలో హతమైన బానోతు సుగుణ, శ్రీనివాస్ దంపతుల కూతురు దీపిక, కుమారుడు మదన్ గాయాలతో హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. వారిని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించి చికిత్స కోసం రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. నిందితుడికి వెంటనే కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఉదయం నుంచి గిరిజన సంఘాలు నిందితుడిని శిక్షించాలని నిరసనలు తెలిపినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించు కోవట్లేదని ఆయన విమర్శించారు. ఈ ఘటనకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆయన తెలిపారు. దీపిక, మదన్‌ను చికిత్స అనంతరం పెద్ది సుదర్శన్‌రెడ్డి తన వాహనంలో చెన్నారావుపేటలోని పదమూరు చింతల్ తండాకు తీసుకెళ్లారు.

పోలీసుల అదుపులో నాగరాజు

వరంగల్ క్రైం, జూలై 11: వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం చింతల్‌తండాకు చెందిన భార్యాభర్తలైన బానోతు శ్రీను, సుగుణల హత్య కేసులో నింధితుడు నాగరాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భార్య దీప్తి కాపురానికి రావడంలో లేదనే ఆగ్రహంతో ఆమెను చంపేందుకు వచ్చి అడ్డుపడిన శ్రీను, సుగుణ దంపతులను నాగరాజు హత్య చేశాడు. హత్య చేసిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. నిందితుడి అరెస్టు విషయాన్ని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ ధ్రువీకరించారు. దీప్తి తల్లిదండ్రులపై నిందితుడు కత్తితో దాడి చేసి హత్య చేసినట్లుగా విచారణలో వెల్లడైనట్లు డీసీపీ తెలిపారు.


నర్సంపేట పోలీస్‌స్టేషన్ ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని అడ్డుకుంటున్న దృశ్యం (సర్కిల్‌లోని వ్యక్తి)


ఆందోళనకారులతో మాట్లాడుతున్న డీసీపీ రవీందర్

యువకుడి ఉన్మాదం


పదహారు చింతల్‌తండాలో హత్య జరిగిన ప్రదేశంలో ఉన్న రక్తపు మడుగు

(5వ పేజీ తరువాయి)

దీపిక అమీనాబాద్ మోడల్ పాఠశాలలో చదువుతున్న సమయంలో నాగరాజు తన ఆటోలో ఎక్కించుకొని పాఠశాల వద్ద దింపేవాడు. ఇలా దీపిక, నాగరాజుల మధ్య పరిచయం ఏర్పడి, అది ప్రేమగా మారింది. అనంతరం డిగ్రీ కోసం హన్మకొండకు వెళ్లిన దీపిక అక్కడే హాస్టల్‌లో ఉంటోంది.

దీపికను పెళ్లి చేసుకున్న నాగరాజు..

హన్మకొండలోని హాస్టల్‌లో ఉంటున్న దీపికను గత నవంబరులో హైదరాబాద్‌లోని ఓ దేవాలంలో రహస్య వివాహం చేసుకున్న నాగరాజు హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్న తన తల్లిదండ్రుల వద్ద ఉంచాడు. వారం రోజుల తర్వాత దీపిక తల్లి సుగుణ.. హాస్టల్ ఉందనుకున్న తన కూతురు కనిపించడం లేదంటూ సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు చేసిన రెండు రోజుల తర్వాత తల్లిదండ్రు లను ఫోన్ చేసిన దీపిక.. తాను నాగరాజు అనే యువకుడిని వివాహం చేసుకున్నానని, ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నానని చెప్పింది. దీంతో దీపిక తల్లి సుగుణ హైదరాబాద్‌లోని తన కూతురు వద్దకు వెళ్లి, నచ్చ జెప్పి ఇంటికి తీసుకొచ్చింది. అప్పటి నుంచి దీపిక తల్లిదండ్రుల వద్దే ఉంటోంది.

భార్యను తన నుంచి విడదీశారని కక్ష కట్టి..

సుగుణ కూతురు దీపికను హైదరాబాద్ నుంచి ఇంటికి తీసుకువచ్చిన తర్వాత.. దీపిక, నాగరాజు ప్రేమ, పెళ్లి విషయంలో ఇటు దీపిక తల్లిదండ్రులు, నాగరాజు పరస్పరం చెన్నారావుపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. దీంతో ఇరు కుటుంబాలకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి, పెద్దల సమక్షంలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆ తర్వాత పెద్ద మనుషుల మధ్య పంచాయితీ నిర్వహించగా.. దీపిక, నాగరాజు ఎవరికి వారు విడిగా ఉండాలని తీర్మానించగా.. అందుకు ఇరు కుటుంబాల వారు అంగీకరించారు. ఆ తర్వాత హైదరాబాద్ వెళ్లిపోయిన నాగరాజు.. ప్రేమించి పెళ్లి చేసుకున్న దీపికను తన నుంచి దూరం చేశారని దీపిక కుటుంబంపై కక్ష పెంచుకున్నాడు. నెల రోజుల క్రితం హైదరాబాద్ నుంచి మళ్లీ గుండెంగ గ్రామానికి వచ్చి తిరిగి ఆటో నడుపుకుంటున్నాడు. ఈ క్రమంలో పదహారు చింతల్‌తండాలో ఉన్న దీపిక ఇంటి వద్ద ఇటీవల రెక్కీ నిర్వహించాడు. పథకం ప్రకారం గురువారం తెల్లవారుజామున 1.30గంటల సమయంలో నాగరాజు వేట కత్తితో ద్విచక్ర వాహనంపై దీపిక ఇంటికి చేరుకున్నాడు. ఆ సమయంలో ఇంటి వరండాలో దీపిక, ఆమె తల్లిదండ్రులు శ్రీనివాస్, సుగుణ గాఢ నిద్రలో ఉన్నారు. ఇదే అదునుగా భావించిన నాగరాజు తొలుత సుగుణపై, ఆ తర్వాత శ్రీనివాస్‌పై, దీపికపై వేట కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. వారి కేకలు విని ఇంట్లో నిద్రిస్తున్న కుమారుడు మదన్‌లాల్ బయటకు వచ్చాడు. దాంతో అతనిపై కూడా నాగరాజు కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన సుగుణ అక్కడికక్కడే మృతి చెందింది. దీపిక, మదన్‌లాల్ కేకలు వస్తూ తప్పించుకునే ప్రయత్నం చేశారు. దాంతో చట్టుపక్కల వారు ఇళ్ల నుంచి బయటకు వచ్చి నాగరాజును అడ్డుకునే ప్రయత్నం చేయగా వారి వైపు కత్తి చూపుతూ అడ్డొస్తే అందరినీ చంపుతా అంటూ బెదిరిస్తూ.. అక్కడి నుంచి పరారయ్యాడు. ఆతర్వాత తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను నర్సంపేట ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అతడూ మృతిచెందాడు. దీపిక, మదన్‌లాల్‌ను హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. తండావాసుల సమాచారంతో ఎస్‌ఐ గూడ అరుణ్ కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు?

జంట హత్యలకు కారకుడైన మేకల నాగరాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. హత్యలు చేసి పరారైన నాగరాజు గుండెంగలోని ఓ పాఠశాలకు చేరుకుని కత్తితో చేయి కోసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అక్కడికి వెళ్లి నాగరాజును అదుపులోనికి తీసుకున్నట్టు సమాచారం. నాగరాజుకు సహకరించాడనే అనుమానంతో అతడి స్నేహితుడిపై తండావాసులు దాడిచేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారని, వెంటనే ఆ యువకుడిని చెన్నారావుపేట పోలీసు స్టేషన్‌కు తరలించారని స్థానికులు పేర్కొంటున్నారు.

గ్రామాల్లో పోలీసు బందోబస్తు

జంట హత్యల అనంతరం పదహారు చింతల్‌తండాతో పాటు గుండెంగలో వరంగల్ సీపీ ఆదేశాల మేరకు నర్సంపేట, మహబూబాబాద్‌కు చెందిన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా చర్యలు చేపట్టారు. ఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. డీసీపీ రవిందర్, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, గూడూరు సీఐ బాబురావు, నెక్కొండ సర్కిల్ సీఐ చంద్రమోహన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్థుల ద్వారా హత్య జరిగిన తెలుకున్నారు. సీఐ రమణమూర్తి, ఖానాపురం ఎస్సై రఘుపతి, నర్సంపేట ఎస్సై ప్రవీణ్, గూడూరు ఎస్సై నగేష్, చెన్నారావుపేట ఎస్సై గూడ అరుణ్‌కుమార్ బందోబస్తును పర్యవేక్షించారు. ఇక దీపిక తల్లిదండ్రుల అంత్యక్రియలు గురువారం రాత్రి ముగిశాయి.

న్యాయం చేయాలని పోలీసులతో వాగ్వాదం

పదహారు చింతల్ తండాలో జంట హత్యకు పాల్పడ్డ నాగరాజును శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ తండావాసులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. నిందితుడిని ఉరితీయాలంటూ నినాదాలు చేశారు. నాగరాజును తమకు తక్షణమే అప్పజెప్పాలని పట్టుబట్టారు. ఉదయం 10గంటల వరకు గ్రామస్థులు ఆందోళన కొనసాగించడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొనగా బాధిత కుటుంబానికి న్యాయం చేసేలా కృషి చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.


తండాలో సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సర్వర్ డౌన్‌తో నిలిచిన రిజిస్ట్రేషన్లు

రాంనగర్, జూలై 11: రిజిస్ట్రేషన్ శాఖ సర్వర్ డౌన్ కావడంతో గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు నిలిచిపోయాయి. ఉదయం 11గంటల సమయంలో రాష్ట వ్యాప్తంగా ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయి. దీంతో ఆస్తుల రిజిస్ట్రేషన్‌లు జరుగలేదు. హనుమకొండ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కేవలం నాలుగు రిజిస్ట్రేషన్‌లు మాత్రమే జరిగాయి. ప్రతీ రోజు జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వంద వరకు రిజిస్ట్రేషన్‌లు జరుగుతాయి. ఆన్‌లైన్ ఇబ్బందులు తలెత్తడంతో రాష్ట్రవ్యాప్తంగా కోట్ల రూపాయల లావాదేవీలు నిలిచిపోగా, రిజిస్ట్రేషన్ శాఖకు ఈరోజు పెద్దఎత్తున ఆదాయానికి గండిపడింది. దూరప్రాంతాల నుంచి వచ్చిన క్రయవిక్రయదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆన్‌లైన్ సేవలు ప్రారంభం కాకపోవడంతో తప్పని పరిస్థితిలో వెనుతిరిగారు.

27మంది ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, జూలై 11: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీగా ఎస్సైల బదిలీలు జరిగాయి. వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 27మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
పి.శ్రీనివాస్	వీఆర్	ఐనవోలు పోలీస్ స్టేషన్
టి.ప్రశాంత్‌బాబు	ఐటీ సెల్	నల్లబెల్లి
బి.రామారావు	నల్లబెల్లి	సుబేదారి
ఎస్.వెంకటేశ్వర్లు	వంగర	దుగ్గొండి
జె.పరమేశ్వర్	దుగ్గొండి	వీఆర్
ఎన్.నగేష్	వీఆర్	నర్మెట్ట
కె.శ్రీకాంత్	నర్మెట్ట	సుబేదారి
కె.కుమార్	మట్టెవాడ	గీసుగొండ
ఎ.శ్రీకాంత్	మిల్స్‌కాలనీ	పరకాల
బి.ప్రవీణ్	నర్సంపేట	ఆత్మకూరు
బి.రాంచరణ్	వీఆర్	కేయూసీ
ఎ.సురేష్	కేయూసీ	వీఆర్
ఎస్.రాజన్‌బాబు	మహిళా పీఎస్	వరంగల్ ట్రాఫిక్
డి.సాంబయ్య	సుబేదారి	సీసీఎస్ వరంగల్
ఎం.సురేష్	హసన్‌పర్తి	మిల్స్‌కాలనీ
ఎం.రాజు	హసన్‌పర్తి	సీసీఎస్ వరంగల్
టి.కృష్ణమూర్తి	పీసీఆర్ వరంగల్	సీఎస్‌బీ వరంగల్
ఎస్‌కె.హమీద్	వీఆర్	నర్సంపేట
డి.దేవేందర్	కేయూసీ	హసన్‌పర్తి
బి.రాజేష్‌కుమార్	వీఆర్	జనగామ
ఎం.సిద్ధయ్య	వీఆర్	హసన్‌పర్తి
డి.నినిషారెడ్డి	వీఆర్	సీసీఎస్ వరంగల్
బండారి రాజు	ధర్మసాగర్	సీఎస్‌బీ వరంగల్
టి.యాదగిరి	సీసీఎస్	వరంగల్ వరంగల్ ట్రాఫిక్
ఎం.డి.నజీర్	కమిషనరేట్	సీఎస్‌బీ వరంగల్
కె.సారంగపాణి	కమిషనరేట్	సీఎస్‌బీ వరంగల్
జి.రమేశ్	కమిషనరేట్	సీఎస్‌బీ వరంగల్

ఫీడర్లపై భారం లేకుండా ఏర్పాట్లు చేయాలి

టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హనుమకొండ టౌన్, జూలై 11 : ఓవర్ లోడ్ భారం పడే ఫీడర్లను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి సూచించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి ఐదు జిల్లాల సర్కిళ్ల నోడల్ ఆఫీసర్లతో సీఎండీ గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని కార్పొరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్ లేకుండా ఎప్పటికప్పుడు చెక్ చేసుకుంటూ ఆయిల్ లీకేజీ కాకుండా చూసుకోవాలన్నారు. పీక్ లోడ్ సమయంలో కుడా చెక్ చేయాలన్నారు. ప్రతీ పోల్‌కు నంబరింగ్ చేయాలని, ఆ నెంబర్స్ ద్వారా సమస్యలను సులభంగా గుర్తించి సమస్యలను త్వరిగతిన పరిష్కరించవచ్చన్నారు. పవర్ ఫ్యాక్టర్‌లో మెరుగదల ఉండాలన్నారు. బ్రేక్‌డౌన్, ట్రిప్పింగ్స్ కాకుండా సబ్‌స్టేషన్ల నిర్వహణ చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, సీజీఎంలు కె.తిరుమల్‌రావు, కిషన్, రవీంద్రనాథ్, రాజు చౌహాన్, కె.ఎన్.గుట్ట, ఎస్ఈ సివిల్ అంకూస్, కంపెనీ సెక్రెటరీ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న వరుణ్‌రెడ్డి

డీఎస్సీని మూడు నెలలు వాయిదా వేయాలి

విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కేయూ లైబ్రరీ ఎదుట ఆందోళన

కేయూ క్యాంపస్, జూలై 11: రాష్ట్రంలో డీఎస్సీ పరీక్షలను మూడు నెలల పాటు వాయివా వేయాలని పీడీఎస్‌యూ రాష్ట ఉపాధ్యక్షుడు బి.నరసింహరావు డిమాండ్ చేశారు. గురువారం కేయూ లైబ్రరీ ఎదుట పీడీఎస్‌యూ, ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ నేతృత్వంలో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని నిరసన ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా నరసింహరావు, మంద నరేశ్‌లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు మానసిక సన్నద్ధత, ప్రిపరేషన్, సిలబస్‌లను దృష్టిలో పెట్టుకుని పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ వాయిదా కోసం ఉద్యమిస్తున్న ఓయూ విద్యార్థులపై దాడులను ఖండించారు. పోలీసుల భౌతికదాడులను విరమించుకోవాలని అన్నారు. పరీక్షలు వాయిదా వేయకపోతే విద్యార్థి సంఘాల నేతృత్వంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అభిరామ్ రమేశ్, డీఎస్సీ అభ్యర్థులు శ్రీకాంత్‌రెడ్డి, పృథ్వీ, క్రాంతికిరణ్, శారద, మల్లేశ్, నాగరాజు, రవీందర్, లక్ష్మణ్, అనిల్, ఏబీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దార సురేశ్; కేయూఅధ్యక్షుడు దూడపాక నరేందర్, కార్యదర్శి బండారి పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో చదివేందుకు దరఖాస్తుల ఆహ్వానం

వడ్డెపల్లి, జూలై 11: విదేశాల్లో పోస్టు గ్రాడ్యుయేట్స్ చదివేందుకు మైనారిటీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మేన శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం ఓవర్సీస్ పథకం ద్వారా అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, న్యూజిలాండ్, సింగపూర్ దేశాలలో చదువుకునేందుకు అర్హత గల అభ్యర్థులు ఆగస్టు 7వ తేదీ లోపు www.telangana epass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసిన అనంతరం దరఖాస్తు ప్రతులను హనుమకొండ కలెక్టరేట్‌లోని మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయంలో సమ ర్పించాలని పేర్కొన్నారు.

వివాహితతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

వేలేరు(ధర్మసాగర్), జూలై 11: వివాహితపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై హరిత గురువారం తెలిపారు. వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామానికి చెందిన వివాహిత తన ఇంటి వద్ద ఒంటరిగా ఉండగా, అదేగ్రామానికి చెందిన పింగిలి సంపత్‌రెడ్డి ఈనెల 9న మధ్యాహ్నం ఇంట్లోకు వెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె తప్పించుకొని ఇంట్లో నుంచి తన ఇంటి పక్కనే ఉన్న తన పెద్దమ్మ ఇంట్లోకి వెళ్లింది. అక్కడే ఉన్న స్థానికుడు అనువుల ఎల్లారెడ్డి అతడిని అక్కడి నుంచి వెళ్లగొట్టాడు. దీంతో సంపత్‌రెడ్డితో తన కుటుంబానికి ప్రాణహాని ఉందని గురువారం ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.


సీఎంను సన్మానిస్తున్న కుడా చైర్మన్ ఇనుగాల

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, జూలై 11: కుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి గురువారం హైదరాబాద్ సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిి ధన్యవాదాలు తెలిపారు. సీఎంను శాలువాతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛాలు అందించారు. ఇంకా ప్రభుత్వ ముఖ్యసలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిలతో పాటు మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డిలను కలిసి వెంకట్రామ్‌రెడ్డి పుష్పగుచ్ఛాలు అందించారు. వారు సైతం కుడా చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పోరాడి సాధించుకున్న భూములు కొనుగోలు చేయద్దు..

జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్

వరంగల్ క్రైం, జూలై 11: హసన్‌పర్తి మండలం సూధన్‌పల్లి గ్రామ ప్రజలు భూస్వామి పెసల రాంచంద్రారెడ్డితో పోరాడి సాధించి సాగుచేసుకుంటున్న భూములను ఎవరు కొనుగోలు చేయవద్దని, ఒకవేళ కొనుగోలు చేస్తే వదిలిపెట్టాలని భారత కమ్యూనిస్టు (మావోయిస్టు) జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. నిర్బంధాలు లెక్కచేయకుండా పోరాడి రాంచంద్రారెడ్డికి చెందిన 20 ఎకరాల భూమిని ఆక్రమించి 35 యేళ్ల నుంచి 42 మంది దళితులు సాగుచేసుకుంటున్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం కాస్తులో, కబ్జాలో వీరే ఉన్నారని, రెవెన్యూ రికార్డుల్లోనూ వీరే ఉన్నారని ఆయన వివరించారు. ఆ భూముల ధరలు పెరగడంతో గ్రామానికి చెందిన తిక్క దేవేందర్ మావోయిస్టు పార్టీ పేరు చెప్పి రాంచంద్రారెడ్డి వారసులతో ఒప్పందం చేసుకుని దళితుల భూములను అమ్ముతున్నాడని అన్నారు. అమ్మడానికి ఒప్పుకోని వారిని బెదిరింపులకు గురిచేస్తూ కేసులు పెట్టిస్తున్నాడని ఆయన ఆరోపించారు. ఆ భూములు దక్కే వరకు పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. భూస్వాములకు వ్యతిరేకంగా ప్రజలు పోరాడి ఆక్రమించుకున్న భూములను ఎవరూ కొనుగోలు చేసినా ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని వెంకటేశ్ హెచ్చరించారు.

నేడు ఫార్మసీ విభాగంలో విస్తృత ఉపన్యాసం

కేయూ క్యాంపస్, జూలై 11: కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల సెమినార్‌హాల్‌లో శుక్రవారం ఉదయం 11గంటలకు క్లినికల్ ఫార్మసీ ప్రాక్టీసు- ఏ టూల్ ఫర్ బెటర్ పేషెంట్ కేర్ అనే అంశంపై విస్తృత ఉపన్యాసం ఏర్పాటు చేసినట్లు కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నీరటి. ప్రసాద్ గురువారం తెలిపారు. కేయూ ఫార్మసీ కళాశాల పూర్వవిద్యార్థి డాక్టర్ రమేశ్ అడెపు హాజరై కీలక ఉపన్యాసం చేస్తారని పేర్కొన్నారు. పరిశోధకులు, విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

రేపటి నుంచి కేయూ దూరవిద్య కాంట్రాక్టు తరగతులు

కేయూ క్యాంపస్, జూలై 11: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎం.ఎస్సీ బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ సబ్జెక్టుల మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ కాంట్రాక్టు తరగతులు జూలై 13నుంచి ప్రారంభమవుతాయని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం గురువారం తెలిపారు. కేయూ క్యాంపస్‌లోని జువాలజీ సెమినార్ హాల్‌లో తరగతులు జరుగుతాయని అడ్మిషన్లు పొందిన వారందరూ విధిగా హాజరుకావాలని కోరారు.

ముగిసిన జిల్లా స్థాయి క్రికెట్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 11: వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటుచేసిన టూ-డే క్రికెట్ లీగ్ ఎంపిక పోటీలు గురువారం ముగిశాయి. హెచ్‌సీఏ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జూలై రెండోవారం నుంచి నిర్వహించనున్న టూ-డే క్రికెట్ లీగ్ పోటీలలో పాల్గొనేందుకు గాను ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా నిర్వహించిన ఎంపిక పోటీలలో 200మంది క్రీడాకారులు పాల్గొన్నారని వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీలలో ఉత్తమ బౌలింగ్, మెరుగైన బ్యాటింగ్‌లో ప్రతిభ కనబర్చిన 15మంది సభ్యులతో పాటు, 13మంది సభ్యులను స్టాండ్‌బైగా టూ-డే క్రికెట్ లీగ్ పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు ఖాజా, బస్వరాజు ఉపేందర్, కోచ్ గోవింద్ సింగ్, ప్రణయ్‌కుమార్ పాల్గొన్నారు.

గురుపౌర్ణమి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ

వరంగల్ క్రైం, జూలై 11: వరంగల్ సాయి సేవాదల్ ఆధ్వర్యంలో నిర్వహించబడే గురుపౌర్ణమి వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం ఆవిష్కరించారు. ఈనెల 21 గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ ఎల్లంబజార్ సాయి సేవాదల్ మందిరంలో వేడుకలు నిర్వహిస్తారు. ఈ వేడుకలకు సంబంధించిన పోస్టర్ సీపీ ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో సాయి సేవాదళ్ ప్రతినిధులు ఆరుట్ల శ్రీనివాస్, రమేశ్, రవీంద్రాచారి, శ్రీనివాస్, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

నవాజ్ జంగ్ ఆశయాలను కొనసాగించాలి

హనుమకొండ టౌన్, జూలై 11: ఇంజనీర్ నవాబ్ ఆలీ నవాజ్ జంగ్ బహదూర్ ఆశయాలను కొనసాగించాలని టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. నవాజ్ జంగ్ బహదూర్ 147 జయంతిని పురస్కరించుకొని గురువారం నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. నవాజ్ జంగ్ బహదూర్ ఆలోచన సరళిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతీ ఇంజనీర్ వినియోగదారులకు మెరుగైన సేవలందించాలన్నారు. ఆసియా ఖండంలోనే నిజాం సాగర్ డ్యామ్‌ను భిన్నమైన పద్ధతిలో నిర్మించిన ఘనత కేవలం నవాబ్ ఆలీకి దక్కిందన్నారు. హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చే హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ చెరువుల రూపకల్పన నవాబ్ ఆలీ ప్రతిభని కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, సీజీఎంలు కె.తిరుమల్‌రావు, కిషన్, రవీంద్రనాథ్, రాజు చౌహాన్, కె.ఎస్.గుట్ట పాల్గొన్నారు.

అర్చక, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

హనుమకొండ కల్చరల్, జూలై 11: ప్రభుత్వ ఉత్తర్వులు 577 ద్వారా రాష్ట్రంలోని 5,625 మంది అర్చకులకు, ఉద్యోగులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలు అందించాల్సి ఉండగా, కేవలం 3వేల మంది అర్చక, ఉద్యోగులకు మాత్రమే వేతనాలు అందుతున్నాయని, మిగిలిన వారందరికీ వేతనాలను అందించాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు అర్చక జాక్ నాయకులు విజ్ఞప్తి చేశారు. వరంగల్ నగర పర్యటనలో ఉన్న మంత్రి కొండా సురేఖను అర్చక ఉద్యోగ జాక్ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో వేతపండితులు షణ్ముఖశర్మ, లక్ష్మీప్రసాద్ శర్మ, ఎల్లంబట్ల రామకృష్ణశర్మ, హైదరాబాద్ మహంకాళి ఆలయ ఈవో మనోహర్‌రెడ్డి తదితర ప్రముఖులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన ఆయన తెలిపారు.

ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

హనుమకొండ, జూలై (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులను గురువారం హనుమకొండ జిల్లా ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో సన్మానించారు. హనుమకొండలోని ప్రభుత్వ అభ్యసనోన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ డి.చలపతిరావు, హనుమకొండ జిల్లా ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ కార్యవర్గం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్సిటీ ఉద్యోగులు పని సంస్కృతిని పెంపొందించుకోవాలి

కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్, జూలై 11: కాకతీయ యూనివర్సిటీలో ఉద్యోగుల సంఖ్య తగ్గుతోందని, అందరూ పని సంస్కృతిని పెంపొందించుకోవాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి స్పష్టం చేశారు. గురువారం కేయూ పరిపాలన భవనంలోని కమిటీ హాల్‌లో వర్సిటీ అడ్మినిస్ట్రేటివ్, సూపరింటెండెంట్ స్థాయి ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి మాట్లాడుతూ.. కచ్చితమైన పనివేళలు, సమయపాలన పాటించాలని అన్నారు. ఉద్యోగులకు ప్రాథమిక స్థాయిలో శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఉద్యోగుల హాజరు విషయంలో కఠినంగా ఉంటామని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య తగ్గిందన్నారు. ఆరోగ్యకరమైన పోటీని పెంపొందిస్తామన్నారు.

విద్యార్థులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన స్కాలర్‌షిప్‌లు రాకపోవడంతో కాలేజీలపై అదనపు భారం పడుతోందని చెప్పారు. నూతన కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వర్సిటీ నిర్వహణపై అవగాహన కల్పించాలని అన్నారు. ఉద్యోగులకు వృత్తి నైపుణ్యాలను పెంచేందుకు తరుచుగా సమావేశాలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ప్రొసీజర్స్, అకౌంట్స్, ఆడిట్, కంప్యూటర్, ఆంగ్ల భాషపై శిక్షణ కల్పిస్తామని చెప్పారు. నూతనంగా పదోన్నతి పొందిన సూపరింటెండెంట్‌లు కృష్ణమూర్తి, ప్రతాప్, సదాశివుడులను అభినందించారు. ఈ కార్యక్రమంలో టీచింగ్ ఏఆర్ ప్రణయ్‌కుమార్, ఆర్‌పీ, వీరన్న, సరళాదేవి, శ్రీలత, బొల్లెపాక ప్రభాకర్, రాము, సునిల్‌కుమార్, నేతాజీ, పంజాల శ్రీధర్, డాక్టర్ కోలా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడిని నిరసిస్తూ నిరసన



ప్రెస్‌క్లబ్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న టీయూడబ్ల్యూజే నేతలు

వడ్డెపల్లి, జూలై 11: ఉస్మానియా యూనివర్సిటీలో జర్నలిస్టులపై పోలీసులు చేసిన దాడిని ఖండిస్తూ టీయూడబ్ల్యూజే (హెచ్-143) హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (హెచ్-143) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మస్కపురి సుధాకర్, ప్రధాన కార్యదర్శి నాయకపు సుభాష్‌గౌడ్, వరంగల్ జిల్లా కన్వీనర్ కక్కెర్ల అనిల్ కుమార్‌గౌడ్, యూనియన్ రాష్ట్ర నేత తుమ్మ శ్రీధర్‌రెడ్డిలు మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీలో డీఎస్సీ వాయిదా వేయాలని నిరుద్యోగ యువకులు ఆందోళన చేస్తుంటే వార్తను కవర్ చేయడానికి వెళ్లిన జీన్యూస్ జర్నలిస్టు శ్రీచరణ్‌ను పోలీసులు అరెస్టు చేయడం దుర్మార్గమని దుయ్యబట్టారు. తాము జర్నలిస్టులమని చెబుతున్నా పోలీసులు దురుసుగా వ్యవహరిస్తూ వారిని బలవంతంగా లాక్కొని పోలీసు వాహనంలో ఎక్కించుకొని పోలీసుస్టేషన్‌లో నిర్బంధించడం మీడియా భావ ప్రకటన, స్వేచ్ఛను హరించడమేనని అన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, యూనియన్ల నేతలు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ పాటించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సాంబశివరావు



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు

వరంగల్ మెడికల్, జూలై 11: పెరుగుతున్న జనాభాను అరికట్టేందుకు, శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులైన వేసెక్టమీ, లేదా ట్యూబెక్టమీ ఆపరేషన్లు మాత్రమే కాకుండా కాన్పుల మధ్య అంతరం కోసం గర్భనిరోధక పద్ధతులను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు అభిప్రాయపడ్డారు. గురువారం వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన సమయం, కాన్పుల మధ్య దూరం తల్లి, బిడ్డలకు శ్రేయస్కరం అవుతుందన్నారు. నూతన దంపతులకు మొదటి కాన్పును వాయిదా వేసేందుకు, వైవాహిక జీవితాన్ని సుఖసంతోషాలతో గడిపేందుకు, ఒక బిడ్డ ఉన్న దంపతులు బిడ్డ ఎడం కోసం తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని సూచించారు.

ముందుగా ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి హనుమాన్ జంక్షన్‌లో మానవహారం పాటించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.డి.యాకూబ్‌పాషా, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి జీఎంహెచ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నిరంజని దేవి, పీపీడీటీటీ డాక్టర్ కె.లలితాదేవి, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఉమాశ్రీ, జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి డాక్టర్ ఇస్తాకర్ అహ్మద్, జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి చంద్రకళ, ప్రసన్న కుమార్, చంద్రశేఖర్, మాధవరెడ్డి, ఎస్.శ్రీనివాస్, సూపర్ వైజర్ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు

ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

హనుమకొండ కలెక్టరేట్, జూలై11: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు కలెక్టర్ ప్రావీణ్యకు విన్నవించారు. ఈ మేరకు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీఆర్ మోహన్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు నారాయణ రావు, నరసింహారెడ్డి, సరళ, వెంకట్ రెడ్డి, జగదీష్, నాగేశ్వర్ రావు, వీరభద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

సమస్యల సాధన కోసం ఉద్యమిద్దాం..

కాళోజీ జంక్షన్: రాష్ట్రంలోని ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల సాధన కోసం అత్యధిక పెన్షనర్ల సంఘాలను ఏకతాటిపై తీసుకొచ్చి తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ పెన్షన్‌దారుల జిల్లా అధ్యక్షుడు ఇ. నర్సింహారెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పెన్షనర్ల జేఏసీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఏ ప్రభుత్వం కూడా శ్రద్ధ చూపడం లేదని, పరిష్కారం కోసం ఏర్పాటైన జేఏసీ జనరల్ బాడీ సమావేశంలో విస్తృతంగా చర్చించి సమస్యల సాధనకు ఉద్యమ కార్యాచరణ రూపొందించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు గత నెల 26న పలు డిమాండ్లతో కూడిన నోటీసును ప్రభుత్వానికి అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ పెన్షనర్లందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో వివిధ పెన్షనర్ల సంఘాల నాయకులు తూపురాణి సీతారం, కె.సుధీర్‌బాబు, నాగపురి సారయ్య, జి. వీరస్వామి, పులి సారంగపాణి, సయ్యద్ ఖాజా మొహినొద్దీన్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గ్రీన్‌కారిడార్ రహదారి నిర్మాణానికి భూసేకరణ చేయాలి

● రైతులకు మార్కెట్ విలువ ప్రకారం డబ్బులు చెల్లించాలి ● జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, జూలై11: పరకాల రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎన్‌హెచ్-163 గ్రీన్ కారిడార్ రహదారి నిర్మాణం కోసం గుర్తించిన భూ సేకరణను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని, రైతులకు అందాల్సిన పరిహారాన్ని వెంటనే అందించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం ఎన్‌హెచ్-163 గ్రీన్ కారిడార్ కోసం గుర్తించిన భూ సేకరణపై రెవెన్యూ, సర్వే, ఇతర శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్‌హెచ్ నిర్మాణానికి సంబంధించిన వివిధ అంశాలపై అధికారులతో చర్చించారు. పరకాల పరిధిలోని ఆయా గ్రామాల్లో మార్కెట్ విలువ ఎంత ఉందనే వివరాలను ఆర్డీవో, తహసీల్దార్‌లను అడిగి తెలుసుకున్నారు. గ్రీన్‌కారిడార్ సంబంధిత రైతులతో స్థానిక తహసీల్దార్లు, ఆర్డీవో చర్చించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, పరకాల ఆర్డీవో కె.నారాయణ, ఎన్‌హెచ్ ప్రాజెక్టు డైరెక్టర్ మాధవి, తహసీల్దార్లు భాస్కర్, జగన్ మోహన్‌రెడ్డి, జ్యోతి వరలక్ష్మీ దేవి, సుహాసిని, ఎన్‌హెచ్ అధికారులు, సర్వే, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 11: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది నిర్లక్ష్యంవహించవద్దని డీఈవో డి.వాసంతి అన్నారు. హనుమకొండ డీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టిన డి.వాసంతిని కార్యాలయ సిబ్బంది గురువారం ఆమె చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాసంతి మాట్లాడుతూ... కార్యాలయానికి వచ్చే ఉపాధ్యాయులతో సిబ్బంది మర్యాదగా ప్రవర్తిస్తూ నిబంధనల ప్రకారం పనులను చేయాలన్నారు. కార్యాలయంలోని ఉద్యోగులందరూ సమయపాలన పాటించాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు రాకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యాలయంలో ఎలాంటి ఇతరత్రా పనులు చేయకుండా సిబ్బంది జాగ్రత్త వహించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఏసీజీఈ డి.చలపతిరావు, సెక్టోరల్ అధికారులు రాధ, సునిత, సూపరింటెండెట్లు శైలజ, శారద, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ ఎం.శంకర్‌రావు, సిబ్బంది పద్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే పీఆర్టీయూ నాయకులు ఎం.తిరుపతిరెడ్డి, పి.శ్రీహరి, ఈ.రవీందర్‌రెడ్డి, అబ్దుల్ గఫార్, టి.శ్రీనివాస్, ఇ.ఉపేందర్‌రెడ్డి, బి.సంధ్యారాణి, రాంధన్, తారాబాయి, శ్రీనివాసస్వామి, భానుప్రసాద్‌రెడ్డి, మాలకొండారెడ్డి, విజయ్‌కుమార్ తదతరులు శుభాకాంక్షలు తెలిపారు. యూటీఎఫ్ నాయకులు రవీందర్‌రాజు, రాజు, కిరణ్‌కుమార్, మల్లిక్, సుదర్శన్, శ్రీనివాస్ తదితరులు డీఈవో వాసంతికి శుభాకాంక్షలు తెలిపారు.

మూఢ నమ్మకాల నిర్మూలనే లక్ష్యం

వడ్డెపల్లి, జూలై 11: సమాజంలోని కుల, మత మూఢ నమ్మకాల నిర్మూలనే భారత నాస్తిక సమాజం(భానాస) లక్ష్యమని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్ అన్నారు. గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద భారత నాస్తిక సమాజం మహా సభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈనెల 24న హనుమకొండ వడ్డెపల్లి మెయిన్ రోడ్డులోని పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో డాక్టర్ జయగోపాల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న భారత నాస్తిక సమాజం మహా సభలలో కవులు, కళాకారులు, విద్యార్థులు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలకపక్షాలు అవలంబిస్తున్న మత మూఢ విశ్వాసాలను నిర్మూలించి మూఢనమ్మకాల నిర్మూలన చట్టం కోసం ప్రజల్లో నెలకొని ఉన్న అశాస్త్రీయ భావాలను రూపుమాపేందుకు భారత నాస్తిక సమాజం కృషి చేస్తుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కోఆర్డినేటర్ చార్వాక, భారత నాస్తిక సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజుల సాంబయ్య, ప్రజా సంఘాల నాయకులు పటేల్ వనజ, గుత్తికొండ చక్రాధర్, చాపర్తి కుమార్ గాడ్గే, తాడిశెట్టి క్రాంతి కుమార్, కూనూరు రంజిత్‌గౌడ్, జేజే స్వామి, సుందర్‌రాం, మాదాసు సురేష్, సింగారపు అరుణ, తాటికొండ సద్గున, తాడూరి మోహన్, సూరం నిరంజన్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీల దొంగ అరెస్టు

6 తులాల బంగారం స్వాధీనం



పోలీస్‌స్టేషన్‌లో దొంగను అరెస్టు చూపి వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

మడికొండ, జూలై 11: తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకొని వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం మడికొండ పోలీస్‌స్టేషన్‌లో కాజీపేట ఏసీపీ తిరుమల్ వివరాలు వెల్లడించారు. కాజీపేట బాపూజీనగర్ పాపుడాలపల్లి కాలనీకి చెందిన స్కావెంజర్ రెడ్లం రాకేశ్ జల్సాలకు అలవాటు పడ్డాడు. స్కావెంజర్ వృత్తి ద్వారా వచ్చిన డబ్బులు సరిపోకపోవడంతో ఈజీ మనీ కోసం దొంగతనాలకు అలవాటుపడ్డాడు. తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగతనాలు చేస్తున్నాడు. కొద్ది రోజుల కిందట మడికొండ వెస్ట్‌సిటీ రోడ్ నెంబర్ 5లో గల ఓ ఇంటి తాళం పగులగొట్టి, అందులోని ఆరు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. మరికొద్దిరోజులకు అదే కాలనీలోని మరో ఇంటి తాళం పగులగొట్టి దొంగతనం చేయడానికి ప్రయత్నించి సాధ్యం కాకపోవడంతో వెళ్లిపోయాడు.

బాధితుల ఫిర్యాదు మేరకు స్థానిక ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ కాలనీపై ప్రత్యేక నిఘా పెట్టి ఎస్సై రాజబాబు, హెడ్ కానిస్టేబుళ్లు రాంచందర్, రామనాథం, కానిస్టేబుల్ నాగేశ్వర్‌లతో కూడిన బృందాన్ని నియమించారు. క్లూస్ టీం సహకారంతో సాంకేతికత ఉపయోగించి గురువారం దొంగతనం చేయడానికి వచ్చి అదే కాలనీలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న రాకేశ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద ఆరు తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తిరుమల్ తెలిపారు. అలాగే దొంగను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన ఇన్‌స్పెక్టర్, ఎస్సై, పోలీసులను ఈసందర్భంగా ఏసీపీ అభినందించారు.

సాయిమహాన్ పుస్తకావిష్కరణ

హనుమకొండ చౌరస్తా, జూలై 11: సాయిబాబా 11వ ఏకదశి సూత్రాల ఆధారంగా 10వ డివిజన్ పద్మాక్షికాలనీకి చెందిన గట్ల రోజాస్వీ రచించిన సాయిమహాన్ (సాయిబాబా చరిత్ర) నూతన పుస్తకాన్ని 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. గురువారం హనుమకొండ పద్మాక్షికాలనీలోని సాయిబాబా మందిరంలో ఏర్పాటుచేసిన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి వెంటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. అంతకు ముందు ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లకు పూర్ణకుంభ స్వాగతం పలికి తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం వెంకటేశ్వర్లు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా ఆలయ అర్చకుడు నల్లెల సుదర్శన్, పుస్తక రచయిత గట్ల రోజాస్వీ, సీహెచ్, కృష్ణమూర్తి, శోభ నబోయిన కుమార్‌యాదవ్, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

కురియన్ కమిటీకి ఎంపీ కావ్య నివేదిక

హనుమకొండ సిటీ, జూలై 11: వరంగల్ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో పార్టీ బలాబలాలు, ఇతర పరిస్థితులను ఎంపీ డాక్టరు కడియం కావ్య కురియన్ కమిటీకి వివరించారు. గురువారం హైదరాబాద్ గాంధీభవన్‌లో జరిగిన కురియన్ కమిటీ భేటీలో లోక్‌సభ ఎన్నికల్లో అసెంబ్లీ వారిగా పోలైన ఓట్లు, తక్కువగా వచ్చిన నియోజకవర్గాలు, గెలుపునకు బలమైన కారణాలు, అదే విధంగా లోపాలు, ఇతరత్రా వివరాలను కురియన్ కమిటీ ప్రస్తావించగా కావ్య వివరణ ఇచ్చారు. బీఆర్ఎస్, బీజేపీల మధ్య లోపాయికారి ఒప్పందం జరిగిందని తెలిపారు. తన గెలుపు కోసం కార్యకర్తల నుంచి ముఖ్యనేతల వరకు భేషజాలు లేకుండా సమష్టిగా కృషిచేసినట్లు కమిటీకి చెప్పారు. ఇవే వివరాలను భేటి నుంచి బయటకు వచ్చిన అనంతరం కావ్య మీడియాకు తెలియచేశారు.

ప్రకాశ్‌రెడ్డికి శుభాకాంక్షలు

స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఐత ప్రకాశ్‌రెడ్డికి ఎంపీ కడియం కావ్య శుభాకాంక్షలు తెలియచేశారు. గురువారం హైదరాబాద్‌లో ప్రకాశ్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ, కేఆర్ నాగరాజు, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్వరాజు సారయ్యకు సన్మానం

కాజీపేట టౌన్, జూలై 11: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను కాజీపేట దర్గా పీఠాధిపతి ఖుస్రు పాషా సన్మానించారు. కాజీపేట దర్గాకు గురువారం సారయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. సారయ్య వెంట వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అబూబకర్, పలువురు నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యే 'పల్లా' జన్మదిన వేడుకలు

ధర్మసాగర్, జూలై 11: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ధర్మసాగర్, వేలేరు మండలంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం నిర్వహించారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో గుండ్రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి యువసేన ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించి పండ్లను పంపిణీ చేసి అన్నదానం చేశారు. వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామంలో మాజీ జడ్పీటీసీ చాడ సరిత విజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించి కేక్ కట్‌చేసి స్వీట్లను పంపిణీ చేశారు. అనంతరం వేలేరు మండలంలోని మహిళా సంఘాలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధి కమిటీ ఎన్నిక

న్యూశాయంపేట, జూలై 11: హనుమకొండ హంటర్‌రోడ్‌లోని విశాల్ మార్ట్ వెనకాల ఉన్న అభయాంజనేయస్వామి కాలనీ అభివృద్ధి కమిటీని కాలనీ వాసులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా మార్త రాజేందర్, ఉపాధ్యక్షుడిగా తిరువరంగం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా కె.సాంబశివారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా టి.మహేందర్‌రావు, కోశాధికారిగా ఎం.రాంప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా సీహెచ్ సంజీవ, పి.కిషన్‌రావు, పి.లక్ష్మీప్రసాద్, ఎస్.రవీందర్‌రావు, నిశాంత్ పి.ప్రదీప్ ఎరావు, వి.ఆశీష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మద్యం మత్తులో హెడ్ కానిస్టేబుల్ వీరంగం

త్రిబుల్ రైడింగ్ పేరుతో దళిత విద్యార్థిని చితకబాదిన వైనం

బాలసముద్రం, జూలై 11: మద్యం మత్తులో ఉన్న ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ బైక్‌పై వస్తున్న విద్యార్థులను చితకబాదుతూ వీరంగం సృష్టించాడు. గురువారం సాయంత్రం సుబేదారి పోలీస్‌స్టేషన్ ఎదుట ఈ ఘటన జరిగింది. బాధిత విద్యార్థులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన శివ అనే విద్యార్థి.. తన స్నేహితులు పునీత్, మధులతో కలిసి బైక్‌పై సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు వస్తున్నారు. శివ బైక్ నడుపుతూ వస్తుండగా సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ బాపిరెడ్డి వీరిని గమనించి బైక్‌పై ముగ్గురు (త్రిబుల్ రైడింగ్) వస్తారా? అని విద్యార్థులను నానాబూతులు తిడుతూ వారిపై పిడుగుద్దులు కురిపించాడు.

పక్కనే ఉన్న కానిస్టేబుల్ వచ్చి విద్యార్థుల బైక్‌ను పోలీస్‌స్టేషన్‌లో పెట్టించి విద్యార్థులను అక్కడి నుంచి పంపించాడు. అయితే తమపై హెడ్ కానిస్టేబుల్ మద్యం మత్తులో దాడి చేయడం సరైంది కాదని, త్రిబుల్ రైడింగ్ చేస్తే జరిమానా వేయాలి కానీ దాడి చేయడమేమిటని విద్యార్థులు ప్రశ్నించారు. ఇదేమిటని అక్కడున్న వారు ప్రశ్నించగా వారిని సైతం తిట్టాడని తెలిపారు. కాగా, విద్యార్థులను చితకబాదిన హెడ్‌కానిస్టేబుల్ బాపిరెడ్డిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

9
ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 12 జూలై 2024

గత యుగాల నుంచి భూమిమీద ఇప్పటికీ మిగిలి ఉన్న 'చిరంజీవులు'గా పురాణాలు వర్ణించిన వారిలో అశ్వత్థామ ఒకరు. వారిలో శాపగ్రస్తుడు మాత్రం అతనొక్కడే.





అశ్వత్థామ అసలు కథ

మహా భారతం గురించి ప్రస్తావించేటప్పుడు పెద్దగా చర్చకురాని, మరుగున పడిన పాత్రల్లో ఒకరు... అశ్వత్థామ. ఇటీవల 'కల్కి' సినిమాతో ఆ పాత్ర సర్వత్రా చర్చనీయాంశమయింది. అశ్వత్థామ ఎంతటి యోధుడో, అతని స్వభావం ఎలాంటిదో మహాభారతంలో... వివిధ సందర్భాల్లో వ్యాసుడు వివరించాడు. అతని తండ్రి ద్రోణుడు, రాజైన ద్రుపదుడు సహాధ్యాయులు. అశ్వత్థామ పుట్టిన తరువాత... కుటుంబ పోషణ కోసం ద్రుపదుడి దగ్గరకు వెళ్ళిన ద్రోణుడికి అవమానం జరిగింది. దానికి ప్రతీకారం తీర్చుకోవాలనే ఆలోచనతో కురు రాజులను ద్రోణుడు ఆశ్రయించి... పాండవులకు, కౌరవులకు శస్త్రాస్త్ర విద్యల్లో శిక్షణ ఇచ్చాడు. అశ్వత్థామ కూడా తండ్రి దగ్గర విద్యలు నేర్చి మహా వీరుడయ్యాడు. భారతకాలంలోని మహారథుల్లో అతనొకడు. మహారథి అంటే 60వేల మందితో పోరాడగలిగే శక్తి కలిగినవాడు. అయితే పాండవులన్నా, శ్రీకృష్ణుడన్నా అతనికి ఈర్ష్య. తను మహావీరుడిననీ, శివుడినుంచి వరం పొందినవాడిననీ, దివ్యాస్త్ర సంపన్నుడిననీ అహంకారం. పాండవులను సమూలంగా రూపుమాపాలని ప్రయత్నించిన అతను శాపగ్రస్తుడిగా మిగిలిపోవడానికి దారితీసిన ఘట్టాలు... మహాభారతంలోని 'సౌప్తిక పర్వం'లో కనిపిస్తాయి.

మహా భారత యుద్ధంలో తను మరణించినట్టు మభ్యపెట్టి... తన తండ్రిని పాండవులు వధించడంతో అశ్వత్థామ ఆగ్రహోదగ్రుడయ్యాడు. నిద్రిస్తున్న ద్రౌపది కుమారులైన అయిదుగురు ఉపపాండవులను, ద్రోణుణ్ణి చంపిన దుష్టద్యుమ్నుణ్ణి సంహరించాడు. ఇది విన్న ద్రౌపది... భీముణ్ణి పంపించి అశ్వత్థామను చంపించకపోతే ప్రాయోప్రవేశం చేస్తానని ప్రతిజ్ఞ చేసింది. "అశ్వత్థామ అడవులు పట్టిపోయి ఉంటాడు. అతణ్ణి చంపినట్టు నిదర్శనం ఏమిటి?" అని అడిగాడు ధర్మరాజు. "అతని శిరస్సుపైన సహజమైన రత్నం ఉంది. దాన్ని తెస్తేనే నేను బతుకుతాను" అంది ద్రౌపది.

అశ్వత్థామ సంహారానికి భీముడు, అతని రథ సారథిగా నకులుడు బయలుదేరారు. కురుక్షేత్రం దగ్గర ఆగి... "అశ్వత్థామ ఎక్కడున్నాడో తెలుసా?" అని అక్కడివారిని అడిగారు. "అశ్వత్థామ వ్యాసుడి ఆశ్రమానికి వెళ్ళాడు" అని వారు చెప్పారు.

ఈలోగా ధర్మరాజును కలవడానికి వచ్చిన శ్రీకృష్ణుడికి విషయం తెలిసింది.

అప్పుడు కృష్ణుడు "ధర్మరాజా! భీముడు ఒక్కడే వెళ్ళాడా? అది ప్రమాదం. మనం కూడా వెళ్ళడం మంచిది. ఎందుకంటే... అశ్వత్థామ దగ్గర బ్రహ్మశిరోనామకాస్త్రం ఉంది. పుత్రవాత్సల్యంతో దాన్ని ద్రోణుడు అతనికి ఇచ్చాడు. అయితే అశ్వత్థామది కోపిష్ఠి స్వభావం అని ఆయనకు తెలుసు. కాబట్టి... ఎప్పుడైనా పాండవులమీద దాన్ని ప్రయోగిస్తాడని అనుమానపడ్డాడు. అందుకే అర్జునుడికి కూడా ఆ అస్త్రాన్ని ఇచ్చాడు. అందుకే అర్జునుడంటే అశ్వత్థామకు ఈర్ష్య. ఆ అస్త్రాన్ని మనుషుల మీద ప్రయోగిస్తే ఎన్నో విపత్తులు కలుగుతాయి. కాబట్టి "ఎన్ని ఆపదలు ఎదురైనా... వేరే విధంగా తప్పించుకోవాలి తప్ప దీన్ని మాత్రం ప్రయోగించకు"

అని అశ్వత్థామకు ద్రోణుడు చెప్పాడు. కానీ ఆ మాటలు అతని చెవికెక్కలేదు. అంతేకాదు.. శివుడి వరం వల్ల తనకు మరణం లేదనీ, తన దగ్గర బ్రహ్మశిరోనామకాస్త్రం ఉందనీ, దాంతో ముల్లోకాలనూ కాల్చి బూడిద చెయ్యగలననీ అతనికి అహంకారం. మీరు అరణ్యవాసంలో ఉన్నప్పుడు... ఒకసారి నా దగ్గరకు అశ్వత్థామ వచ్చాడు. "ఈ అస్త్రాన్ని నా తండ్రి తపస్సుకు మెచ్చి అగస్త్య మహాముని ఇచ్చాడు. దీన్ని తీసుకొని... నాకు నీ సుదర్శన చక్రం ఇవ్వు" అని అడిగాడు. అతని మనసులోని ఉద్దేశం నాకు అర్థమయింది. నా చక్రం, కత్తి, గద చూపించి... "నువ్వు నీకు ఏది కావాలంటే అది తీసుకో. బదులుగా నువ్వు నాకు ఆ అస్త్రాన్ని ఇవ్వక్కర్లేదు. ఎందుకంటే స్నేహితుడికి ఏదైనా ఇచ్చినప్పుడు బదులుగా మరొకటి తీసుకోకూడదు" అన్నాను. అశ్వత్థామ సంతోషంతో సుదర్శన చక్రాన్ని ఎడమ చేతితో ఎత్తబోయాడు, కుదరలేదు కుడిచేత్తోనూ కదిలించలేకపోయాడు. తన బలమంతా ఉపయోగించి రెండు చేతులతో ప్రయత్నించాడు. కానీ ఎత్తలేక... అలిసిపోయాడు. 'నేను పన్నెండేళ్ళు హిమాలయాల్లో తీవ్రమైన తపస్సు చేసి దీన్ని సంపాదించాను. దీన్ని ఎవ్వరూ... ఆఖరికి అర్జునుడు కూడా కావాలని అడగలేదు. నువ్వు అడిగావు. ఇంతకీ దీంతో ఎవరిమీద యుద్ధం చేస్తావు?" అని అశ్వత్థామను అడిగాను. "నువ్వు చక్రం ఇస్తే... నిన్ను బతిమాలైనా నీతోనే యుద్ధం చేద్దామనుకున్నాను. అయితే ఈ చక్రం ధరించడానికి నువ్వే తగినవాడివి. ఇది లేకపోయినా నాకు నష్టమేం లేదు. నీతో యుద్ధం చెయ్యడానికి నా దగ్గర ఉన్న మహా అస్త్రాలు చాలు" అన్నాడు. అతనిలో అంత మహా అహంకారానికి కారణం... బ్రహ్మశిరోనామకాస్త్రం. అతను అధర్మ ప్రవర్తకుడు. క్రూరకర్మలు చేసేవాడు. భీముడికి ఏమైనా కావచ్చు" అంటూ ధర్మరాజు, అర్జునులతో కలిసి బయలుదేరాడు శ్రీకృష్ణుడు.

వ్యాసుడి ఆశ్రమానికి ఉద్రేకంగా వెళ్తున్న భీముణ్ణి వాళ్లు చూశారు. వాళ్ళు ఆగమన్నా భీముడు ఆగలేదు. ఆశ్రమంలో ఒక చోట... అశ్వత్థామ తపస్సులో ఉన్నాడు. పెద్దగా అరుస్తూ తనవైపు వస్తున్న భీముణ్ణి, అతని వెనకు అర్జునుణ్ణి, ధర్మరాజును చూశాడు అశ్వత్థామ. అంతకుముందు రాత్రి తాను చేసిన ఘోరాలు గుర్తుకువచ్చాయి. అతనిలో అధైర్యం మొదలైంది. వెంటనే రెల్లు పరక తీసుకున్నాడు. బ్రహ్మశిరోనామకాస్త్రాన్ని దానిలో ఆవహింపజేశాడు. 'అపాండవం కావాలి' అనుకుంటూ ప్రయోగించాడు. ఆ బాణంలోంచి పుట్టిన మహాగ్ని... అన్ని దిక్కులకూ మహోగ్రంగా విజృంభించింది.

ఇది చూసిన కృష్ణుడు "అర్జునా! అది మరో అస్త్రంతో ఆగదు. నువ్వు కూడా ఆ అస్త్రాన్నే ప్రయోగించు. నిన్నూ, నీ సోదరులనూ రక్షించుకో" అన్నాడు.

అర్జునుడు తన గురువైన ద్రోణుణ్ణి స్మరించి... అస్త్రాన్ని అస్త్రం హతమార్చాలి అనుకుంటూ ప్రయోగించాడు. అది వెళ్ళి అశ్వత్థామ ప్రయోగించిన అస్త్రాన్ని ఢీకొన్నాయి. దీంతో మూడు లోకాల్లో అల్లకల్లోలం చెలరేగింది. జరగబోయే మహోత్పాతాన్ని గుర్తించిన నారదుడు... వ్యాసాశ్రమంలో ప్రత్యక్షమయ్యాడు. వ్యాసుడితో కలిసి అర్జునుణ్ణీ, అశ్వత్థామను శాంతింపజేయడానికి ప్రయత్నించాడు. "ఈ భూమి మీద ఎందరో వీరులు పుట్టారు, మరణించారు. మనుషుల

> భారతకాలంలోని మహారథుల్లో అశ్వత్థామ. ఒకరు. మహారథి అంటే 60వేల మందితో పోరాడగలిగే శక్తి కలిగినవాడు. అయితే పాండవులన్నా, శ్రీకృష్ణుడన్నా అతనికి ఈర్ష్య. తను మహావీరుడిననీ, శివుడినుంచి వరం పొందినవాడిననీ, దివ్యాస్త్ర సంపన్నుడిననీ అహంకారం. పాండవులను సమూలంగా రూపుమాపాలని ప్రయత్నించిన అతను శాపగ్రస్తుడిగా మిగిలిపోవడానికి దారితీసిన ఘట్టాలు... మహాభారతంలోని 'సౌప్తిక పర్వం'లో కనిపిస్తాయి.

మీద ఎవరైనా బ్రహ్మ శిరోనామకాస్త్రాన్ని ప్రయోగించారా?" అని మునులిద్దరూ ప్రశ్నించారు.

అప్పుడు అర్జునుడు "అస్త్రంతో అస్త్రాన్ని శాంతింపజేయడం కోసం... మరో మార్గం లేక దీన్ని ప్రయోగించాను. మీరు కోరితే ఉపసంహరిస్తాను. కానీ అతను మమ్మల్ని దహించేస్తాడు. మా క్షేమం మీరే చూడాలి" అంటూ అస్త్రాన్ని ఉపసంహరించాడు. నిజానికి ఆ అస్త్రాన్ని ప్రయోగించాక.... ఉపసంహరించడం దేవతల వల్ల కూడా కాదు. అలా ఉపసంహరించినవాళ్ళను అది చంపుతుంది. కానీ గురుభక్తి, తపశ్శక్తి కలిగినవాడు, దానగుణం, సత్యశీలత ఉన్నవాడు కాబట్టి అర్జునుడు ఆ పని చేయగలిగాడు. అది చూసిన మునులు ఆశ్చర్యపోయారు.

> అశ్వత్థామ కూడా ఉపసంహరించబోయాడు. కానీ సాధ్యం కాలేదు. అప్పుడు వ్యాసుడితో... "భీముడు అధర్మ యుద్ధంలో దుర్యోధనుణ్ణి చంపాడు. ఇప్పుడు నన్ను చంపడానికి వచ్చాడు. ఆ ఆగ్రహంతో... ప్రాణభయంతో నాకు మతిపోయి ఈ అస్త్రాన్ని ప్రయోగించాను. అది పాండవ సంతతి నంతటినీ తుడిచిపెట్టేస్తుంది. అది పాపమైనా సరే నేను భరిస్తాను" అన్నాడు అశ్వత్థామ.

"శిష్యుడనే వాత్సల్యంతో అర్జునుడికి నీ తండ్రి ఆ అస్త్రాన్ని ఇచ్చాడు. దాన్ని నీకు హాని కలిగించడం కోసం కాకుండా... నీ అస్త్రం ఉపశమించేలా చెయ్యడానికే అర్జునుడు ప్రయోగించాడు. మేము వద్దని చెప్పగానే ఉపసంహరించాడు. ఈ మహాస్త్రాన్ని మనుషుల మీదకు ప్రయోగించినవారికి కీడు తప్పదు. ఇప్పుడు నీ అస్త్రం అతని అస్త్రంతో అణగారిపోతుంది. అది జరిగిన దేశంలో పన్నెండేళ్ళు వానలు పడవు. కాబట్టి దాన్ని అలాగైనా ఉపసంహరించు. నీ శిరోరత్నాన్ని అర్జునుడికి ఇవ్వు. ఇదే సంధి మార్గం" అని హితవు చెప్పాడు వ్యాసుడు.

"కౌరవుల సంపద అంతటినీ లాక్కున్న పాండవులకు రత్నాలకు కరువా? ఈ రత్నం ఉంటే దేవ రాక్షసులు, జంతువులు, చోరుల భయం ఉండదు. ఆకలి, దాహం, నిద్ర, అనారోగ్యాలు బాధించవు. అలాంటి రత్నం వీళ్ళకు ఎందుకు ఇవ్వాలి? కానీ నువ్వు ఆజ్ఞాపించావు కాబట్టి ఇచ్చేస్తాను. కానీ నా అస్త్రం మాత్రం పాండవ స్త్రీల గర్భాలను నాశనం చేసి కాని శాంతించదు" అన్నాడు అశ్వత్థామ.

"అలాగే... అయితే మరో దానికి మాత్రం ఆశపడకు" అన్నాడు వ్యాసుడు.

ఆయన మాటల్లోని అర్థాన్ని అశ్వత్థామ గ్రహించాడు. 'అది మాత్రం ఎందుకు వదిలెయ్యాలి? అన్నిటినీ అంతం చేస్తాను' అని మనసులో అనుకున్నాడు. కానీ "అలాగే చేస్తాను" అని వ్యాసుడితో చెప్పాడు.

కృష్ణుడికి విషయం అర్థమయింది. 'వ్యాసుడికి మాట ఇచ్చినట్టే ఇచ్చి.. తనకు నచ్చినట్టు చేస్తాడు. దీన్ని నేను ఆపుతాను' అనుకున్నాడు మనసులో. "పాండవుల సంతతిని నాశనం చేసి పాపానికి ఒడిగడుతున్నావు. గర్భాలన్నీ నాశనం చేస్తున్నావు. వాళ్ళకు ఒక్క వంశాంకురాన్నైనా విడగుల్చు. ఆ ఒక్క గర్భాన్ని నీ అస్త్రంతో నాశనం కాకుండా ఆపు" అన్నాడు అశ్వత్థామతో.

"ఉత్తర గర్భాన్ని కాపాడాలని నువ్వు అనుకుంటున్నావని నాకు తెలుసు. నేను మాత్రం వదిలిపెట్టను" అని స్పష్టం చేశాడు అశ్వత్థామ.

"నువ్వు నాశనం చేసినా నేను రక్షించి, దీర్ఘాయువు పోస్తాను" అన్నాడు కృష్ణుడు.

"అస్త్రంతో తగలబడిపోయేవాణ్ణి బతికిస్తానంటున్నావ్. నువ్వెంత నేర్పరివో చూద్దాం" అంటూ 'పాండవ స్త్రీల గర్భాలన్నీ నాశనం కావాలి' అని అనుకొని అశ్వత్థామ ఆ అస్త్రాన్ని వదిలిపెట్టాడు.

"నీ కళ్ళముందే ఆ బిడ్డ, అతని వంశం కళకళలాడుతూ ఉంటుంది. నేను ఆ బిడ్డని రక్షిస్తాను. నిన్ను మాత్రం... గర్భంలో ఉన్న పిల్లల్ని చంపిన పాపం కట్టికుదుపుతుంది. తిండిలేక అల్లాడతావు. దుర్వాసనతో ఉండే రక్తాన్ని శరీరానికి పూసుకొని మూడువేల ఏళ్ళు దేవులాడుతూ ఉంటావు" అంటూ శ్రీకృష్ణుడు శపించాడు.

వ్యాసుడు కూడా అశ్వత్థామకు శాపం ఇస్తూ... "ఇంతటి పాతకానికి పాల్పడ్డావు. నా మాటను లెక్క చెయ్యలేదు. తిండీ తిప్పలు లేకుండా, ఎటువంటి సహాయం లేకుండా... మూడు వేల ఏళ్ళు దుర్గంధమైన రక్తంతో భూమి మీద తచ్చాడుతూ ఉంటావు" అన్నాడు.

"నువ్వూ చిరంజీవివే. మనుషులలోనే ఉంటావు. నేను నీ దగ్గరే ఉంటాను..." అని వ్యాసుడికి చెబుతూ... తన శిరోరత్నాన్ని పాండవులకు ఇచ్చేసి, తపోవనంలోకి నడిచాడు అశ్వత్థామ. గత యుగాల నుంచి భూమిమీద ఇప్పటికీ మిగిలి ఉన్న 'చిరంజీవులు'గా పురాణాలు వర్ణించిన వారిలో అశ్వత్థామ ఒకరు. వారిలో శాపగ్రస్తుడు మాత్రం అతనొక్కడే.


సద్బోధ

వివేకి- మూర్ఖుడు

ఇద్దరు వ్యక్తులు సముద్రంలో చిక్కుకున్నారు. తీరానికి కొంత దూరంగా ఉన్న ఒక రాతి మీదకు చేరుకున్నారు. చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఆకాశంలో మబ్బులు ముసురుకుంటున్నాయి. తీరంలో ఉన్నవేవీ కనిపించడం లేదు. కెరటాలు ఉధృతంగా వచ్చి... రాళ్ళను ఢీకొని వెనక్కి పోతున్నాయి. సముద్రం కల్లోలంగా ఉంది.

ఇంతలో వేరొక వ్యక్తి వారిని సమీపించాడు. "నాతో రండి. మిమ్మల్ని తీరానికి చేరుస్తాను" అని అన్నాడు.

వారిలో వివేకవంతుడైన వ్యక్తి... అతనితో వెళ్ళడానికి సిద్ధమయ్యాడు. కానీ మూర్ఖుడైన వ్యక్తి సందేహిస్తూ "ఈ నీళ్ళలోంచీ మమ్మల్ని నువ్వెలా బయటకు తీసుకువెళ్తావు?" అని ప్రశ్నించాడు.



14న స్వామి శివానంద వర్ధంతి

"పడవను నాతో తీసుకువచ్చాను" అన్నాడు కొత్త వ్యక్తి.

"నీతో రావడానికి నేను సిద్ధమే" అన్నాడు వివేకవంతుడు.

"లేదు. నేను రాను. బహుశా పడవలో ఏదైనా లోపం ఉండొచ్చు. లేదా ఈ మనిషి దోపిడీదారు కావచ్చు" అన్నాడు మూర్ఖుడు.

తెలివైన మనిషి పడవలో ఎక్కాడు. పడవ నడిపే వ్యక్తి మార్గదర్శకత్వంలో... తీరానికి సురక్షితంగా చేరాడు. ఇంతలో... సముద్రంలో కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. మూర్ఖుడు నీళ్ళలో పడి మునిగిపోయాడు.

ఎన్నో జన్మల తరువాత... మానవ జన్మ అనే వరాన్ని పొందిన జీవుడు... సంసారం అనే సముద్రంలో కొట్టుకుపోతూ ఉంటాడు. సురక్షితమైన తీరాన్ని చేరుకోలేక సతమతమవుతూ ఉంటాడు. కాలం ప్రవహిస్తూ ఉంటుంది. జీవితం చరమాంకానికి చేరుకుంటుంది. కంటి చూపు తగ్గిపోతుంది. భౌతిక ప్రపంచాన్నే పట్టుకొని పాకులాడడం, సామరస్యత లేకపోవడం అనే మబ్బులు జ్ఞాన నేత్రాన్ని మూసేస్తాయి. అప్పుడు కలవరపాటుతో ప్రార్థిస్తూ మానవుడు అనిశ్చితి అనే శిల మీద నిలబడి ఉంటాడు.

భగవన్నామం లేదా భక్తి అనే పడవలో గురువు అతని దగ్గరకువస్తాడు. తనను అనుసరించి, నావను ఎక్కి, భవసాగరాన్ని దాటి సురక్షితంగా ఒడ్డుకు చేరుకోవాలని బోధిస్తాడు. వివేకవంతుడైన మనిషి అందుకు తక్షణమే సిద్ధమవుతాడు. కానీ మూర్ఖుడికి వెయ్యి సందేహాలు, లక్ష అనుమానాలు ఉంటాయి. గురువు చిత్తశుద్ధిని, భక్తి ప్రామాణికతను అతను ప్రశ్నిస్తాడు. త్వరలోనే మళ్ళీ మరోసారి అతను సంసారమనే మహా సముద్రంలో పడిపోతాడు. దానిలో మునిగిపోతాడు. తనను భగవంతుడికి సమర్పించుకోవడం ద్వారా... తనను తాను కాపాడుకొనే గొప్ప అవకాశాన్ని అతను కోల్పోతాడు.

- స్వామి శివానంద



సాధనతోనే నియంత్రణ సాధ్యం




మన గతాన్ని, వర్తమానాన్ని, భవిష్యత్తును నిర్ణయించేది... మన ఆలోచనలే. ఈ ఆలోచనల్లోని వైరుధ్యాలే ప్రేమ, ద్వేషం, ఘర్షణ తదితర భావోద్వేగాలకు కారణం. మానవుడు తనను తాను తెలుసుకోవడానికి ఎంతో కృషి చేస్తాడు. చివరకు... 'నా ఆలోచనల సమగ్ర స్వరూపమే నేను' అని తెలుసుకుంటాడు. ఆత్మజ్ఞానం పొందడం అంటే... మనిషి తన ఆలోచనల విస్తృత స్వరూపాన్ని అర్థం చేసుకోవడమే. ఆలోచనల పుట్టుక, వాటి స్వభావం, వాటి పరిణామక్రమమే మానవుడి సమగ్ర వ్యక్తిత్వం. తమతమ ఆలోచనా సరళి కారణంగానే వ్యక్తిగతమైన భేదాలు ఏర్పడతాయి. విభిన్న అభిప్రాయాలకు, భావనా వైరుధ్యాలకు మూలకారణం... వారివారి ఆలోచనా విధానం వేరువేరుగా ఉండడమే. ఎవరైతే తమ ఆలోచనా విధానాన్ని సమగ్రంగా పరిశీలిస్తూ, విశ్లేషిస్తూ ముందుకు సాగుతారో... వారు తమ జీవన ప్రయాణాన్ని స్ఫూర్తిమంతంగా కొనసాగిస్తారు.

మనస్సులో పుట్టిన ఒక భావన... ఒక ఆలోచనగా రూపొందుతుంది. దరిమిలా కుప్పలు తెప్పలుగా ఆలోచనలు పుట్టుకొస్తాయి. ఇవన్నీ మూల భావన తాలూకు అస్తిత్వ ప్రతిరూపాలే. ఇలా అసంఖ్యాకంగా పుట్టుకొస్తున్న ఆలోచనల్లో కొన్ని మంచివి, కొన్ని చెడ్డవి ఉంటాయి. ఇక్కడ మంచి, చెడు అనే విషయంలో ఏ ఇద్దరి ఆలోచనా విధానం ఒకలా ఉండదు. కాబట్టి దేశకాలమాన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని... ఏ ఆలోచనైతే సామాజికంగా సమగ్రాభివృద్ధికి దోహదపడుతుందో, ఎక్కువమంది ఆమోదాన్ని పొందుతుందో అదే మంచిదని భావించవచ్చు. అలాకాకుండా ఆ అభివృద్ధికి ఆటంకం కలిగించే ఆలోచనలను చెడ్డవిగా పరిగణించవచ్చు. ఇక... వ్యక్తిగత స్థాయిలో... ఏ ఆలోచన ఒక వ్యక్తి శారీరక, మానసిక, సామాజిక సమగ్ర వికాసానికి ఉపయోగపడుతుందో అది మంచి ఆలోచన అనీ, ఆ వికాసానికి హాని కలిగించేది చెడ్డ ఆలోచన అనీ విశ్లేషించవచ్చు.

ఈ మంచి చెడు ఆలోచనల పరంపర మన మనస్సును చుట్టుముట్టినప్పుడు... మనం ఎక్కువగా ఏ విధమైన ఆలోచనలు చేస్తామో... వాటికి మూలమైన భావన బలపడుతుంది. అలా బలపడిన భావన తాలూకు తదుపరి రూపం... కార్యాచరణ. మంచి ఆలోచనలతో మంచి పనులు, చెడు ఆలోచనలతో చెడ్డ పనులు చేస్తాం. మన మనస్సును ఎలా నియంత్రించుకోవాలనేదే అసలు సమస్య. నిజానికి మనస్సును నియంత్రించుకోలేం. మన మనస్సులో ఒక భావన మొలకెత్తగానే... దానికి సంబంధించిన ఆలోచనలు ప్రారంభమవుతాయి. ప్రారంభ దశలోనే ఆ భావన మంచిదా, చెడ్డదా, ప్రయోజనకరమైనదా, కాదా అనేది బుద్ధితో గ్రహించాలి. దానికి అనుగుణంగా ఆలోచనలను నియంత్రించుకోవాలి. ఒకదాని వెనుక ఒకటిగా వస్తున్న ఆలోచనలను... మన బుద్ధిద్వారా క్రమబద్ధీకరించుకోవాలి. ఆ ఆలోచనలు మనకుగాని, సమాజానికి గాని ప్రయోజనకరమైనవి కానప్పుడు... బుద్ధి ద్వారా ఆ సంగతి గ్రహించి... అలాంటి ఆలోచలను ఆపెయ్యాలి. లేకపోతే అవి మనలో స్థిరపడతాయి. చెడ్డ పనులకు ప్రోత్సహిస్తాయి. వాటిని ఎప్పటికప్పుడు వడబోసుకుంటూ ఉంటే... కొంతకాలానికి మనస్సులో చెడు భావనలు తగ్గుతాయి. ఒకవేళ అలాంటి భావనలు కలిగినా... మన మనస్సు వాటితో నిండిపోకుండా బుద్ధి అడ్డుకుంటుంది. క్రమంగా మన మనస్సు మంచి భావనలతో... తద్వారా మంచి ఆలోచనలతో నిండి ఉంటుంది. నిండు పాత్రలో... కొత్త వాటికి చోటు ఉండదు కదా! అలాగే మనస్సు పూర్తిగా మంచి భావనలతో, మంచి ఆలోచనలతో నిండి మనల్ని ఉన్నత స్థితివైపు మరలిస్తుంది. మనస్సును అదుపు చెయ్యడం కష్టం. కానీ, మనస్సులోని ఆలోచనను గమనిస్తూ... బుద్ధిద్వారా నియంత్రించుకోవడం కష్టం కాదు. సాధన ద్వారా ఇది సాధ్యమవుతుంది. మంచి ఆలోచనలతో నిండిన మనస్సు... వెంటనే కార్యాచరణకు ప్రేరేపిస్తుంది. మంచి పనులు చేయడం మొదలుపెడతాం. తద్వారా కలిగే సంతృప్తి... మనస్సులో మంచి భావనలు మొలకెత్తడానికి ఎరువులా ఉపయోగపడతాయి. మరిన్ని మంచి పనులు చేసే సమర్థతను మనలో కలిగిస్తాయి. సాధనతో దీన్ని సాధించవచ్చు.


- డాక్టర్ డి.వి.రఘునాథ్

విష, అమృత వలయాలు



విష, అమృత వలయాలు అంటే ఒకదాని నుంచి మరొక దానికి దారితీసే సంఘటనల సమూహాలు. ఇవి సుఖాన్ని లేదా దుఃఖాన్ని కలిగిస్తాయి. ఆదాయం కన్నా ఖర్చులు ఎక్కువగా ఉంటే... అది ఋణాల ఊబిలోకి దారి తీసే ఒక విషవలయం. ఆదాయం కన్నా ఖర్చులు తక్కువగా ఉండి... సంపద సృష్టి జరిగితే... అది అమృత వలయం. ఈ వలయాల గురించి శ్రీకృష్ణుడు వివరిస్తూ "విషయ చింతన చేసే వ్యక్తికి ఆ విషయాల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. ఆ ఆసక్తి కారణంగా... ఆ విషయాలను పొందాలనే కోరిక కలుగుతుంది. ఆ కోరిక తీరనప్పుడు... క్రోధం ఏర్పడుతుంది. అలాంటి క్రోధం వల్ల వ్యామోహం కలుగుతుంది. దాని ప్రభావం వల్ల స్మృతి ఛిన్నాభిన్నం అవుతుంది. స్మృతిని కోల్పోవడం వల్ల బుద్ధి... అంటే జ్ఞాపకశక్తి నశిస్తుంది. బుద్ధి నాశనమైపోవడం వల్ల మనిషి తను ఉన్న స్థితి నుంచి పతనం అయిపోతాడు" అని చెప్పాడు. ఇది పతనానికి సంబంధించిన విషవలయం. అలాగే "అంతఃకరణను వశంలో ఉంచుకున్న సాధకుడు రాగద్వేషరహితుడై, ఇంద్రియాల ద్వారా విషయాలను గ్రహిస్తున్నప్పటికీ, వాటి ఆకర్షణకు లోనుకాకుండా... మనశ్శాంతిని పొందుతాడు" అని శ్రీకృష్ణుడు పేర్కొన్నాడు. ఇది శాంతి, ఆనందాల అమృత వలయం.

మనమందరం దైనందిన జీవితంలో ఆకర్షణీయమైన లేక అసహ్యమైన ఇంద్రియ వస్తువుల మధ్య సంచరిస్తూ ఉంటాం. వాటితో మనం ఎలా వ్యవహరిస్తామనేది మన ప్రయాణం దిశను నిర్దేశిస్తుంది. అమృతవలయంలోకి ప్రయాణిస్తున్నవారు... ఇంద్రియ వస్తువుల ఆకర్షణ, వికర్షణల నుంచి విముక్తి పొందుతారు. ఇక విషయవలయం వైపు వెళ్తున్నవారు ఇంద్రియ వస్తువుల ఆకర్షణకు లోనవుతారు లేదా అసహ్యాన్ని పెంచుకుంటారు. విషవలయం నుంచి అమృతవలయానికి రావడానికి సులువైన మార్గం... ద్వేషాన్ని వదిలెయ్యడం. ఎందుకంటే ద్వేషం ప్రాణాంతకమైన విషం లాంటిది. ద్వేషాన్ని వదిలేసినప్పుడు... దానికి వ్యతిరేక ధ్రువమైన రాగం కూడా తొలగిపోతుంది. షరతులు లేని ప్రేమకు అది దారి తీస్తుంది. రాగద్వేషాలను దాటి ముందుకు పోవడం అనేది భగవద్గీతలోని ఒక మౌలిక ఉపదేశం. అన్ని జీవులలో మనల్ని, అన్ని జీవులను మనలో... చివరకు అన్నిటిలో, ప్రతి చోటా తనను (శ్రీకృష్ణుణ్ణి) చూడాలని శ్రీకృష్ణుడు సలహా ఇచ్చాడు. ద్వేషాన్ని వదిలెయ్యడానికి ఈ ఏకత్వం మనకు సహాయపడుతుంది. అంతిమంగా... మనకు ఆనందం కలిగిస్తుంది.



కె. శివప్రసాద్
ఐఎఎస్

సుభాషితం

లోభత్వానికి ఫలితం

దానం భోగో నాశ స్తిస్రో
గతయో భవన్తి విత్తస్య
యోన దదాతి న భుంక్తే తస్య
తృతీయా గతిర్భవతి... అంటూ లోభత్వం వల్ల కలిగే అనర్థం గురించి తన 'నీతిశతకం'లోని ఈ శ్లోకంలో భర్తృహరి వివరించాడు.

దాన్ని...

దానము భోగము నాశము
పూనికతో మూడు గతులు భువి
ధనమునకున్



దానము భోగము నెరుగని
దీనుని ధనమునకు గతి
ధ్రుతీయమె పొసగున్... అనే పద్యరూపంలో తెలుగులో అందించాడు ఏనుగు లక్ష్మణకవి.

భావం:

డబ్బు ఖర్చు కావడానికి మూడు మార్గాలు ఉన్నాయి. మొదటిది: ఎవరికైనా దానం చేయడం. రెండోది: తాను అనుభవించడం. మూడోది: అది నాశనం కావడం. ఎవరికీ దానం చేయకుండా, తాను ఖర్చు పెట్టి సుఖపడకుండా లోభత్వంతో దాచిన ధనం చివరకు ఎందుకూ కొరగాకుండా పోతుంది, నాశనమైపోతుంది, దొంగల పాలు అవుతుంది. దానాన్నీ, భోగాన్నీ ఎరుగని వాడి సంపదకు చివరికి దుర్గతే పడుతుంది.

ఎన్‌జీ రంగా వర్సిటీలో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)- బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అకడమిక్ మెరిట్ ఆధారంగా లాంలోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ కాలేజీకి ఐకార్ గుర్తింపు ఉంది. మొత్తం 83 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల కోసం 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు నిర్దేశించారు. గ్రామీణ అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. హాస్టల్ సౌకర్యం ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ/ఎంపీసీ/ఎంబైపీసీ గ్రూప్ సబ్జెక్టులతో ఇంటర్/ పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

- మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా(హోం సైన్స్) ఉత్తీర్ణులైన అభ్యర్థుల కోసం పది శాతం సూపర్ న్యూమరరీ సీట్లు(ఎనిమిది సీట్లు) ప్రత్యేకించారు. గ్రామీణ అభ్యర్థులకు కేటాయించిన సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే ఒకటోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు కనీసం నాలుగేళ్లు గ్రామ పాఠశాలల్లో చదివి ఉండాలి. సంబంధిత



దిక్సూచి

DIKSUCHI

ధ్రువపత్రాన్ని సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.

- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 29
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు - 522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

ఇగ్నోలో ఓడీఎల్ కోర్సులు

న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో)- ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ, డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ తదితర కోర్సులు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన అర్హతల సమాచారాన్ని వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

అడ్వాన్స్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, పవర్ డిస్ట్రిబ్యూషన్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అప్రిసియేషన్ కోర్సు: కోర్సు వ్యవధి మూడు నెలలు.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు.

డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. బిజినెస్ ప్రాసెస్ అవుట్ సోర్సింగ్, క్రియేటివ్ రైటింగ్ ఇన్ ఇంగ్లీష్, డెయిరీ టెక్నాలజీ, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, ఫ్యాషన్ డిజైన్ అండ్ రిటైల్, హార్టికల్చర్, మీట్ టెక్నాలజీ, మోడరన్ ఆఫీస్ ప్రాక్టీస్, న్యూట్రిషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్, పారాలీగల్ ప్రాక్టీస్, థియేటర్ ఆర్ట్స్, టూరిజం స్టడీస్, ఉర్దూ, వాల్యూ ఎడ్యుకేషన్, వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్, ఉమన్ ఎంపవర్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్, అగ్రికల్చరల్ అండ్ కాస్ట్ మేనేజ్‌మెంట్, అప్పారెల్ మర్చండైజింగ్, రిటైలింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

డిగ్రీ ప్రోగ్రామ్‌లు: బీఏ, బీఏ ఆనర్స్, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీకాం, బీఎస్‌డబ్ల్యూ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ వ్యవధి ఏడాది.

పీజీ ప్రోగ్రామ్‌లు: ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంటీటీఎం, ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎంఎల్ఐఎస్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది.

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. అనలిటికల్ కెమిస్ట్రీ, కౌన్సెలింగ్ అండ్ ఫ్యామిలీ థెరపీ, గాంధీ అండ్ పీస్ స్టడీస్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, యానిమల్ వెల్ఫేర్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, ఆడియో ప్రోగ్రామ్ ప్రొడక్షన్, బుక్ పబ్లిషింగ్, కార్పొరేట్ అండ్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, డెవలప్‌మెంట్ స్టడీస్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఎడ్యుకేషనల్ టెక్నాలజీ తదితర స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

పీజీ సర్టిఫికెట్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. అగ్రికల్చర్ పాలసీ, క్లయిమేట్ ఛేంజ్, జియో ఇన్ఫర్మాటిక్స్, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఇన్వెంటరీ ప్లానింగ్ అండ్ వేర్ హౌసింగ్ సిస్టమ్ ఫర్ ఇంజనీర్స్, మలయాళం-హిందీ ట్రాన్స్‌లేషన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 15
- **వెబ్‌సైట్:** ignouadmission.samarth.edu.in

ఎన్‌పీటీఐలో పీజీ డిప్లొమాలు

ఫరీదాబాద్‌లోని నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)- పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు. మహిళలకు ప్రోగ్రామ్ ఫీజులో పది శాతం రాయితీ లభిస్తుంది. పవర్ సంస్థలు స్పాన్సర్ చేసే అభ్యర్థుల కోసం 25 శాతం సీట్లు కేటాయించారు. అకడమిక్ మెరిట్ ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందించి కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

పీజీ డిప్లొమా ఇన్ పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: కోర్సు వ్యవధి ఏడాది. ఫరీదాబాద్, నాగ్‌పూర్, నైవేలీ, దుర్గాపూర్, అలప్పుజా, శివ్‌పురి సెంటర్లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఒక్కో సెంటర్లో 60 సీట్లు చొప్పున మొత్తం 360 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ఇన్ హైడ్రో పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: కోర్సు వ్యవధి తొమ్మిది నెలలు. నంగల్ సెంటర్లో ఈ ప్రోగ్రామ్ ఉంది. ఇక్కడ 60 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ఇన్ రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్: కోర్సు వ్యవధి ఏడాది. న్యూఢిల్లీ, శివ్‌పురి, నైవేలీ, అలప్పుజా సెంటర్లలో ఈ ప్రోగ్రామ్ ఉంది.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో (బీఈ/బీటెక్)(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/సీ అండ్ ఐ/పవర్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ కోర్సుకు ఏ ఇంజనీరింగ్ విభాగంవారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 28
- **టెలిఫోనిక్ ఇంటర్వ్యూ:** జూలై 30, 31
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** ఆగస్టు 2
- **కౌన్సెలింగ్:** ఆగస్టు 5, 6
- **కోర్సులు ప్రారంభం:** ఆగస్టు 12 నుంచి
- **మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్స్:** ఆగస్టు 22
- **వెబ్‌సైట్:** www.npti.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/UbJFPG3లో చదవండి.

సెప్టెంబర్ ఒకటిన బాలకృష్ణకు భారీ సన్మానం



'తాతమ్మ కల' (1974) చిత్రంతో తన నట జీవితాన్ని ప్రారంభించారు నందమూరి బాలకృష్ణ వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ 50 ఏళ్లుగా హీరోగా కొనసాగుతున్న ఏకైక కళాకారుడు ప్రపంచంలో ఆయన ఒక్కరే అంటే అది అతిశయోక్తి కాదు. అంతేకాదు తండ్రి, మహానటుడు ఎన్టీఆర్ మార్గాన్ని అనుసరించి రాజకీయాల్లోకి ప్రవేశించి హిందూపురం నియోజక వర్గం నుంచి మూడు సార్లు వరుసగా శాసనసభ్యుడిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు. ఇలా సినీరంగంలోనూ, రాజకీయ రంగంలోనూ సత్తా చాటుతూ 50 ఏళ్ల కెరీర్ పూర్తి చేసుకున్న బాలకృష్ణను తెలుగు చిత్రపరిశ్రమ సెప్టెంబర్ ఒకటిన ఘనంగా సత్కరించనుంది. ఈ మేరకు తెలుగు నిర్మాతలమండలి కార్యదర్శి దామోదర ప్రసాద్, నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు సునీల్ నారంగ్, ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ కలవగా, బాలకృష్ణ ఈ సన్మానానికి తన అంగీకారం తెలిపారు. బాలీవుడ్, ఇతర సినీ రంగాలకు చెందిన ప్రముఖులు కూడా ఈ సన్మాన సభకు హాజరవుతారని సమాచారం.



షూటింగ్ మొదలుపెట్టారు

విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న తాజా చిత్రం రెగ్యులర్ షూటింగ్ గురువారం మొదలైంది. వెంకటేశ్ సరసన మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఓ పోలీస్ ఆఫీసర్, ఆయన భార్య, మాజీ ప్రేయసి.. ఇలా మూడు పాత్రల చుట్టూ తిరిగే వినోద భరిత చిత్రమిదని, ఇందులో క్రైమ్ ఎలిమెంట్ కూడా మిళితమై ఉంటుందని దర్శకుడు అనిల్ రావిపూడి చెప్పారు. ప్రస్తుతం ప్రారంభమైన షూటింగ్‌లో చిత్రంలోని ముఖ్య తారాగణమంతా పాల్గొంటోంది. ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు చిత్ర నిర్మాత శిరీష్ చెప్పారు. దిల్ రాజు ఈ సినిమాకు సమర్పకుడు. ఈ చిత్రానికి సమీర్‌రెడ్డి ఛాయాగ్రాహకుడు, భీమ్స్ సిసిరోలియో సంగీత దర్శకుడు.

ఉత్తమ నటులుగా ఎన్టీఆర్, రామ్‌చరణ్ ఉత్తమ నటిగా సాయి పల్లవి



ఫిల్మ్‌ఫేర్ సౌత్ ఇండియన్ అవార్డుల సందడి



జాతీయ చలనచిత్ర అవార్డుల తర్వాత భారతీయ చిత్ర పరిశ్రమ ప్రతిష్ఠాత్మకంగా భావించే ఫిల్మ్‌ఫేర్ సౌత్ ఇండియన్ అవార్డులను గురువారం ప్రకటించారు. అంతర్జాతీయంగా ప్రతిష్ఠాత్మకమైన అవార్డులు పొందిన 'ఆర్ ఆర్ ఆర్' చిత్రం తెలుగు విభాగంలో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఉత్తమ నటులుగా ఎన్టీఆర్, రామ్‌చరణ్, ఉత్తమ దర్శకుడిగా రాజమౌళి ఎన్నికయ్యారు. 'విరాటపర్వం' చిత్రంలో నటించిన సాయిపల్లవి ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. 'భీమ్లా నాయక్'లో నటించిన రానా ఉత్తమ సహాయ నటుడిగా, 'విరాటపర్వం'లో నటించిన నందితా దాస్, 'సీతారామం'లో నటించిన మృణాల్ ఠాకూర్ ఉత్తమ సహాయ నటీమణులుగా, ఉత్తమ గేయ రచయితగా సీతారామశాస్త్రి (సీతారామం) ఎన్నికయ్యారు. తమిళంలో ఉత్తమ నటుడిగా కమల్ హాసన్ (విక్రమ్) ఉత్తమ నటిగా ఊర్వశి, ఉత్తమ చిత్రంగా పొన్నియిన్ సెల్వం 1', ఆ సినిమాకు దర్శకత్వం వహించిన మణిరత్నం ఉత్తమ దర్శకుడిగా ఎన్నికయ్యారు. కన్నడంలో 'కాంతార', మలయాళంలో 'న్నా థాన్ కేసు కుడు' ఉత్తమ చిత్రాలుగా ఎన్నికయ్యాయి.

వినోదాత్మకంగా డార్లింగ్



అశ్విన్‌రామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'డార్లింగ్'. ప్రియదర్శి నభానటేశ్ జంటగా నటించగా, కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. ఈ నెల 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అశ్విన్‌రామ్ మీడియాతో ముచ్చటించారు. "కొత్త జంట పెళ్లిని ఎలా హ్యాండిల్ చేస్తారనేది ఇందులో వినోదాత్మకంగా చూపించా. సినిమాల ద్వారా సందేశాలు ఇవ్వడం నాకు ఇష్టం ఉండదు. ఈ సినిమాలో ఎంటర్టైన్‌మెంట్‌తో పాటూ ఓ సామాజిక బాధ్యతను కూడా జత చేశా. ఇందులో కథానాయకుడి పాత్ర చాలా అమాయకంగా.. కథానాయిక పాత్ర చలాకీగా ఉండాలి. అలా ఆ పాత్రలకి సరిపోయే నటీనటులను పరిశీలించాక.. ప్రియదర్శి, నభానటేశ్ వందశాతం సరిపోతారని అనిపించి వారిని తీసుకున్నాం. నభా పాత్రలో చాలా షేడ్స్ ఉంటాయి.. సినిమాలో నభా మీ అందరినీ పూర్తిగా ఆశ్చర్యానికి గురిచేస్తుంది. వినోదంతో పాటు భావోద్వేగాలని సమపాళ్లలో మిక్స్ చేసి తీసిన ఈ సినిమాలో.. హీరో హీరోయిన్ల మధ్యన వచ్చే సన్నివేశాలు అందరినీ కడుపుబ్బా నవ్విస్తాయి. నిర్మాతలు ఎక్కడా రాజీ పడకుండా మేకింగ్ విషయంలో పూర్తి స్వేచ్ఛనిచ్చారు.

అద్భుతమైన విజువల్స్‌తో..



వరుణ్ సందేశ్ నటిస్తున్న చిత్రం 'విరాజి'. ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్నారు. ఆగస్టు 2న సినిమా విడుదలవుతుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ టీజర్‌ను దర్శకుడు సాయి రాజేశ్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "టీజర్‌లో విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. వరుణ్ లుక్ అదిరిపోయింది" అని చెప్పారు. "ఈ చిత్రం నాకు చాలా స్పెషల్" అని వరుణ్ సందేశ్ అన్నారు. "ఈ సినిమాలో చాలా ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి. వాటిని థియేటర్లలో చూసి ఆశ్చర్యపోతారు" అని దర్శకుడు ఆద్యంత్ హర్ష తెలిపారు.

ముందు రిసెప్షన్.. తర్వాత పెళ్లి!



వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ మంచి నటిగా తెలుగువారికి దగ్గరైన తమిళ నటి వరలక్ష్మి తన పెళ్లి వేడుకలోనూ వైవిధ్యం చూపించారు. వారం రోజుల క్రితం చెన్నైలో వరలక్ష్మి, నికోలై సచిదేవ్‌ల పెళ్లి రిసెప్షన్ చెన్నైలో జరిగింది. ఈ వేడుకకు పలువురు చిత్ర ప్రముఖులు హాజరయ్యారు. ఇలా అందరి అభినందనలు అందుకున్న వరలక్ష్మి, నికోలై సచిదేవ్ మంగళవారం థాయ్‌లాండ్‌లోని క్రాబి బీచ్ రిసార్ట్‌లో పెళ్లి చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, అతికొద్దిమంది సన్నిహితుల మధ్య తమిళ సంప్రదాయానికి అనుగుణంగా ఈ పెళ్లి జరిగింది.

అనౌన్స్‌మెంట్ వీడియోతోనే సంచలనం



సత్యం రాజేశ్, బాలాదిత్య, గెటప్ శ్రీను ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'పొలిమేర 2' బాక్సాఫీస్ వద్ద ఊహించని సక్సెస్‌ను అందుకుని హారర్ థ్రిల్లర్ జానర్ సినిమాల్లో సరికొత్త ట్రెండ్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. 2021లో 'మా ఊరి పొలిమేర' చిత్రం ఓటీటీ సంస్థ 'డిస్నీ ప్లస్ హాట్‌స్టార్'లో విడుదలై అందరినీ మెప్పించింది .'మా ఊరి పొలిమేర'కు సీక్వెల్‌గా వచ్చిందే 'పొలిమేర 2'. గతేడాది నవంబరులో విడుదలైన ఈ సక్సెస్‌ఫుల్ హారర్ థ్రిల్లర్ ఫిల్మ్‌కు కొనసాగింపుగా ఇంకో భాగం ఉంటుందని మేకర్స్ అప్పుడే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించారు. తాజాగా, 'పొలిమేర 3'ను మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో సంచలనం సృష్టిస్తోంది. ఈ వీడియో రిలీజైన కొద్దిసేపటికే ఎక్స్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతూ టాప్ ప్లేస్‌ను ఆక్రమించింది. మూడో భాగాన్ని మొదటి రెండు పార్టులకు దర్శకత్వం వహించిన అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించనున్నారు. భోగేంద్ర గుప్తా, వంశీ నందిపాటి సంయుక్తంగా నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉన్నట్లు మేకర్స్ వెల్లడించారు. 'పొలిమేర 3' లో సత్యం రాజేష్, బాలాదిత్య, కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రవి వర్మ, రాకేందు మౌళి, చిత్రం శ్రీను, సాహిత్య దాసరి ప్రధాన పాత్రల్లో నటించనున్నారు.

శ్రీలంకతో 3 వన్డేలు, 3 టీ20లు

న్యూఢిల్లీ: కొత్త కోచ్ గౌతమ్ గంభీర్ ఆధ్వర్యంలో భారత జట్టు ఈనెలాఖరున శ్రీలంకతో పరిమిత ఓవర్ల సిరీస్ ఆడనుంది. ముందుగా పల్లెకెలెలో 26, 27, 29న టీ20 సిరీస్.. ఆ తర్వాత కొలంబో వేదికగా ఆగస్టు 1, 4, 7న ఇరు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ జరుగనుంది. సరిగ్గా మూడేళ్ల క్రితం భారత జట్టు లంకలో పర్యటించింది. మరో వైపు ఈ సిరీస్‌కు కెప్టెన్ రోహిత్, విరాట్, బుమ్రా విశ్రాంతి తీసుకోనున్నట్టు సమాచారం.



టీ20 కెప్టెన్సీకి హసరంగ గుడ్ బై: శ్రీలంక టీ20 జట్టు కెప్టెన్సీనుంచి వనిందు హసరంగ గురువారం వైదొలిగాడు. భారత్‌తో సిరీస్ ఆడనున్న తరుణంలో హసరంగ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. జట్టు ప్రయోజనాల రీత్యా కెప్టెన్సీ నుంచి వైదొలగి కేవలం ఆటగాడిగా కొనసాగాలని హసరంగ నిర్ణయించుకున్నట్టు శ్రీలంక క్రికెట్ తెలిపింది. హసరంగ నాయకత్వంలో ఇటీవలి టీ20 ప్రపంచ కప్‌లో తలపడిన శ్రీలంక సూపర్-8 దశకు కూడా చేరని విషయం తెలిసిందే.

ఓటమి అంచున విండీస్

రెండో ఇన్నింగ్స్ 79/6 • ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 371

లార్డ్స్: వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ ఘనవిజయానికి చేరువలో ఉంది. రెండో రోజు గురువారం ఆతిథ్య జట్టు 371 పరుగులు సాధించి 250 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని అందుకుంది. జేమీ స్మిత్ (70), రూట్ (68), బ్రూక్ (50) అర్ధసెంచరీలు చేశారు. జేడెన్ సీల్స్‌కు నాలుగు.. మోటీ, హోల్డర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత విండీస్‌ను పేసర్లు అండర్సన్, అట్కిన్సన్, స్టోక్స్ తలా రెండు వికెట్లతో దెబ్బతీశారు. దీంతో ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 34.5 ఓవర్లలో 79 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. విండీస్ ఇంకా 171 పరుగులు వెనుకంజలో ఉండగా, చేతిలో నాలుగు వికెట్లు మాత్రమే మిగిలాయి. ఫలితంగా విండీస్‌కు ఇన్నింగ్స్ ఓటమి తప్పేలా లేదు. అథనజె (22), హోల్డర్ (20) మాత్రమే రాణించారు.

కోహ్లీనా.. అతడెవరు?


స్వీడన్ సాకర్ స్టార్ ఇబ్రహిమోవిచ్

న్యూఢిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా పాపులారిటీ కలిగిన క్రికెటర్ విరాట్ కోహ్లీ. రొనాల్డో, మెస్సీ తరహాలోనే ఇన్‌స్టాలో అతడికి కూడా కోట్లాదిమంది ఫాలోయర్లు ఉన్నారు. అయితే, స్వీడన్ లెజెండరీ ఫుట్‌బాలర్ జ్లటాన్ ఇబ్రహిమోవిచ్‌కు కోహ్లీ ఎవరో కూడా తెలియదట. అమెరికాకు చెందిన ప్రఖ్యాత యూట్యూబర్ స్పీడ్‌తో ఇంటర్వ్యూలో విరాట్ ఫొటోను చూపినా గుర్తుపట్టలేకపోయాడు. 'ఈ క్రికెటర్‌ను ఎప్పుడూ చూడలేదు. అస్సలు నాకు క్రికెట్టే తెలీదు. అతడు గొప్ప ఆటగాడా?' అని ప్రశ్నించాడు.

తుదిపోరుకు కొలంబియా

1-0తో ఉరుగ్వేపై గెలుపు


జెఫర్సన్ లెర్మా

చార్లెటి (నార్త్ కరోలినా): రెండు దశాబ్దాల తర్వాత కొలంబియా 'కోపా అమెరికా చాంపియన్‌షిప్' ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన సెమీస్‌లో కొలంబియా 1-0తో ఉరుగ్వేను ఓడించింది. టైటిల్ ఫైట్‌లో అర్జెంటీనాతో తలపడనుంది. ఫస్టాఫ్ 39వ నిమిషంలో జేమ్స్ రోడ్రిగ్వెజ్ కార్నర్ కిక్‌ను జెఫర్సన్ లెర్మా హెడర్ ద్వారా గోల్‌లోకి పంపాడు. దీంతో కొలంబియా 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఫస్టాఫ్ ఇంజ్యూరీ టైమ్‌లో డేనియల్ మునోజ్‌కు రెడ్ కార్డ్ చూపడంతో.. సెకండాఫ్ మొత్తం కొలంబియా 10 మందితోనే ఆడింది. అయితే, ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఉరుగ్వే బంతిని ఎక్కువ శాతం తన నియంత్రణలోనే ఉంచుకొన్నా.. గోల్ మాత్రం సాధించలేక పోయింది. 2001లో టైటిల్ విజేతగా నిలిచిన కొలంబియా.. మళ్లీ 23 ఏళ్లకు ఫైనల్‌కు చేరుకొంది. కాగా, మ్యాచ్ ముగిసిన తర్వాత డార్విన్ నూనెజ్ సహా 12 మంది ఉరుగ్వే ఆటగాళ్లు స్టాండ్స్‌లోకి వెళ్లి ప్రత్యర్థి ఫ్యాన్స్‌తో దెబ్బలాడడం ఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కొలంబియా జెర్సీ ధరించిన ఓ వ్యక్తిపై నూనెజ్ దాడి చేస్తున్న వీడియో నెట్‌లో హల్‌చల్ చేస్తోంది.



పాక్‌లో ఆడేది లేదు!

హైబ్రిడ్ పద్ధతి మేలు
ఇది బీసీసీఐ అభిప్రాయం

న్యూఢిల్లీ: ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో ఆడేందుకు భారత క్రికెట్ జట్టు పాకిస్థాన్‌లో పర్యటించడం దాదాపు అసాధ్యమని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చిలో ఈ టోర్నీ పాక్‌లో జరగాల్సి ఉంది. అయితే 8 జట్లు పాల్గొనే ట్రోఫీ ముసాయిదా షెడ్యూల్‌ను పాక్ క్రికెట్ బోర్డు ఇప్పటికే ఐసీసీకి సమర్పించింది. దీని ప్రకారం భారత జట్టు తమ మ్యాచ్‌లను లాహోర్‌లో ఆడాల్సి ఉంది. కానీ ఈ షెడ్యూల్‌కు బోర్డు ఆమోదం తెలపలేదని సమాచారం. ఎందుకంటే భద్రతా కారణాలరీత్యా పాక్‌లో అడుగుపెట్టకూడదన్న ఆలోచనలో బోర్డు ఉంది. అందుకే తమ మ్యాచ్‌లను దుబాయ్ లేదా శ్రీలంకలో ఆడించాలని ఐసీసీని గట్టిగా డిమాండ్ చేస్తోంది. 2008 నుంచి భారత జట్టు పాక్‌లో పర్యటించడం లేదు. 'చాంపియన్స్ ట్రోఫీ ఆడేందుకు టీమిండియా పాక్‌కు వెళ్లకపోవచ్చు. దీనిపై తుది నిర్ణయం కేంద్ర ప్రభుత్వం తీసుకోవాల్సి ఉంటుంది. ఆసియాకప్ మాదిరి హైబ్రిడ్ పద్ధతిన భారత్ మ్యాచ్‌లు దుబాయ్ లేక శ్రీలంకలో ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఐసీసీ కూడా ఇదే విషయంపై ఆలోచిస్తోంది' అని బీసీసీఐ అధికారి ఒకరు పేర్కొన్నారు. 2017లో చివరిసారి జరిగిన చాంపియన్స్ ట్రోఫీలో భారత్‌ను ఓడించిన పాక్ విజేతగా నిలిచింది.

ఆఖరి నిమిషంలో వాట్కిన్స్ వండర్ గోల్

'యూరో' ఫైనల్లో ఇంగ్లండ్
2-1తో నెదర్లాండ్స్‌పై గెలుపు


విజయ సారథులు వాట్కిన్స్ (జెర్సీ 19), హ్యారీ కేన్

డార్ట్‌మండ్: ఓల్లీ వాట్కిన్స్ ఆఖరి నిమిషం గోల్‌తో.. ఇంగ్లండ్ వరుసగా రెండోసారి యూరో ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్స్ ఫైనల్‌కు చేరుకొంది. బుధవారం రాత్రి జరిగిన రెండో సెమీస్‌లో ఇంగ్లండ్ 2-1తో నెదర్లాండ్స్‌ను ఓడించింది. ఆదివారం జరిగే టైటిల్ ఫైట్‌లో స్పెయిన్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. మ్యాచ్ ఆరంభమైన 7వ నిమిషంలోనే నెదర్లాండ్స్ గోల్ చేసి షాకిచ్చింది. 40 మీటర్ల దూరం నుంచి గవీ సైమన్ కొట్టిన కిక్.. బుల్లెట్‌లా గోల్‌లోకి దూసుకెళ్లింది. అయితే, 11 నిమిషాల తర్వాత పెనాల్టీ ఏరియాలో ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ కేన్‌ను డెంజిల్ మొరటుగా అడ్డుకోవడంతో రెఫరీ పెనాల్టీ కిక్ ఇచ్చాడు. దీన్ని కేన్ గోల్‌గా మలచడంతో స్కోరు 1-1తో సమమైంది. అయితే, సెకండాఫ్‌లో ఇరుజట్లకూ చక్కని అవకాశాలు లభించినా వాటిని సద్వినియోగం చేసుకోలేక పోయాయి. మ్యాచ్ అదనపు సమయం దిశగా సాగుతున్న దశలో కేన్ బదులు సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన వాట్కిన్స్ 90వ నిమిషంలో కళ్లుచెదిరే గోల్‌తో ఇంగ్లండ్‌ను 2-1తో గెలిపించాడు. క్లిష్టమైన కోణం నుంచి అతడు కొట్టిన బంతి.. కీపర్‌ను బోల్తా కొట్టిస్తూ నేరుగా గోల్‌లో పడింది. కేన్ సేన విజయంపై ఇంగ్లండ్ రాజు కింగ్ చార్లెస్ అభినందనలు తెలిపారు. గత టోర్నీలో ఫైనల్లో ఇంగ్లండ్ ఓటమిపాలైంది.

జాతీయ పతాకాన్ని అగౌరవపరిచాడట!

రోహిత్‌పై నెటిజన్ల ఆగ్రహం



న్యూఢిల్లీ: టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ జాతీయ పతాకాన్ని అవమానపరిచాడంటూ నెటిజన్లు ఆగ్రహం ప్రకటిస్తున్నారు. ఇంతకీ ఏమైందంటే.. వరల్డ్‌కప్ విజయానంతరం రోహిత్ బార్బడోస్ గ్రౌండ్‌లో నేలపై జాతీయ పతాకాన్ని నాటిన విషయం తెలిసిందే. ఆ ఫొటోను రోహిత్ తన 'ఎక్స్' ప్రొఫైల్ పిక్‌గా పెట్టుకున్నాడు. అయితే జెండా నేలను తాకడమంటే జాతీయ చిహ్నాల గౌరవ చట్టం-1971ను ఉల్లంఘించినట్టేనని నెటిజన్లు ఆరోపించారు. దీనికి రోహిత్ వివరణ ఇస్తూ 'కింగ్‌స్టన్ ఓవల్ మైదానంతో నాది ఉద్వేగభరితమైన అనుబంధం. ఆ పిచ్‌పై మేం విజయం సాధించాం. మా కలలను నిజం చేసిన ఆ ప్రదేశంపై గౌరవంతోనే అలా చేశా' అని చెప్పుకొచ్చాడు.

పౌలినీ X క్రెజికోవా

మహిళల సింగిల్స్ ఫైనల్

సెమీస్‌లో వెకిక్, రిబకినా పరాజయం • వింబుల్డన్


పౌలినీ


క్రెజికోవా

లండన్: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్ మహిళల సింగిల్స్ టైటిల్ కోసం ఏడో సీడ్ జాస్మిన్ పౌలినీ (ఇటలీ)-31వ సీడ్ బార్బరా క్రెజికోవా (చెక్ రిపబ్లిక్) తలపడతారు. గురువారం రాత్రి జరిగిన సెమీఫైనల్లో (2 గం.7 నిమిషాలు) 31వ సీడ్ క్రెజికోవా 3-6, 6-3, 6-4తో నాలుగో సీడ్, టైటిల్ ఫేవరెట్ ఎలెనా రిబకినా (కజకిస్థాన్)కు షాకిచ్చింది. అంతకుముందు హోరాహోరీగా జరిగిన మొదటి సెమీస్‌లో పౌలినీ 2-6, 6-4, 7-6 (8)తో అన్‌సీడెడ్ డొనా వెకిక్ (క్రొయేషియా)ను చిత్తు చేసింది. ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో టైటిల్ ఫైట్‌కు చేరడం ద్వారా ఒకే ఏడాది వరుసగా రెండు గ్రాండ్‌స్లామ్‌ల ఫైనల్‌కు చేరిన క్రీడాకారిణిగా జాస్మిన్ ఘనత వహించింది. 2015, 16ల్లో సెరెనా విలియమ్స్ తర్వాత ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్‌లో టైటిల్ పోరుకు దూసుకెళ్లిన మొదటి ప్లేయర్‌గా పౌలినీ నిలిచింది. రెండు గంటలా 51 నిమిషాల పౌలినీ-వెకిక్ పోరు వింబుల్డన్‌లో సుదీర్ఘ సమయం సాగిన మహిళల సెమీఫైనల్‌గా రికార్డుల కెక్కింది. తొలి సెట్‌ను కోల్పోయిన పౌలినీ..రెండో సెట్‌లో 4-4తో పరాజయానికి రెండు గేముల దూరంలో ఉండి పుంజుకున్న తీరు అద్భుతం. ఇక మూడో సెట్‌లోనూ జాస్మిన్ 1-3, 4-3తో వెనుకంజలో ఉన్నా.. వెనక్కు తగ్గకుండా పోరాడడంతో సెట్ టైబ్రేకర్‌కు మళ్లింది. టైబ్రేకర్ కూడా హోరాహోరీగా సాగినా అంతిమంగా పౌలినీదే పైచేయి అయ్యింది. పౌలినీ 26 విన్నర్లే కొట్టగా..వెకిక్ 42 విన్నర్లతో విరుచుకుపడింది. అయితే పౌలినీ (32)తో పోల్చితే ఎక్కువగా అనవసర తప్పిదాలు (57) చేసిన వెకిక్ మూల్యం చెల్లించుకుంది.

నేడు పురుషుల సెమీఫైనల్స్

అల్కారజ్ x మెద్వెదెవ్ (సా. 6.10 నుంచి)
జొకోవిచ్ x ముసేటి (రా. 8 నుంచి)
స్టార్ స్పోర్ట్స్‌లో

బిజినెస్

టీసీఎస్.. భేష్

అంచనాలు మించిన కంపెనీ ఫలితాలు

- క్యూ1లో రూ.12,040 కోట్ల నికర లాభం
- రూ.62,613 కోట్లకు పెరిగిన ఆదాయం
- ఒక్కో షేరుకు రూ.10 మధ్యంతర డివిడెండ్
- 3 నెలల్లో 5,452 నికర నియామకాలు



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి (క్యూ1) టీసీఎస్ ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాల అంచనాలను మించాయి. క్యూ1లో కంపెనీ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 8.7 శాతం వృద్ధితో రూ.12,040 కోట్లకు పెరిగింది. 2023-24లో ఇదే కాలానికి కంపెనీ లాభం రూ.11,074 కోట్లుగా నమోదైంది. ఈ జనవరి-మార్చి త్రైమాసికంలో నమోదైన రూ.12,434 కోట్ల లాభంతో పోలిస్తే మాత్రం 3.1 శాతం తగ్గింది. ఆదాయం విషయానికొస్తే, ఈ క్యూ1లో వార్షిక ప్రాతిపదికన 5.4 శాతం వృద్ధితో రూ.62,613 కోట్లకు చేరుకుంది. క్రితం ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి ఆదాయం రూ.59,381 కోట్లుగా నమోదైంది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికిగాను టీసీఎస్ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.10 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ఇందుకు అర్హులైన వాటాదారుల రికార్డు తేదీని ఈనెల 20గా ప్రకటించిన కంపెనీ.. ఆగస్టు 5న డివిడెండ్ చెల్లించనుంది. మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈ ఏప్రిల్- జూన్ కాలానికి టీసీఎస్ నిర్వహణ మార్జిన్ వార్షిక ప్రాతిపదికన 1.5 శాతం పెరుగుదలతో 24.7 శాతంగా నమోదైంది. నికర మార్జిన్ 19.2 శాతంగా ఉంది.
- వరుసగా మూడు త్రైమాసికాలుగా తగ్గుతూ వచ్చిన టీసీఎస్ ఉద్యోగుల సంఖ్య.. ఈ జూన్ 30తో ముగిసిన క్వార్టర్‌లో మాత్రం 6,06,998కి పెరిగింది. గడిచిన మూడు నెలల్లో కంపెనీ నికరంగా 5,452 మందిని ఉద్యోగంలో చేర్చుకుంది. గత త్రైమాసికంలో కంపెనీ ఉద్యోగుల వలస (అట్రిషన్) రేటు సైతం 12.1 శాతానికి తగ్గింది.
- గడిచిన మూడు నెలల్లో 11,000 మంది ట్రెయినీలను ఆహ్వానించినట్లు టీసీఎస్ హెచ్‌ఆర్ చీఫ్ మిలింద్ లక్కడ్ తెలిపారు. అందులో కొందర్ని గత ఆర్థిక సంవత్సరంలోనే కంపెనీలో చేర్చుకోవాల్సి ఉన్నప్పటికీ, అనుకోని పరిస్థితుల కారణంగా జాప్యమైందన్నారు.
- ఈ క్యూ1లో కంపెనీ దక్కించుకున్న ఆర్డర్ల విలువ మాత్రం 830 కోట్ల డాలర్లకు తగ్గింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలంలో లభించిన 1,020 కోట్ల డాలర్ల ఆర్డర్లతో పోలిస్తే 18.6 శాతం తగ్గగా.. ఈ జనవరి-మార్చి క్వార్టర్‌లో లభించిన 1,320 కోట్ల డాలర్ల ఆర్డర్లతో పోలిస్తే 37 శాతం క్షీణించింది. కాగా, జనరేటివ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డీల్స్ రెట్టింపై 150 కోట్ల డాలర్ల స్థాయికి చేరుకున్నాయని కంపెనీ తెలిపింది. అయితే, అందులో చాలా వరకు ప్రాజెక్టులు రెండు త్రైమాసికాలకు మించని స్వల్పకాలిక ఆర్డర్లేనని సంస్థ పేర్కొంది.
- ప్రాంతాలవారీగా పరిశీలిస్తే, క్యూ1లో కంపెనీకి భారత మార్కెట్ నుంచి లభించిన ఆదాయంలో వృద్ధి వార్షిక ప్రాతిపదికన 61.8 శాతం పెరిగింది. ఎంఈఏ రెవెన్యూ 8.5 శాతం, యూకే 6 శాతం, యూరప్ 0.9 శాతం, లాటిన్ అమెరికా 6.3 శాతం పెరిగింది. ఐటీ రంగానికి కీలక మార్కెట్ అయిన ఉత్తర అమెరికా ఆదాయం మాత్రం 1.1 శాతం తగ్గింది.
- రంగాల వారీగా చూస్తే, లైఫ్ సైన్సెస్ అండ్ హెల్త్‌కేర్, మాన్యుఫాక్చరింగ్, ఎనర్జీ అండ్ రిసోర్సెస్ అండ్ యుటిలిటీస్ రంగాల ఆదాయాల్లో మాత్రమే వృద్ధి నమోదైంది. కంపెనీ మొత్తం రాబడిలో 40 శాతం వరకు వాటా కలిగిన బీఎఫ్ఎస్ఐతో పాటు మిగతా అన్నీ రంగాల ఆదాయం (వార్షిక ప్రాతిపదికన) క్షీణించింది.
- బీఎస్ఈలో టీసీఎస్ షేరు గురువారం 0.33 శాతం లాభంతో రూ.3,922.70 వద్ద ముగిసింది.

> కొత్త ఆర్థిక సంవత్సరాన్ని ఆల్ రౌండ్ వృద్ధితో ప్రారంభించామని తెలియజేసేందుకు సంతోషిస్తున్నాను. క్లయింట్లతో సంబంధాలను మరింత విస్తరించుకోవడంతో పాటు ఆధునిక సాంకేతికతల్లో కొత్త సామర్థ్యాల ఏర్పాటు, ఆవిష్కరణల్లో పెట్టుబడులను కొనసాగిస్తున్నాం. అయితే, వ్యాపార వృద్ధి స్థిరంగా కొనసాగుతుందని ఇప్పుడు చెప్పలేం. ఎందుకంటే, మార్చితో ముగిసిన త్రైమాసికంతో పోలిస్తే జూన్ త్రైమాసికంలో మార్కెట్ పరిస్థితుల్లో పెద్దగా మార్పేమీ లేదు. కాబట్టి, మార్కెట్ సెంటిమెంట్ గురించి కొత్తగా చెప్పడానికి ఏమీ లేదు. కాకపోతే, గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం మెరుగ్గా ఉండనుందని భావిస్తున్నాం.
> - కే కృతివాసన్, సీఈఓ, ఎండీ, టీసీఎస్

భారత రియల్టీ మొఘల్ డీఎల్‌ఎఫ్ రాజీవ్ సింగ్

ఈ ఏడాది మే నాటికి రూ.1.24 లక్షల కోట్ల సంపద

రెండు, మూడు స్థానాల్లో మంగళ్ సింగ్ లోధా, గౌతమ్ అదానీ,
అపర్ణ ఎస్టేట్స్, ఎన్‌సీసీ ప్రమోటర్లకూ స్థానం.. గ్రోహ-హురున్ రియల్టీ లిస్ట్ వెల్లడి



ముంబై: దేశీయ స్థిరాస్తి (రియల్టీ) రంగం కుబేరులకు కనక వర్షం కురిపిస్తోంది. భారత్‌లో అత్యంత ధనవంతులైన ఔత్సాహిక స్థిరాస్తి పారిశ్రామికవేత్తల జాబితాలో డీఎల్‌ఎఫ్ చీఫ్ రాజీవ్ సింగ్ మొదటి స్థానంలో నిలిచారు. ఈ ఏడాది మే నెలాఖరు నాటికి రాజీవ్ సింగ్ సంపద విలువ రూ.1,24,420 కోట్లకు చేరింది. గురువారం విడుదలైన '2024 గ్రోహ-హురున్ ఇండియా రియల్ ఎస్టేట్ 100' జాబితాలో రాజీవ్ సింగ్ పేరు అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానంలో రూ.91,700 కోట్లతో మాక్రోటెక్ డెవలపర్స్ కంపెనీ వ్యవస్థాపకుడు మంగళ్ ప్రభాత్ లోధా, ఆయన కుటుంబం ఉంది. కాగా విలువ పరంగా అత్యంత విజయవంతమైన రియల్ ఎస్టేట్ కంపెనీల జాబితాలో డీఎల్‌ఎఫ్ రూ.2 లక్షల కోట్లతో అత్యంత విలువైన కంపెనీగా అగ్రస్థానంలో ఉందని నివేదిక వెల్లడించింది. రూ.1,36,730 కోట్లతో మాక్రోటెక్ రెండో స్థానంలో, ఇండియన్ హోటల్స్ కంపెనీ రూ.79,150 కోట్లతో మూడో స్థానంలో ఉంది.

గౌతమ్ అదానీకీ చోటు

ముకేశ్ అంబానీ తర్వాత దేశంలో రెండో అతిపెద్ద సంపన్నుడైన ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీకి రియల్టీ రంగమూ కలిసి వస్తోంది. రూ.56,500 కోట్ల రియల్టీ ఆస్తులతో గౌతమ్ అదానీ ఈ జాబితాలో మూడో స్థానం సంపాదించారు. గత ఏడాది కాలంలోనే గౌతమ్ అదానీ స్థిరాస్తుల విలువ ఏకంగా 62 శాతం పెరగడం విశేషం. రూ.44,820 కోట్ల రియల్టీ ఆస్తులతో ఒబెరాయ్ రియల్టీ అధినేత వికాస్ ఒబెరాయ్ నాలుగో స్థానంలో నిలిచారు. రహేజా గ్రూప్‌నకు చెందిన చంద్రు రహేజా అండ్ ఫ్యామిలీ రూ.43,710 కోట్లతో ఐదో స్థానంలో రూ.26.370 కోట్ల రియల్టీ ఆస్తులతో ది ఫీనిక్స్ మిల్స్ అధినేత అతుల్ రుయా జాబితాలో ఆరో స్థానంలో నిలిచారు.

ఆసియాలో మనదే పెద్ద మార్కెట్

చైనా రియల్టీ మార్కెట్లో కొనసాగుతున్న సంక్షోభం మన దేశానికి బాగానే కలిసొచ్చింది. దీంతో 100 కోట్ల డాలర్లు, అంతకంటే ఎక్కువ విలువ ఉన్న ఆసియా రియల్టీ కంపెనీలు మన దేశంలో 36కు చేరాయి. చైనా కంటే ఇది ఆరు కంపెనీలు ఎక్కువని గ్రోహ-హురున్ వెల్లడించింది. సంక్షోభానికి ముందు చైనాలో ఇలాంటి రియల్టీ కంపెనీలు 100 వరకు ఉండేవి. సంక్షోభం పుణ్యమాని ఇప్పుడవి 30కి పడిపోయినట్టు తెలిపింది.

రెండు తెలుగు కంపెనీలకూ చోటు

'2024 గ్రోహ-హురున్ ఇండియా రియల్ ఎస్టేట్ 100' జాబితాలో రెండు తెలుగు కంపెనీలకూ స్థానం లభించింది. రూ.33,130 కోట్ల రియల్ ఎస్టేట్ ఆస్తులతో అపర్ణ ఎస్టేట్స్ అండ్ కన్‌స్ట్రక్షన్ అధినేత సుబ్రమణ్యం రెడ్డి 11వ స్థానంలో, రూ.18,040 కోట్ల రియల్టీ ఆస్తులతో ఎన్‌సీసీ లిమిటెడ్ అధినేత ఏవీ రంగరాజు 20వ స్థానంలో నిలిచారు. గత ఏడాది కాలంలో అపర్ణ ఎస్టేట్స్ రియల్టీ ఆస్తుల విలువ 24 శాతం, ఎన్‌సీసీ రియల్టీ ఆస్తుల విలువ 141 శాతం పెరిగినట్టు నివేదిక తెలిపింది. మరోవైపు ఎన్‌సీసీ 20,615 మంది ఉద్యోగులతో టాప్ 100 జాబితాలో రెండో స్థానంలో ఉంది. ఇక ఈ సంవత్సరం జాబితాలో ఇద్దరు మహిళలకు స్థానం లభించింది. అందులో హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే తాజ్ జీవీకే అధినేత్రి ఇందిరా కృష్ణారెడ్డి ఒకరు. ఈ ఏడాది మే నాటికి ఆమె రియల్టీ ఆస్తుల విలువ రూ.2,050 కోట్లని హురున్ నివేదిక తెలిపింది. కాగా బెంగళూరు కేంద్రంగా ఉన్న బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్‌కి చెందిన పవిత్ర శంకర్ ఆస్తుల విలువ రూ.29,690 కోట్లుగా ఉంది.

హైదరాబాద్ నుంచి 6 కంపెనీలు

గ్రోహ-హురున్ జాబితాలో హైదరాబాద్ నుంచి 6 కంపెనీలకు చోటు లభించింది. ఈ కంపెనీల మొత్తం విలువ రూ.68,290 కోట్లుగా ఉంది. కాగా ముంబై నుంచి అత్యధికంగా 33 కంపెనీలు ఉండగా వాటి విలువ రూ.6,40,560 కోట్లుగా ఉంది. ఆ తర్వాతి స్థానంలో బెంగళూరు నుంచి 15 కంపెనీలు (రూ.2,13,720 కోట్లు), న్యూఢిల్లీ నుంచి 14 (రూ.87,460 కోట్లు), గురుగ్రామ్ నుంచి 10 (రూ.2,49,320 కోట్లు) కంపెనీలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి.

బ్యాంక్ గ్యారెంటీ నుంచి మినహాయించండి

'డాట్'కు వొడాఫోన్ ఐడియా వేడుకోలు

న్యూఢిల్లీ: వొడాఫోన్ ఐడియా ఆర్థిక కష్టాలు ఇప్పట్లో తీరేలా లేవు. స్పెక్ట్రమ్ పాత బకాయిలు చెల్లించేందుకూ కంపెనీ ఆపసోపాలు పడుతోంది. వచ్చే ఏడాది సెప్టెంబరులో ఇందుకోసం చెల్లించాల్సిన రూ.24,747 కోట్ల మొత్తానికీ బ్యాంకు గ్యారెంటీ నుంచి మినహాయింపు ఇవ్వాలని టెలికాం శాఖ (డాట్)ను కోరింది. స్పెక్ట్రమ్ వేలం నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన బకాయిలకు ఏడాది ముందే టెలికాం కంపెనీలు బ్యాంకు గ్యారెంటీలు సమర్పించాలి. ఈ బకాయిల విషయంలో ప్రభుత్వం ఇప్పటికే వొడాఫోన్ ఐడియాకు నాలుగేళ్ల విరామం ఇచ్చింది. అయినా కంపెనీ ఆర్థిక పరిస్థితి ఇంకా మెరుగుపడలేదు. దీంతో వచ్చే ఏడాది చెల్లించాల్సిన బకాయిలకూ బ్యాంకు హామీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతోంది.

స్వల్ప నష్టాల్లో మార్కెట్

ముంబై: కార్పొరేట్ కంపెనీల తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, ఇన్వెస్టర్ల లాభాల స్వీకారం నేపథ్యంలో గురువారం ఈక్విటీ మార్కెట్లలో నిస్తేజం నెలకొంది. వరుసగా రెండో రోజు కూడా ఈక్విటీ సూచీలు స్వల్పంగా నష్టపోయాయి. సెన్సెక్స్ 27.43 పాయింట్ల నష్టంతో 79,897.34 వద్ద ముగియగా నిఫ్టీ 8.50 పాయింట్ల నష్టంతో 24,315.95 వద్ద ముగిసింది. మార్కెట్‌ను పరుగులు పెట్టించే ఉత్సాహకరమైన వార్తలేవీ లేకపోవడంతో పాటు అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలపై అందరి దృష్టి కేంద్రీకృతం కావడమే మార్కెట్లో నెలకొన్న స్తబ్ధతకు కారణమని విశ్లేషకులంటున్నారు. సెన్సెక్స్ షేర్లలో బజాజ్ ఫైనాన్స్ గరిష్ఠంగా 1.48 శాతం నష్టపోగా మహీంద్రా అండ్ మహీంద్రా, ఎన్‌టీపీసీ, నెస్లే కూడా ఒక శాతానికి పైబడి నష్టపోయాయి. సాధారణ మార్కెట్ ధోరణికి భిన్నంగా బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.57 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.34 శాతం లాభపడ్డాయి.

యాంబీ లాబ్స్ లిస్టింగ్ శుభారంభం: ఎన్ఎస్ఈ ఎస్ఎంఈ ఎక్స్ఛేంజీలో గురువారం లిస్టయిన యాంబీ లాబ్స్ షేరు 30 శాతం లాభంతో రూ.89.25 వద్ద ఎగువ సర్క్యూట్ పరిమితి కన్నా పైన ముగిసింది. ఆరంభంలో ఈ షేరు ఇష్యూ ధర రూ.68పై 25% ప్రీమియంతో రూ.85 వద్ద లిస్టయింది. తొలి రోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి కంపెనీ మార్కెట్ విలువ రూ.222.65 కోట్ల వద్ద స్థిరపడింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,420 ▲	67,300 ▲	1,00,000 ▲
ముంబై	72,563 ▼	66,468 ▼	92,204 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

12వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	555
వరంగల్	532	గోదావరి	555
చిత్తూరు	573	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	105	విజయవాడ	113
వరంగల్	105	గుంటూరు	113
కరీంనగర్	105	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	115
కర్నూలు	105	నెల్లూరు	115
విశాఖపట్నం	105	అనంతపురం	113
గోదావరి	113		

వచ్చే ఏడాదిలో టీవీఎస్ సీఎన్‌జీ స్కూటర్!

న్యూఢిల్లీ: దేశీయ వాహన సంస్థ బజాజ్ ఆటో గత వారంలో సీఎన్‌జీతో నడిచే హైబ్రిడ్ మోటార్ సైకిల్‌ను మార్కెట్లోకి విడుదల చేసిన సంగతి తెలిసిందే. ప్రపంచంలో ఇదే తొలి సీఎన్‌జీ బైక్. కాగా, బజాజ్ ఆటో స్ఫూర్తితో మరో దేశీయ వాహన సంస్థ టీవీఎస్ ప్రపంచంలో తొలి సీఎన్‌జీ స్కూటర్‌ను మార్కెట్లోకి తెచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. టీవీఎస్ తన జూపిటర్ 125 స్కూటర్‌లో సీఎన్‌జీ వెర్షన్‌ను అభివృద్ధి చేసే పనిలో ఉందని, వచ్చే ఏడాదిలో విడుదల చేసే అవకాశాలున్నట్లు సమాచారం.

ఇంధన రంగంలో రూ.8.4 లక్షల కోట్ల పెట్టుబడి అవకాశాలు

న్యూఢిల్లీ: దేశంలో చమురు, సహజ వాయువుల అన్వేషణ పెంచాలని చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి పిలుపు ఇచ్చారు. చమురుపై దిగుమతి ఆధారనీయత తగ్గించుకుని, సరసమైన ధరల్లో ఇంధనాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ఈ చర్య అవసరమన్నారు. ఇంధన, పెట్రోలియం రంగాలు 2030 నాటికి 10 వేల కోట్ల డాలర్ల (రూ.8.4 లక్షల కోట్లు) పెట్టుబడి అవకాశాలు అందుబాటులోకి తెస్తాయని పురి సూచించారు.

సిరిసిల్లకు పవర్‌లూమ్ క్లస్టర్ తీసుకురండి

» ఈ బడ్జెట్‌లో ఇచ్చేలా కేంద్రాన్ని ఒప్పించండి

» సంజయ్‌కి ఎమ్మెల్యే కేటీఆర్ బహిరంగ లేఖ



సిరిసిల్ల/హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీని ఒప్పించి సిరిసిల్లకు మెగా పవర్‌లూం క్లస్టర్‌ను తీసుకొచ్చేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కృషి చేయాలని సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈసారి కేంద్ర బడ్జెట్‌లో పవర్‌లూం క్లస్టర్‌ను ప్రకటించేలా ప్రభుత్వాన్ని ఒప్పించాలని కోరారు. కేంద్రమంత్రిగా సిరిసిల్ల నేతన్నలకు సేవ చేసేందుకు ఇదే సరైన సమయమని గుర్తించాలని కోరారు. గురువారం బండి సంజయ్‌కి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. పదేళ్లుగా కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని, సంజయ్ ఈ ప్రాంత ఎంపీగా ఐదేళ్ల క్రితం నుంచి ఉన్నా.. నేతన్నలకు నిరాశే ఎదురైందని తెలిపారు. సిరిసిల్ల ప్రాంతానికి మెగా పవర్ లూమ్ క్లస్టర్‌ను తీసుకొచ్చేందుకు తాను ఎన్ని ప్రయత్నాలు చేసినా కేంద్రం నుంచి స్పందన లేదని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సిరిసిల్లలో మళ్లీ నేతన్నల ఆత్మహత్యలు మొదలయ్యాయని, ఉపాధి లేక కార్మికులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్రం సిరిసిల్లలో మెగా పవర్‌లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేస్తే ఇక్కడి నేతన్నల కష్టాలు కొంతమేర తీరతాయని, ఆత్మహత్యలు లేని సిరిసిల్లను చూసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

డైరీలో పోలీసుల పేర్లు.. ఎవరినీ వదిలిపెట్టం

అధికారం దక్కించుకోవడం కోసమే నిరుద్యోగ యువత, విద్యార్థులను వాడుకున్న రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి.. ఈ ఇద్దరిలో ఎవరు సన్నాసి..? సమాధానం చెప్పాలని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో బీఆర్ఎస్వీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రోద్బలంతో నిరుద్యోగులు, విద్యార్థి నాయకులు, జర్నలిస్టులపై పోలీసులు చేస్తున్న దాడులను విద్యార్థి నాయకులు తమ డైరీలో నమోదు చేసుకుంటున్నారని, తాము అధికారంలోకి వచ్చాక ఎవరినీ వదిలిపెట్టబోమని కేటీఆర్ హెచ్చరించారు. ఢిల్లీ చుట్టూ రాజకీయ చక్కర్లు కొట్టడంపై ఉన్న శ్రద్ధ.. చిక్కుల్లో కొట్టుమిట్టాడుతున్న హైదరాబాద్‌పై లేకుంటే ఎలాగని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. మహారాష్ట్రలో అదానీ విద్యుత్ సంస్థలపై నిరసన తెలిపే కాంగ్రెస్.. తెలంగాణలో అదానీకి విద్యుత్ సంస్థలను అప్పగించాలని చూస్తోందని ఈ ద్వంద్వ వైఖరి ఎందుకో రాహుల్ వివరించాలని ప్రశ్నించారు.

మీకు ఇన్నాళ్లకు నేతన్నలు గుర్తొచ్చారా..?

» పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారు

» సిరిసిల్లలో ఆత్మహత్యలను ఎందుకు ఆపలేదు

» కేటీఆర్‌కు కేంద్ర మంత్రి సంజయ్ కౌంటర్



హైదరాబాద్/సిరిసిల్ల, జులై 11 (ఆంధ్రజ్యోతి): "ఇన్నాళ్లకు సిరిసిల్ల చేనేత కార్మికులు గుర్తుకొచ్చారా..? పదేళ్ల అధికారంలో కొనసాగిన మీరు ఎందుకు నేతన్నల సమస్యలు పరిష్కరించలేదు..? మీ హయాం నుంచి చేనేత కార్మికుల ఆకలి చావులు కొనసాగుతున్నది నిజం కాదా..?" అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నిలదీశారు. ఈ మేరకు గురువారం కేటీఆర్ రాసిన బహిరంగ లేఖకు సంజయ్ కౌంటర్ ఇచ్చారు. "రాష్ట్రంలో పదేళ్లు మీరే అధికారంలో ఉన్నారు. మీరే డిఫ్యాక్టో సీఎంగా వ్యవహరించారు. 15 ఏళ్లుగా సిరిసిల్లలో మీరే ప్రాతినిధ్యం వహిస్తున్నా.. అక్కడ నేతన్నల ఆకలిచావులు కొనసాగుతూనే ఉన్నాయి. వారి సంక్షేమం కోసం మీరు చేసిందేమిటి..? బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చి బకాయిలు కూడా చెల్లించకుండా పవర్ లూం సంస్థలు మూతపడేలా చేసింది మీరు కాదా..? రాష్ట్రంలోని చేనేత కార్మికుల కోసం ప్రధాని మోదీ వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్‌ను మీ హయాంలోనే ఏర్పాటు చేసిన సంగతి మరచిపోయారా..? రాష్ట్ర పాలకుల వైఫల్యం వల్లే నేడు నేతన్నలు సంక్షోభంలో ఉన్నారని ఒప్పుకున్నందుకు సంతోషం. సిరిసిల్ల నేతన్నలు సంక్షోభం నుండి గట్టెక్కేందుకు నా శాయశక్తులా ప్రయత్నిస్తున్నా" అని సంజయ్.. కేటీఆర్‌కు రాసిన లేఖలో స్పష్టం చేశారు.

టీటీడీ వీరప్పన్ వారసుల చేతిలో ఉండేది

తిరుమల: టీటీడీ గతంలో వీరప్పన్ వారసుల చేతిలో ఉందని, ఇకపై ఎర్రచందనం దొంగలను వదిలే ప్రసక్తి లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. కుటుంబ సభ్యులతో కలిసి గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. గత పాలకులు అక్రమ దందాలతో శ్రీవారి ఆస్తిని కొల్లగొట్టే ప్రయత్నం చేశారని అన్నారు. కాగా, సంజయ్ జన్మదినం సందర్భంగా గురువారం ప్రధాని మోదీ, సీఎం రేవంత్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సంజయ్ నివాసానికి రేవంత్ పుష్పగుచ్ఛం, గ్రీటింగ్స్ పంపించారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, కేంద్ర మంత్రి అమిత్‌షా ఫోన్ చేసి సంజయ్‌కి శుభాకాంక్షలు తెలిపారు.

హైదరాబాద్ అభివృద్ధికి
మీరేం చేశారు?

» కిషన్‌రెడ్డిపై పొన్నం ప్రభాకర్ ఆగ్రహం

» కేటీఆర్ వల్లే భూకబ్జాలని మండిపాటు



హైదరాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్ రెడ్డి పాలనలో హైదరాబాద్ అనాథలా మారిందంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధికి బీజేపీ, కిషన్ రెడ్డి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సర్కారుతో అంటకాగి, కేంద్రం నుంచి సాయం అందించకుండా నిర్లక్ష్యం చేసిన కిషన్ రెడ్డి మాటలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. ఎంపీగా, పర్యాటక శాఖ మంత్రిగా హైదరాబాద్ అభివృద్ధికి కిషన్ రెడ్డి ఎలాంటి పథకాలు మంజూరు చేయలేదని ఆరోపించారు. హైదరాబాద్‌ను స్మార్ట్‌సిటీ చేయలేదని, అమృత్ పథకం నుంచి ఒక్క రూపాయి తేలేదని మండిపడ్డారు. బీజేపీపై ఒత్తిడి తీసుకొచ్చి నిధులు తీసుకురాలేకపోయిన కేటీఆర్ హైదరాబాద్ కోసం మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని పొన్నం విమర్శించారు. హైదరాబాద్‌లో భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలకు కేటీఆరే కారణమని మంత్రి పొన్నం ఆరోపించారు.

24 నుంచి బడ్జెట్ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బండ ప్రకాష్, అసెంబ్లీలో ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, రామచంద్రనాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పార్లమెంటు ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం 'ఓట్-ఆన్-అకౌంట్' బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా ఫిబ్రవరి 10న 'ఓట్-ఆన్-అకౌంట్' బడ్జెట్‌ను తీసుకొచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి మొత్తం రూ.2,75,891 కోట్లతో తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టి, శాసన సభ అనుమతి పొందింది. ఇందులో నాలుగు నెలలు అంటే.. ఏప్రిల్, మే, జూన్, జూలై కోసం రూ.78,911 కోట్ల వ్యయానికి సభ ఆమోద ముద్ర వేసింది. ఆగస్టు 1 నుంచి మళ్లీ వ్యయాలకు చిక్కు వచ్చి పడుతుంది. ఈ దృష్ట్యా పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి, శాసనసభ ఆమోదం పొందాల్సి ఉంది. అందుకే ఈ నెల 24 నుంచి సమావేశాలను ప్రారంభించాలని స్పీకర్ అధ్యక్షతన భేటీలో నిర్ణయించారు. కేంద్రం 23న లోక్‌సభలో 2024-25కు పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. అందులో గ్రాంట్లు, పన్నుల వాటా, కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) కింద వచ్చే నిధులను రాష్ట్రం పరిశీలిస్తుంది. వాటి ఆధారంగా రాష్ట్ర బడ్జెట్‌కు తుది రూపునిచ్చి అసెంబ్లీలో పెట్టనుంది. అనంతరం ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం పొందాలి. ఈ నేపథ్యంలో సమావేశాలను 24న ప్రారంభించి 28న ఆదివారం మినహా 31వ తేదీ వరకు ఏడు రోజుల పాటు కొనసాగించవచ్చని తెలుస్తోంది. ఒకవేళ పొడిగించాలనుకుంటే.. ఈ నెల 31లోపే ద్రవ్య వినిమయ బిల్లుకు సభ ఆమోదం పొందాల్సి ఉంటుంది.

'రైతు భరోసా'పై చర్చ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న 'రైతు భరోసా' పథకంపై ఈ సమావేశాల్లోనే చర్చను చేపట్టనుంది. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి ఆధ్వర్యంలోని క్యాబినెట్ సబ్ కమిటీ బుధవారం నుంచి ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో సదస్సులు నిర్వహిస్తూ.. ఇప్పటికే ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని జాతీయ రహదారుల్లో కోల్పోయిన, ధనవంతుల భూములకు వర్తింపజేసిందని కాంగ్రెస్ సర్కారు ఆరోపిస్తోంది. పైగా.. రైతు భరోసాకు కొత్త విధివిధానాలు తయారు చేస్తామని, అసెంబ్లీలో చర్చకు పెట్టి, సభ్యుల అభిప్రాయాలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు రైతుబంధు కింద కానీ, రైతు భరోసా ద్వారా కానీ అన్నదాతల ఖాతాల్లో డబ్బు జమ చేయలేదు. ఏటా జూన్, జూలై నెలల్లో రైతుబంధు ఇచ్చేవారు. ఇప్పటికే ఆలస్యమై, రైతులు పెట్టుబడి సాయం కోసం చూస్తున్నందున.. తప్పకుండా ఈ సమావేశాల్లోనే రైతు భరోసాపై చర్చ చేపట్టి, అనంతరం విధివిధానాలు రూపొందించాల్సి ఉంటుంది. అందుకే, లఘు చర్చ కింద పథకంపై చర్చను చేపట్టి, సభ్యుల అభిప్రాయాలు తీసుకోనుంది. ఇదే సందర్భంలో రైతు రుణ మాఫీ గురించి కూడా చర్చకు వచ్చే అవకాశాలున్నాయి.



ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్, చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా, సీఎస్ శాంతికుమారి

సమావేశాలకు తగిన ఏర్పాట్లు చేయండి: స్పీకర్

ఈ నెల 24 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతున్నందున... శాసన సభ, శాసన మండలిలో తగిన ఏర్పాట్లు చేయాలని అసెంబ్లీ సెక్రటేరియేట్ అధికారులను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశించారు. ముఖ్యంగా బారికేడ్లు, బందోబస్తు, పార్కింగ్ వంటి ఏర్పాట్లు చేయాలన్నారు. గురువారం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌లు, సీఎస్, డీజీపీలతో తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు.

రాష్ట్ర చిహ్నం.. తెలంగాణ తల్లి విగ్రహంపై..

తెలంగాణ రాష్ట్ర చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహం రూపకల్పనపైనా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చ చేపట్టవచ్చని తెలుస్తోంది. వీటిపై గతంలో సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయంలో నిపుణులతో చర్చించారు. చిహ్నం నుంచి చార్మినార్, కాకతీయ కళా తోరణాన్ని తొలగిస్తారంటూ కథనాలు రావడంతో తీవ్ర వివాదం రేగింది. దాంతో ప్రభుత్వం అప్పట్లో అంశాన్ని వాయిదా వేసింది. అయితే, శాసన సభలో చర్చ చేపట్టి, సభ్యుల అభిప్రాయాలు తీసుకునే అవకాశం ఉంది. ఇవి కాక సర్కారు కొన్ని కీలక బిల్లులను కూడా తీసుకొచ్చి సభ ఆమోదం పొందుతుందని సమాచారం. ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదంటూ ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయంటూ విమర్శిస్తున్నారు. వీటిపై ప్రభుత్వాన్ని అవి గట్టిగా ప్రశ్నించే అవకాశాలున్నాయి.

'కాళేశ్వరం'లో ఆర్థిక అవకతవకలపై నజర్!

» ఆ కోణంలో జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ

» పరిపాలనా అనుమతులు, అంచనాలు తదితర అంశాలపై దృష్టి

» ఒక చార్టర్డ్ అకౌంటెంట్‌ను సమకూర్చండి

» తెలంగాణ, బెంగాల్‌తో సంబంధాల్లేని లాయర్‌ను కూడా

» ప్రభుత్వాన్ని కోరిన కమిషన్

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో బ్యారేజీల వైఫల్యానికి గల కారణాలపై ఇప్పటివరకు విచారణ జరిపిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్.. ఇకపై ఆర్థిక అవకతవకలపైనా దృష్టి సారించనుంది. మూడు బ్యారేజీల నిర్మాణంలో 50 మందికి పైగా సబ్ కాంట్రాక్టర్లు ఉన్నారని, వారిలో కొందరు గత ప్రభుత్వంలోని కీలక ప్రజాప్రతినిధికి బంధువులు కూడా ఉన్నారని కమిషన్ గుర్తించింది. దీంతో బ్యారేజీలకు తొలుత పరిపాలనాపరమైన అనుమతి ఎంత? మధ్యలో ఎన్నిసార్లు అంచనాలను సవరించారు? వాస్తవ వ్యయం ఎంత? సబ్ కాంట్రాక్టర్లకు ఎంతిచ్చారు? మధ్యలో మాయమైనదెంత? అనే కోణంలో విచారణ చేపట్టనున్నారు. ఇందుకుగాను ఒక చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ)ను సమకూర్చాలని కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. విచారణలో క్రాస్ ఎగ్జామినేషన్‌కు వీలుగా తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌తో సంబంధం లేని న్యాయవాదిని కూడా సమకూర్చాలని విజ్ఞప్తి చేసింది. ఇక విచారణ ప్రక్రియలో భాగంగా పంప్‌హౌస్‌ల నిర్మాణ సంస్థకు చెందిన ప్రతినిధులను గురువారం కమిషన్ విచారించింది. పంప్‌హౌస్‌ల నిర్మాణం వల్ల బ్యారేజీలపై ప్రభావం పడిందా? పంప్‌హౌస్‌లను ఎవరి డిజైన్ల ప్రకారం కట్టారు? వంటి అంశాలను ఆరా తీశారు. ప్రభుత్వం అందించిన డిజైన్ల ప్రకారమే పంప్‌హౌస్‌లు కట్టామని నిర్మాణ సంస్థల ప్రతినిధులు వివరించారు. కమిషన్‌కు అందించిన వివరాలన్నీ పొందుపరిచి, అఫిడవిట్లు దాఖలు చేయాలని నిర్మాణ సంస్థల ప్రతినిధులను జస్టిస్ పీసీ ఘోష్ ఆదేశించారు. వర్క్స్ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ ఫణిభూషణ్ శర్మ కూడా కమిషన్ ఎదుట హాజరయ్యారు. మరోవైపు విద్యుత్తు రంగ నిపుణుడు కంచర్ల రఘు ఈ నెల 15న కమిషన్ ముందు హాజరవనున్నారు. ఆయన గత పదేళ్లుగా కాళేశ్వరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాడుతున్న విషయం తెలిసిందే. ప్రాజెక్టులోని లోపాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ రూపంలో వివరించడానికి కమిషన్ ఆయనకు అనుమతి ఇచ్చింది. కేంద్ర జలశక్తి శాఖ మాజీ సలహాదారుడు వెదిరె శ్రీరామ్ కూడా ఈ నెల 16న కమిషన్ ముందు హాజరుకానున్నారు. శుక్రవారం ప్రైవేట్ వ్యక్తులు హాజరుకానున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలను ఎత్తిచూపి.. బ్యారేజీల నిర్మాణం వద్దని వాదించి, నిర్మాణ సంస్థను వీడిన ప్రైవేట్ వ్యక్తి కమిషన్ ముందు బ్యారేజీల వైఫల్యానికి గల కారణాలను వివరించనున్నారు. ఆయన ఎవరనేది శుక్రవారం హాజరైన తర్వాతే తెలియనుంది.

ఇంధన సర్దుబాటు చార్జీలకు నో!

» విద్యుత్తు సంస్థల పిటిషన్లు కొట్టివేసిన ఈఆర్సీ

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంధన సర్దుబాటు చార్జీల (ఎఫ్ఎస్ఏ) వసూలుకు బ్రేక్ పడింది. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి దాకా నాలుగు త్రైమాసికాల్లో ఎఫ్ఎస్ఏ వసూలుకు అనుమతి ఇవ్వాలని ఈ నెల 1న దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్), ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్)లు వేసిన పిటిషన్లకు విచారణార్హత లేదని తెలంగాణ విద్యుత్తు నియంత్రణ మండలి (టీఈఆర్సీ) పేర్కొంది. పిటిషన్లను కొట్టివేస్తూ టీఈఆర్సీ చైర్మన్ టి.శ్రీరంగారావు, సభ్యులు మనోహర్ రాజు, బండారు కృష్ణయ్య గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. దక్షిణ డిస్కమ్ నాలుగు, ఉత్తర డిస్కమ్ నాలుగు పిటిషన్లను వేశాయి. వాస్తవానికి 2023 ఏప్రిల్ 1 నుంచి ఇంధన సర్దుబాటు చార్జీలు వసూలు చేసుకోవడానికి ఈఆర్సీ అనుమతి ఇచ్చింది. అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో గత ప్రభుత్వం చార్జీల వసూలుకు అనుమతివ్వలేదు. దీంతో డిస్కమ్‌లు భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. ఏదైనా ఒక నెలలో ఈఆర్సీ అనుమతించిన దానికన్నా ఎక్కువ ఖర్చయితే ఆ ఖర్చును అదే నెలలో వసూలు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా డిస్కమ్‌లకు ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి (సీఈఆర్సీ) మార్గదర్శకాలు జారీ చేయడంతో దీనికి అనుగుణంగా తెలంగాణ డిస్కమ్‌లు 2023లో పిటిషన్లు వేశాయి. దాంతో ఎఫ్ఎస్ఏ వసూలుకు ఈఆర్సీ అనుమతినిస్తూ ఏడాది కిందటే నిర్ణయం తీసుకుంది. నిర్ణీత వ్యవధిలోపు ఎఫ్ఎస్ఏ చార్జీలను విధించడంలో డిస్కమ్‌లు విఫలమైతే ఆ తర్వాత వసూలు చేసేందుకు ఈఆర్సీ అనుమతి ఇవ్వదు. నెలవారీ ఎఫ్ఎస్ఏ నిబంధనల ప్రకారం డిస్కమ్‌లు లెక్కలు తీసి.. సంబంధిత నెల ముగిసిన 45 రోజుల్లోగా పత్రికల్లో నోటిఫికేషన్ రూపంలో వివరాలు ప్రచురించాల్సి ఉంటుంది. 45 రోజులు దాటితే ఆ నెలకు సంబంధించిన ఎఫ్ఎస్ఏ చార్జీల వసూలుకు అనుమతించరు. ప్రతి త్రైమాసికం ముగిసిన తర్వాత 60 రోజుల్లోగా ఆయా నెలలకు సంబంధించిన ఎఫ్ఎస్ఏ చార్జీల వివరాలను ఈఆర్సీకి అందజేయాలి. వాటిని ఈఆర్సీ క్షుణ్ణంగా పరిశీలించి, ఆమోదముద్ర వేస్తుంది. అయితే ఇవేమీ పాటించకపోవడంతో డిస్కమ్‌ల పిటిషన్లను కొట్టివేస్తూ ఈఆర్సీ నిర్ణయం తీసుకుంది.

ఏఆర్ఆర్‌లోనూ నో చాన్స్

ఏ నెల చార్జీలను ఆ నెలలోనే వసూలు చేసుకోవాల్సి ఉంటుంది. ఏడాది కిందటి వరకు ఎఫ్ఎస్ఏ చార్జీల వసూలుకు ఉత్తర్వులివ్వడానికి ముందు డిస్కమ్‌లు నవంబరు 30లోపు వార్షిక ఆదాయ అవసరాల (ఏఆర్ఆర్) నివేదికను దాఖలు చేసి, ట్రూఅప్ చార్జీల వసూలుకు పిటిషన్లు వేసేవి. ఇంధన సర్దుబాటుకు అవకాశమిచ్చినా వసూలు చేసుకోనందున.. ట్రూఅప్ పిటిషన్లనూ డిస్కమ్‌లు అనుమతించే అవకాశాల్లేవు.


బీఆర్ఎస్ ఓట్ల బదిలీ వల్లే బీజేపీకి సీట్లు

కాంగ్రెస్‌కు 14 సీట్లు వస్తాయని అనుకున్నాం

బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కుతో ఎనిమిదే వచ్చాయి

ఉత్తర తెలంగాణలో హిందూత్వ, మోదీ ప్రభావం

కురియన్ కమిటీకి వెల్లడించిన కాంగ్రెస్ అభ్యర్థులు



కురియన్ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న సీఎం రేవంత్

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఓట్లు.. బీజేపీకి బదిలీ కావడం వల్లే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఆశించిన స్థాయిలో సీట్లు రాలేదని ఏఐసీసీ నియమించిన కురియన్ కమిటీ ఎదుట పార్టీ అభ్యర్థులు స్పష్టం చేశారు. 14 నుంచి 15 సీట్లు వస్తాయనుకున్నామని, ఎన్నికలకు కొన్ని రోజుల ముందు బీజేపీతో బీఆర్ఎస్ కుమ్మక్కు కావడంతో 8 సీట్లకే పరిమితం కావాల్సి వచ్చిందన్నారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటింగ్ ఏ మాత్రం తగ్గలేదని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 39.74 శాతం ఓట్లు వస్తే.. లోక్‌సభ ఎన్నికల్లో 40.1 శాతం ఓట్లు వచ్చాయని గుర్తు చేశారు. తెలంగాణలో ఆశించిన మేర ఎంపీ సీట్లు రాకపోవడంపై నిజనిర్ధారణ కోసం ఏఐసీసీ నియమించిన కురియన్ కమిటీ.. గురువారం గాంధీ భవన్‌లో సమావేశం నిర్వహించింది. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థుల నుంచి అభిప్రాయాలు నమోదు చేసింది. అయితే, కమిటీని కలిసిన వారంతా బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు వల్లే ఓడిపోయామని ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 37.35 శాతం ఓట్లు వస్తే, లోక్‌సభ ఎన్నికల కల్లా అది 16.68 శాతానికి పడిపోయిందని వివరించారు. అదే సమయంలో బీజేపీ ఓట్ల శాతం 14.15 నుంచి 35.08కు పెరిగిందని వెల్లడించారు. బీజేపీ కంటే కాంగ్రెస్‌కు 5శాతం ఎక్కువ ఓట్లు వచ్చినా... బీజేపీతో సమానంగా 8 సీట్లే వచ్చాయని గుర్తు చేశారు. బీజేపీ అభ్యర్థులు గెలిచిన ఏడు చోట్ల బీఆర్ఎస్‌కు డిపాజిట్లు దక్కకపోవడం.. ఆ పార్టీలు కుమ్మక్కు అయ్యాయనడానికి నిదర్శనమన్నారు. కాగా, అసెంబ్లీ ఎన్నికలు బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్టుగా జరగ్గా.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ అన్నట్టుగా నడిచాయని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను రెండో స్థానానికి పరిమితం చేయాలన్న కుట్రతో బీఆర్ఎస్, బీజేపీ కలిసి పని చేశాయని ఆరోపించారు. ఈ మేరకు అభిప్రాయాన్ని కమిటీకి వినిపించినట్లు తెలిపారు.

సీఎం రేవంత్‌ను కలిసిన కురియన్ కమిటీ

కురియన్ కమిటీ సభ్యులు పీజే కురియన్, రఖిబుల్ హుసేన్ గురువారం సీఎం రేవంత్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి.. వారికి శాలువా కప్పి సన్మానించారు.

ఆధార్ నెట్‌వర్క్‌లో లోపాలు..
రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిన రిజిస్ట్రేషన్లు

» ఆయా కార్యాలయాల వద్ద వినియోగదారుల పడిగాపులు

హైదరాబాద్/ఘట్‌కేసర్/చేవెళ్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆధార్ ఆన్‌లైన్ నెట్‌వర్క్‌లో లోపాలతో.. గురువారం రాష్ట్రవ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. రాష్ట్రంలో భూములు/స్థిరాస్తులు, డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌కు ఆధార్ బయోమెట్రిక్ తప్పనిసరి. యూఐడీఏఐ నెట్‌వర్క్‌లో తలెత్తిన సాంకేతిక లోపాల కారణంగా.. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు సిద్ధంగా ఉన్నా.. బయోమెట్రిక్ అథెంటికేషన్ లేకపోవడంతో ప్రక్రియ నిలిచిపోయిందని అధికారులు తెలిపారు. ఆధార్ ఆధారిత ఓటీపీ సేవలు నిలిచిపోవడంతో ఈ సమస్య తలెత్తిందని.. తహసీల్దార్, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వినియోగదారులు ఇబ్బందులను ఎదుర్కొన్నారని వివరించారు. ఒక్కో రిజిస్ట్రేషన్‌కు ఇరువైపులా(అమ్మకం/కొనుగోలుదారులు, సాక్ష్యులు) పది మంది వరకు ఉంటారు. వీరంతా ఆధార్ బయోమెట్రిక్ పనిచేయక.. రోజంతా పడిగాపులుకాచారని పేర్కొన్నారు. కాగా.. రోజుకు సగటున ఏడు వేలకు పైగా డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఆధార్ నెట్‌వర్క్‌లో సాంకేతిక సమస్యల కారణంగా.. రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోయాయని స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ జ్యోతి బుద్ధప్రకాశ్ వెల్లడించారు. గురువారం నిలిచిపోయిన సేవలను శుక్రవారానికి రీషెడ్యూల్ చేసినట్లు తెలిపారు.

ఆరు రోజులుగా నిలిచిన ట్యాక్స్ వసూళ్లు

మునిసిపాలిటీల్లో ఆరు రోజులుగా వివిధ రకాల ట్యాక్స్‌ల వసూళ్లు నిలిచిపోయాయి. వివిధ రకాల పన్నుల వసూళ్లకు ఉపయోగించే పోస్ యంత్రాలు పనిచేయకపోవడమే ఇందుకు కారణమని అధికారులు వివరించారు. సాఫ్ట్‌వేర్ లోపాలతో ఈ పరిస్థితి తలెత్తిందని వెల్లడించారు.

ఆగస్టు నాటికి వైటీపీఎస్‌లో విద్యుదుత్పత్తి

» జెన్‌కో సీఎండీ రొనాల్డ్‌రోస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి), దామరచర్ల, జూలై 11: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్)లో ఆగస్టు నెలాఖరుకు విద్యుదుత్పత్తి ప్రారంభించనున్నట్లు ఇంధన శాఖ కార్యదర్శి, జెన్‌కో/ట్రాన్స్‌కో సీఎండీ రొనాల్డ్‌రోస్ తెలిపారు. గురువారం యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జెన్‌కో, బీహెచ్‌ఈఎల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, నిర్ణీత వ్యవధిలోగా ఉత్పత్తి ప్రారంభం కావాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు 25న ఒక యూనిట్, సెప్టెంబరు 25న మరో యూనిట్... మొత్తం రెండు యూనిట్లతో 1,600 మెగావాట్ల విద్యుత్‌ను మొదటి దశలో ప్రారంభించేలా పనులు చేపట్టాలని ఆదేశించారు.

3 కార్పొరేషన్లకు ఛైర్మన్ల బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్‌గా మానాల మోహన్, బీసీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నూతి శ్రీకాంత్‌గౌడ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్‌గా రాయల నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయా కార్పొరేషన్ల కార్యాలయాల్లో వేర్వేరుగా ఈ కార్యక్రమాలు జరిగాయి. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు నూతన ఛైర్మన్లకు అభినందనలు తెలిపారు.

గిరిజన శాఖలో పదోన్నతులకు లైన్ క్లియర్

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఇందుకు సంబంధించి షెడ్యూలును విడుదల చేసింది. ఈమేరకు గురువారం జీవో నెంబర్ 17ను జారీ చేసింది. దీంతో గిరిజన శాఖ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,600పై చిలుకు గిరిజన ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులతో పాటు ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న 3,700 మంది ఉపాధ్యాయులకు బదిలీ, పదోన్నతులు లభించనున్నాయి. ఇందుకోసం ఆన్‌లైన్ దరఖాస్తులు వెబ్ కౌన్సెలింగ్ సదుపాయాన్ని కూడా కల్పించారు. శుక్రవారం నుంచే పదోన్నలు, బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుందని గిరిజన సంక్షేమ గురువారం మీడియా ప్రకటనలో తెలిపింది.

పౌర సేవా కేంద్రాల్లో గృహజ్యోతి సవరణలు

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్తును పొందుతున్న వారు తాము ఇల్లు మారినప్పుడు.. రేషన్ కార్డు, యూనిక్ సర్వీస్ నంబర్ అనుసంధానంలో లోపాల వల్ల పథకం ప్రయోజనాలు పొందలేని వారు వివరాలు సవరించుకునే అవకాశాన్ని విద్యుత్తు సంస్థలు కల్పిస్తున్నాయి. ఈ మేరకు డిస్కమ్‌లు, పురపాలక సంస్థలకు చెందిన పౌరసేవా కేంద్రాల్లో (సిటిజన్ సర్వీస్ సెంటర్) వివరాల నవీకరణకు అవకాశం కల్పించారు. ఈ పథకం కింద ఇప్పటిదాకా లబ్ధిపొందని వారు రేషన్ కార్డు కలిగి ఉంటే ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని డిస్కమ్‌లు తెలిపాయి. కాగా గురువారం నల్గొండ రూరల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉన్న సిటిజన్ సర్వీస్ సెంటర్‌ను దక్షిణ డిస్కమ్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ పరిశీలించారు. గృహజ్యోతి వివరాల సవరణల కోసం పౌరసేవా కేంద్రాలను సందర్శించాలని ఆయన కోరారు.

తప్పులతడకగా సీనియారిటీ జాబితాలు

» ప్రజారోగ్య డైరెక్టరేట్ ఎదుట సిబ్బంది ఆందోళన

మంగళ్‌హట్, హైదరాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖలో సాధారణ బదిలీలకు సంబంధించి కేడర్ల వారీగా తయారు చేసిన సీనియారిటీ జాబితాలు తప్పులతడకగా ఉన్నాయంటూ ఆరోగ్య సిబ్బంది కోఠిలోని ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. జాబితాలను తయారు చేసేటప్పుడు ఒక విధానాన్ని, పద్ధతిని పాటించలేదని వారు ఆరోపించారు. తద్వారా సీనియర్లకు అన్యాయం జరుగుతోందని, కోరుకున్న చోటికి బదిలీ అయ్యే అవకాశాలు లేకుండా పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో నంబరు 18ను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రమాణాలు పాటించని 'ఎమరాల్డ్'

» మరుగుదొడ్డి పక్కనే తినుబండారాల నిల్వ

» తనిఖీలో గుర్తించిన జీహెచ్‌ఎంసీ అధికారులు

కవాడిగూడ, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఎమరాల్డ్ మిఠాయి దుకాణంలో జీహెచ్‌ఎంసీ ఆహార భద్రతా విభాగం అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. సేంద్రియ ఉత్పత్తులతో స్వీట్లు తయారుచేసి విక్రయిస్తామంటున్న ఎమరాల్డ్ నిర్వాహకులు ప్రమాణాలు పాటించడం లేదని అధికారులు తెలిపారు. ఇందిరా పార్కు వద్ద ఉన్న ఈ దుకాణంలో వంటశాల అపరిశుభ్రంగా ఉందని, మరుగుదొడ్డి పక్కనే తినుబండారాలు నిల్వ చేశారన్నారు. నాణ్యత లేని బెల్లం వాడుతున్నారని, జీడిపప్పు, ముడి పదార్థాలు, వాటర్ క్యాన్లకు కాల వ్యవధి సూచించే లేబుళ్లు లేవని తెలిపారు. స్వీట్ల తయారీలో పరిమితికి మించి రంగులు వాడుతున్నారని చెప్పారు. సిబ్బందికి మెడికల్ సర్టిఫికెట్లు లేవన్నారు. గాలి వెలుతురు సరిగా లేవన్నారు. వివిధ నమూనాలు సేకరించి పరీక్షలకు ల్యాబ్‌కు పంపారు. కాగా, ఈ దుకాణానికి అనుమతి రద్దు చేయాలని అధికారులు భావించినా ఉన్నతస్థాయి ఒత్తిళ్లతో నిర్ణయం మార్చుకున్నట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం లైసెన్స్ లేకపోయినా ఆన్‌లైన్‌లో సవరణ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్టు సమాచారం. ఈ తతంగంలో ఆహార భద్రతా విభాగం ఉన్నతాధికారి ఒకరు కీలకంగా వ్యవహరించినట్టు ప్రచారం జరుగుతోంది.

ఆస్పత్రుల్లో ప్రమాణాల పెంపునకు కమిటీలు

» త్వరలో ఏర్పాటు చేస్తాం: మంత్రి దామోదర

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్య సేవల నాణ్యతా ప్రమాణాలు, విశ్వసనీయతను పెంచడం, మెరుగైన వైద్య సేవలను అందించడంపై వేర్వేరుగా కమిటీలను త్వరలో ఏర్పాటు చేస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలతో గురువారం సచివాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ సక్రమంగా అమలయ్యేలా కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు సహకరించాలన్నారు. హైదరాబాద్‌ను మెడికల్ టూరిజం హబ్‌గా మార్చడంలో భాగస్వాములు కావాలన్నారు. కొన్ని కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు వైద్యం పేరుతో వ్యాపారాలు చేస్తున్నాయని ఆక్షేపించారు. ఆరోగ్యశ్రీ పథకం ప్యాకేజీలను త్వరలోనే ప్రభుత్వం సవరించనుందని చెప్పారు.

ఆగస్టులో అమెరికాకు సీఎం రేవంత్



హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పెట్టుబడుల సమీకరణ నిమిత్తం సీఎం రేవంత్ రెడ్డి ఆగస్టులో అమెరికా, దక్షిణ కొరియా దేశాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆ దేశాల్లోని పలు సంస్థల అధినేతలతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. తెలంగాణలో ఉన్న అవకాశాలను వారికి వివరించి భారీగా పెట్టుబడులను సమీకరించే అవకాశం ఉందని తెలిసింది. విదేశీ పర్యటనకు సీఎంతోపాటు పరిశ్రమలు, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారులు వెళ్లనున్నారు. సీఎం నేతృత్వంలోని బృందం ఆగస్టు 4 నుంచి 9వ తేదీ మధ్య అమెరికాలో పర్యటించనుంది. న్యూయార్క్, డల్లాస్, శాన్‌ఫ్రాన్సిస్‌కో, న్యూజెర్సీ ప్రాంతాల్లో ప్రముఖ వ్యాపార వేత్తలతో సీఎం సమావేశం అవుతారు. లైఫ్ సైన్స్, ఎలక్ట్రికల్ వాహనాల తయారీ సంస్థలు, టెక్నాలజీ రంగంలో ఉండే వ్యాపారుల నుంచి తెలంగాణకు పెట్టుబడులు తీసుకొచ్చేలా ఈ సమావేశాలు నిర్వహించనున్నారు. అనంతరం దక్షిణ కొరియా పర్యటనలోనూ ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్, లైఫ్‌సైన్స్, ఎలక్ట్రానిక్ వాహనాల తయారీ సంస్థలకు చెందిన ఉన్నత స్థాయి అధికారులతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు.

రూ.500 కోట్లతో మైక్రోలింక్ పరిశ్రమ

» తెలంగాణలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రం: దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన టెలి కమ్యూనికేషన్ దిగ్గజం మైక్రోలింక్ నెట్‌వర్క్ రూ.500 కోట్ల పెట్టుబడితో తెలంగాణలో తమ ఎలక్ట్రానిక్, ఇతర ఉత్పత్తుల కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ భాగస్వామ్యంతో మైక్రోలింక్ పరిశ్రమల క్లస్టర్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. మైక్రోలింక్ గ్లోబల్ ప్రతినిధులు, పీఎస్ఆర్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ శ్రీరంగారావు నేతృత్వంలో గురువారం సచివాలయంలో మంత్రితో సమావేశం అయ్యారు. రాబోయే మూడేళ్లలో రూ.500 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసే ఈ సంస్థ నుంచి ఎలక్ట్రానిక్, ఐటీ, నిర్మాణ రంగ పరికరాలు ఉత్పత్తి అవుతాయని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. సుమారు 700 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. ఇటీవల అమెరికా పర్యటనలో మైక్రోలింక్ యాజమాన్యంతో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయని మంత్రి పేర్కొన్నారు. డేటా ట్రాన్స్ మిషన్, నెట్‌వర్కింగ్ కేబుల్స్, ఐవోటీ, మల్టీలెవల్ పార్కింగ్ విభాగాల ఉత్పత్తిలో మైక్రోలింక్ నెట్‌వర్క్ గ్లోబల్ లీడర్‌గా ఉందని చెప్పారు. తెలంగాణలో నైపుణ్యం ఉన్న సిబ్బందికి కొరత లేదని ఆయన వెల్లడించారు.

ఖజానా నిండాల్సిందే!

(మొదటిపేజీ తరువాయి)

దిశానిర్దేశం చేశారు. గురువారం సచివాలయంలో వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, మైనింగ్, రవాణా విభాగాల అధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి , రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సీఎస్ శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. నిర్దేశించుకున్న వార్షిక లక్ష్యంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్ వరకు వచ్చిన ఆదాయం ఆశాజనకంగా లేదన్నారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో పొందుపర్చిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే నెలవారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని, ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ఆదేశించారు. ఇకపై ప్రతి నెలా మొదటి వారంలో నిర్ణీత ఆదాయ లక్ష్యాలపై తాను సమీక్ష నిర్వహిస్తానన్నారు. ఆర్థిక మంత్రి భట్టి ప్రతి శుక్రవారం సంబంధిత శాఖల లక్ష్య సాధన పురోగతిపై సమావేశమవుతారని చెప్పారు.

జీఎస్టీని పెంచుకునే చర్యలు చేపట్టండి

ప్రధానంగా రాష్ట్రానికి ఎక్కువ ఆదాయాన్ని తెచ్చిపెట్టే వస్తు సేవల పన్ను (జీఎస్టీ) రాబడిని పెంచుకునే చర్యలు వెంటనే చేపట్టాలని సీఎం రేవంత్ సూచించారు. జీఎస్టీ ఆదాయాన్ని పెంచేందుకు వాణిజ్య పన్నుల శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని, పక్కాగా ఆడిటింగ్ చేయాలని ఆదేశించారు. జీఎస్టీ చెల్లింపుల విషయంలో ఎవరినీ ఉపేక్షించకుండా పన్నులు వసూలు చేయాలని చెప్పారు. పెట్రోలు, డీజిల్‌పై వ్యాట్ ద్వారా వచ్చే ఆదాయం తగ్గిందని, ప్రత్యామ్నాయంగా విమాన ఇంధనంపై ఉన్న పన్నును సవరించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఎన్నికలప్పుడు మద్యం విక్రయాలు ఎక్కువగా జరిగినప్పటికీ అంతమేర ఆదాయం పెరగకపోవడానికి కారణం ఏంటని సీఎం ప్రశ్నించారు. అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేయాలని, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అరికడితే ఆదాయం పెరిగే అవకాశం ఉందన్న చర్చ జరిగింది. డిస్టిలరీల నుంచి మద్యం అడ్డదారి పట్టకుండా నిఘా పెట్టాలని, అందుకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని సీఎం ఆదేశించారు. రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడిందని సమావేశంలో చర్చ జరిగింది. ఈ ఆరు నెలల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో వాణిజ్య నిర్మాణాలు పెరిగాయని, గృహ నిర్మాణాలు కూడా పుంజుకుంటాయని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇప్పటికే రాష్ట్రంలో భూములు, స్థిరాస్తుల ధరలు భారీగా పెరిగాయని, అదే స్థాయిలో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం పెరిగేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇసుక, ఖనిజ వనరుల ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను, లీకేజీలను అరికట్టాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించేందుకు పరిమిత కాలం పన్ను సబ్సిడీ అమలైందని, తిరిగి పన్ను వసూలు చేయడం ద్వారా వాహనాల అమ్మకాలపై ప్రభావం పడిందా అన్న విషయమై అధ్యయనం చేయాలని సీఎం సూచించారు.



సచివాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, జూపల్లి

కలెక్టర్లు, ఎస్పీలతో త్వరలో సీఎం సమావేశం!

రాష్ట్ర ప్రభుత్వ ప్రాధామ్యాలతో పాటు పథకాల అమలుకు సంబంధించి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో పాటు ప్రభుత్వ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సీఎం రేవంత్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు కొద్ది రోజుల్లోనే అధికారులతో సమావేశమవ్వాలని ఆయన నిర్ణయించినట్లు సమాచారం. ప్రస్తుతం క్షేత్ర స్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకు అధికారుల బదిలీలు దాదాపు పూర్తవ్వడంతో ఇటు రాష్ట్రస్థాయితో పాటు అటు జిల్లాలకు కొత్త కలెక్టర్లు, ఎస్పీలు వచ్చారు. ఈ నేపథ్యంలో తమ ప్రభుత్వ ఉద్దేశాలు, ప్రజల సమస్యల పరిష్కారాలకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు రాష్ట్ర అభివృద్ధికి అవలంబించాల్సిన అంశాలపై అధికారులతో లోతుగా చర్చించనున్నట్లు తెలిసింది. పాలనాపరమైన అంశాలపైనా అధికారులకు దిశా నిర్దేశం చేయనున్నారు. అన్ని ప్రభుత్వ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో రాష్ట్ర బడ్జెట్‌పై మాట్లాడనున్నట్లు తెలిసింది. స్థానిక ఎన్నికల నిర్వహణ, అందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చించనున్నట్లు తెలిసింది. ఈ సమావేశాన్ని ఆన్‌లైన్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తారా? లేదా అధికారులను హైదరాబాద్‌కు పిలిపిస్తారా? అన్నదానిపై స్పష్టతరావాల్సి ఉంది.

ఓయూలో మళ్లీ 'వన్‌టైమ్ చాన్స్'

» 2000-2019 మధ్య బ్యాక్‌లాగ్స్ క్లియర్ చేసేందుకు అవకాశం

హైదరాబాద్ సిటీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నిర్ణీత గడువులోగా బ్యాక్‌లాగ్స్ క్లియర్ చేయలేక మరోసారి రీఅడ్మిషన్ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని దిగులు పడుతున్న పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు శుభవార్త. ఉస్మానియా యూనివర్సిటీతోపాటు అనుబంధ కాలేజీల్లో పీజీ చదివి సకాలంలో బ్యాక్‌లాగ్స్ క్లియర్ చేసుకోలేని విద్యార్థులు మరోసారి పరీక్షా రాసుకోవచ్చు. ఓయూ స్టాండింగ్ కమిటీ నిర్ణయం మేరకు 2000-2001 నుంచి 2018-19 మధ్య వివిధ విద్యా సంవత్సరాల్లో చదివిన విద్యార్థులు బ్యాక్‌లాగ్స్‌ను క్లియర్ చేసుకోవడానికి 'వన్ టైమ్ చాన్స్'ను తీసుకొచ్చారు. దీని ద్వారా ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంఎస్ డబ్ల్యూ, ఎంఎల్ఐఎస్సీ, బీఎల్ఐఎస్సీ, ఎంసీజే కోర్సుల మొదటి, రెండో, మూడో, నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్స్ క్లియర్ చేసుకునే అవకాశం కల్పించారు. ఆగస్టు 16వతేదీ వరకు వన్ టైమ్ చాన్స్ పరీక్షలకు ఫీజు చెల్లించేందుకు గడువిచ్చారు. రూ.500 జరిమానాతో ఆగస్టు 28వరకు ఫీజు చెల్లించవచ్చు. వన్ టైమ్ చాన్స్ రుసుము, పరీక్ష ఫీజుతోపాటు గతంలో హాల్‌టికెట్, మార్కుల మెమోల కాపీలను జతపర్చాలని విద్యార్థులకు సూచించారు. వివరాలకు వర్సిటీ ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో సంప్రదించాలని, వివరాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు అధికారులు తెలిపారు. ఓయూకు అనుబంధంగా రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పీజీ కాలేజీల విద్యార్థులతోపాటు ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో నాడు ఓయూ అనుబంధంగా కొనసాగిన ప్రైవేటు, ప్రభుత్వ పీజీ కాలేజీల్లో చదివిన విద్యార్థులకు తాజా నిర్ణయం ఊరటనివ్వనుంది. వన్ టైమ్ చాన్స్‌పై విద్యార్థులు పలుమార్లు వర్సిటీ అధికారుల దృష్టికి తేవడంతో నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. వన్ టైమ్ చాన్స్‌తో వేలాది మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని వర్సిటీ అధికారి ఒకరు తెలిపారు.

టీజీఐఐసీ ఛైర్‌పర్సన్‌గా నిర్మలా జగ్గారెడ్డి బాధ్యతల స్వీకరణ

పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో సంతకం

అభినందించిన మంత్రులు ఉత్తమ్, పొన్నం, నాయకులు



మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో టీజీఐఐసీ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నిర్మలా జగ్గారెడ్డి

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): టీజీఐఐసీ ఛైర్‌పర్సన్‌గా తూర్పు నిర్మలా జగ్గారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. బషీర్‌బాగ్‌లోని ఐఐసీ భవన్‌కు గురువారం వచ్చిన ఆమె తన చాంబర్‌లో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో బాధ్యతల స్వీకరణ పత్రంపై సంతకం చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు ఆమెను అభినందించారు. వేద పండితుల ఆశీర్వచనాలు, సంగారెడ్డి నుంచి తరలి వచ్చిన నేతలు, కార్యకర్తలు, కుటుంబ సభ్యుల అభినందనల మధ్య నిర్మలా జగ్గారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జెట్టి కుసుమ్‌కుమార్ తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు.



నిర్మలా జగ్గారెడ్డిని అభినందిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్

అత్యుత్తమ సాంకేతికతతో అంకుర ఆస్పత్రి సేవలు

» మహిళలు, శిశువులకు ప్రపంచ స్థాయి వైద్యం

» అంకుర హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణప్రసాద్

» కూకట్‌పల్లిలో 120 పడకలతో నూతన ఆస్పత్రి ఏర్పాటు

» భవనాన్ని ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహ



కూకట్‌పల్లిలో అంకుర ఆస్పత్రి నూతన భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటలైజ్డ్ వైద్య సేవల కేంద్రంగా అంకుర ఆస్పత్రిని తీర్చిదిద్దినట్లు అంకుర హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ ప్రసాద్ పున్నం తెలిపారు. మహిళలు, శిశువులకు ప్రపంచ స్థాయిలో అత్యుత్తమ వైద్యసేవలు అందించాలన్న ఉద్దేశంతో కూకట్‌పల్లిలో 120 పడకలతో కొత్త ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. కూకట్‌పల్లిలో అంకుర హాస్పిటల్స్ నూతన భవన సముదాయాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం ప్రారంభించారు. అంకుర ఆస్పత్రిలో మహిళలు, శిశువులకు అందిస్తున్న అధునాతన సేవల గురించి అడిగి తెలుసుకుని, నిర్వాహకులను అభినందించారు. అనంతరం అంకుర హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణప్రసాద్ పున్నం మాట్లాడుతూ అంకుర, 9ఎం బై అంకురతో కలిపి తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, ఒడిశాలో 14 ప్రపంచ స్థాయి ఆస్పత్రులను నెలకొల్పినట్లు చెప్పారు. 2011లో కేపీహెచ్‌బీలో ప్రారంభమైన నాటి నుంచి అంకుర ఆస్పత్రిలో మహిళలు, పిల్లలకు లెవెల్ 3 ఎన్ఐసీయూ, పీఐసీయూ, ఆధునిక, సౌకర్యవంతమైన బర్తింగ్ సూట్‌లు, 24 గంటల అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అంబులెన్స్ సేవలు, పీడియాట్రిక్, రుమటాలజీ, ఇమ్యునాలజీ, గ్యాస్ట్రోఎంట్రాలజీ, హెమటాలజీ, ఆర్థోపెడిక్స్, ఎండోక్రినాలజీ వంటి అరుదైన స్పెషాలిటీస్ కవర్ చేసే వివిధ సూపర్ స్పెషలిస్టుల బృందం తమ వద్ద ఉన్నట్లు పేర్కొన్నారు. పీడియాట్రిక్ సర్జరీ, పీడియాట్రిక్ యూరాలజీలో అత్యధిక విజయాలు సాధించడంలో అంకుర ప్రత్యేక గుర్తింపు పొందిందని వెల్లడించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఏపీ ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, కార్పొరేటర్ మాధవరం రోజాదేవి పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీకి 2,200 కోట్లు

గ్రీన్‌చానెల్ ద్వారా సమకూరుస్తాం

» నాపై కోపంతోనే కేసీఆర్ నల్లగొండ అభివృద్ధిని అడ్డుకున్నారు: కోమటిరెడ్డి



తిప్పర్తి/హైదరాబాద్ సిటీ/ఖైరతాబాద్, జూలై 11: శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగ మార్గం తవ్వకం పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు గ్రీన్ చానెల్ ద్వారా రూ.2,200 కోట్ల నిధులు సమకూరుస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం నల్లగొండ జిల్లా తిప్పర్తితోపాటు, శిలార్‌మియాగూడెంలో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూనే.. నల్లగొండను అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుపుతామన్నారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. తనపై ఉన్న కోపంతోనే కేసీఆర్ ఆనాడు నల్లగొండ అభివృద్ధిని అడ్డుకున్నారన్నారు. సీఎం రేవంత్ ఒక సోదరుడిలా కొడంగల్ తర్వాత నల్లగొండకే అధిక నిధులిస్తున్నారని వ్యాఖ్యానించారు.

ఇంజనీర్లు ఆత్మవిమర్శ చేసుకోవాలి

కొద్దిపాటి సాంకేతికత ఉన్న రోజుల్లో నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు ఇప్పటికీ చెక్కు చెదరలేదని, రెండు, మూడేళ్ల కింద కట్టిన ప్రాజెక్టులు నెర్రెలు బారుతున్న ఘటనలు చూస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. దీనిపై ఇంజనీర్లు ఆత్మవిమర్శ చేసుకోవాలని అన్నారు. ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ కార్యాలయంలో తెలంగాణ సాగునీటి రంగ పితామహుడు నవాబ్‌అలీ నవాజ్ జంగ్ బహదూర్ జయంతి సందర్భంగా ఇంజనీర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విశిష్ట సేవలందించిన పీజీ శాస్త్రి, ఎస్.చంద్రమౌళి, ఎస్.జశ్వంత్ కుమార్, ఎంఏ కరీం లకు నవాజ్ జంగ్ పేరిట జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. మంత్రి మాట్లాడుతూ.. రీజినల్ రింగ్ రోడ్డుతో నగర ముఖ చిత్రాన్ని మార్చనున్నామని, మూసీని ఆధునీకరించి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దనున్నామని చెప్పారు. ఇంజనీర్స్ భవన్‌కు స్థలం కేటాయించమని ఇంజనీర్లు కోరగా.. సీఎంతో చర్చించి ఎకరా స్థలం కేటాయించేలా చూస్తామని హామీనిచ్చారు.

'బోనాల జాతర' పాటను ఆవిష్కరించిన పొన్నం, జూపల్లి

హైదరాబాద్, జూలై 11(ఆంధ్రజ్యోతి): బోనాల జాతర పాటను, పోస్టర్‌ను మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావులు ఆవిష్కరించారు. ఆషాఢ బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక, దేవాదాయశాఖ ఆధ్వర్యంలో సుపథ క్రియేషన్స్ రూపొందించిన ఈ పాటను డా బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో వారు విడుదల చేశారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపంగా బోనాల పాటను రూపొందించిన సుపథ క్రియేషన్స్ బృందానికి మంత్రులు అభినందనలు తెలిపారు. అనంతరం పాటకు సహకారం అందించిన కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి వాణి ప్రసాద్, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. కాగా, బోనాల పాటకు ఎం.ఎం. శ్రీలేఖ సంగీతం, తంగేళ్ల శ్రీదేవిరెడ్డి సాహిత్యం అందించారు. చేతన్‌కత్తి దర్శకత్వంలో కీర్తన శర్మ ఈ పాట పాడగా నాగదుర్గ కొరియోగ్రఫీ చేశారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో హెచ్ఎం సహా 10 మందిపై పోక్సో కేసు

బాన్సువాడ, జూలై 11: విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఓ ప్రధానోపాధ్యాయుడు విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలో జరిగింది. దేశాయిపేట్ జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం నరేందర్ ఈ దుశ్చర్యకు తెగబడ్డారు. హెచ్ఎంతో పాటు ఈ వ్యవహారంలో రాజీ యత్నాలకు సహకరించిన నలుగురు ఉపాధ్యాయులు, ఓ పోలీసు సహా తొమ్మిది మందిపై పోక్సో చట్టం కింద కేసు నమోదయింది. ఈ క్రమంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం సదరు పాఠశాలను బాన్సువాడ ఎంఈవో నాగేశ్వర్‌రావు సందర్శించారు. పాఠశాలలోని మరో అయిదుగురు విద్యార్థినులను కూడా హెచ్ఎం నరేందర్ ఇదే తరహాలో వేధించినట్లు ఎంఈవోకు ఫిర్యాదులు అందాయి.

బాలికపై లైంగికదాడికి పాల్పడ్డ వ్యక్తికి 20ఏళ్ల జైలు

మేడ్చల్ టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఓ యువకుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ మేడ్చల్ రెండో అడిషనల్ జిల్లా జడ్జి అండ్ ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. ఇందుకు సంబంధించి అదనపు పీపీ శ్యామ్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. 2017 మార్చి 18న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధి దేవరయంజాల్‌లో ఒంటరిగా ఉన్న ఓ 8 ఏళ్ల బాలిక ఇంట్లోకి సాయికుమార్ అనే యువకుడు మంచి నీళ్ల కోసమంటూ చొరబడి లైంగికదాడి చేశాడు. ఈ కేసును న్యాయవిచారణ చేసిన జడ్జి జె.జీవన్‌కుమార్.. నిందితుడికి 20ఏళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

నలుగురు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు

» అశ్వారావుపేట ఎస్సై ఆత్మహత్య కేసులో..

అశ్వారావుపేట, జూలై 11: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను ఆత్మహత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు కానిస్టేబుళ్లపై గురువారం సస్పెన్షన్ వేటు పడింది. జూన్ 30వ తేదీన ఎస్సై శ్రీను కలుపు నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అంతకుముందు తన మరణ వాంగ్మూలంలో అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డి, నలుగురు కానిస్టేబుళ్లు తనను వేధింపులకు గురిచేశారని, వారే తన ఆత్మహత్యకు కారణమని చెప్పారు. ఈ నేపథ్యంలోనే కానిస్టేబుళ్లు శివ, సుభానీ, సన్యాసినాయుడు, శేఖర్‌లను సస్పెండ్ చేస్తూ భద్రాద్రి ఎస్పీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

గురుకుల విద్యార్థినులపై ఎలుకల దాడి

» మూడు రోజులుగా ఆస్పత్రిలో చికిత్స

రామాయంపేట, జూలై 11: మెదక్ జిల్లా రామాయంపేట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఎలుకలు వీరంగం సృష్టించాయి. మూడు రోజుల వ్యవధిలో 9వ తరగతి చదివే తొమ్మిది మంది విద్యార్థినులపై దాడి చేసి కొరికాయి. బాలికలు గాయపడడంతో రెసిడెన్షియల్ సిబ్బంది స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వారికి మూడు రోజులుగా చికిత్సలు చేయిస్తున్నారు. గురువారం తమ పిల్లల బాగోగులు చూసేందుకు వచ్చిన తల్లిదండ్రులకు బాలికలు విషయం తెలుపటంతో ఘటన వెలుగులోకి వచ్చింది. గురుకులంలో 610 మంది విద్యార్థినులు ఉంటుండగా, తొమ్మిదో తరగతి బీ సెక్షన్ చదివే వారంతా ఒకే గదిలో ఉంటున్నారు. ఆ ఒక్క గదిలోని బాలికలపైనే ఎలుకలు దాడి చేశాయి. తాము నిద్రించే సమయంలో ఎలుకలు తమ పాదాలపై దాడి చేసి కొరికాయని బాలికలు తెలిపారు. విషయం తెలుసుకుని రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రాజు గురుకులానికి వచ్చి విచారణ చేపట్టారు.

యూ ట్యూబర్ ప్రణీత్‌కు 14 రోజుల రిమాండ్

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తండ్రీ, కుమార్తె బంధంపై సోషల్ మీడియాలో అసభ్య, అశ్లీల సంభాషణ చేసిన యూ ట్యూబర్ ప్రణీత్ హనుమంతుకు హైదరాబాద్ నాంపల్లి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు అధికారులు ప్రణీత్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. బెంగళూరులో హనుమంతును అదుపులోకి తీసుకున్న పోలీసులు గురువారం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం న్యాయమూర్తి ప్రణీత్‌కు 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. కాగా, ఈ కేసులో ప్రణీత్ హనుమంతుతో పాటు నాగేశ్వర్ రావు, ఆదినారాయణ, యువరాజ్‌ను సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు నిందితులుగా చేర్చారు.

ఉద్యోగుల వినతులపై సబ్ కమిటీ సానుకూలం..

» దరఖాస్తులను పరిశీలించాలని ఆయా శాఖలకు మంత్రుల ఆదేశాలు

జీవో 317పై ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ ఉద్యోగుల వినతులపై సానుకూలంగా స్పందించింది. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ నేతృత్వంలోని సబ్ కమిటీ గురువారం సమావేశమైంది. పలు కీలక నిర్ణయాలను కమిటీ వెల్లడించింది. స్పౌజ్, మెడికల్, మ్యూచువల్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు చేసే భార్య/భర్త చేసుకున్న దరఖాస్తుల మీద సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఇప్పటివరకు 317 జీవో మీద సబ్‌కమిటీకి వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖాధిపతులకు పంపి పరిశీలన చేయాలని మంత్రులు ఆదేశించారు. పరిశీలన అనంతరం మరోసారి సబ్‌కమిటీ భేటీ అయి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

16 నుంచి గ్రూప్-4 దివ్యాంగ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

గ్రూప్-4 పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించిన దివ్యాంగ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన జూలై 16 నుంచి 26వ తేదీ వరకు జరగనుందని టీజీపీఎస్సీ కార్యదర్శి గురువారం తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన దివ్యాంగ (ఆర్థోపెడిక్ హ్యాండీక్యాప్డ్) అభ్యర్థులు ఉస్మానియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మెడికల్ బోర్డు ముందు హాజరు కావాలని సూచించారు. ఉస్మానియా ఆసుపత్రిలోని 507వ నంబరు గదిలో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్, ధ్రువపత్రాలతో పాటు మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, మెడికల్ బోర్డుకు చెల్లించాల్సిన ఫీజును నగదు రూపంలో తీసుకుని రావాలని చెప్పారు.

ప్రభాకర్‌రావు, రాధాకిషన్ విచారణకు అనుమతి

మరికొంత కాలం అమెరికాలోనే ప్రభాకర్‌రావు.. వీసీ, టెలికాన్ఫరెన్స్ విచారణపై త్వరలో నిర్ణయం

» చార్జ్‌షీట్ తిరస్కరణ.. తిరిగి దాఖలు..!
» నిందితుల 'డీఫాల్ట్ బెయిల్'పై నేడు తీర్పు

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావును విచారించేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఈ విషయంలో దర్యాప్తు అధికారుల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న హోంశాఖ ముఖ్య కార్యదర్శి.. న్యాయశాఖతో సంప్రదింపులు జరిపాక ఈ మేరకు అనుమతినిచ్చినట్లు తెలిసింది. వీరిద్దరూ విశ్రాంత అధికారులు కాగా.. మిగతా ముగ్గురు– ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న సర్వీసులో ఉన్నారు. ఈ నేపథ్యంలో.. విశ్రాంత అధికారుల ప్రాసిక్యూషన్‌కు మాత్రమే అనుమతి లభించినట్లు తెలుస్తోంది. కాగా.. క్యాన్సర్‌తో బాధపడుతున్న పభాకర్‌రావు అమెరికాలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే.! తాను ఇప్పట్లో భారత్‌కు రాలేనని, అవసరమైతే వీడియో/టెలి కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యేందుకు సిద్ధమని పేర్కొంటూ దర్యాప్తు అధికారులకు ఇటీవల ఈ-మెయిల్ పంపారు. ఈ అంశంపై దర్యాప్తు అధికారులు త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటారని సమాచారం.

మరోమారు చార్జ్‌షీట్ తిరస్కరణ

ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు అధికారులకు కోర్టులో మరోమారు ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో అధికారులు ఇప్పటికే రెండు సార్లు చార్జ్‌షీట్లను సమర్పించగా.. కోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే.! తాజాగా మరోమారు దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను కూడా సాంకేతిక కారణాలతో తిరస్కరించింది. చార్జ్‌షీట్‌లో పేర్కొన్న ఆధారాల్లో కొన్నింటిని కోర్టుకు సమర్పించకపోవడంతో జడ్జి అభియోగపత్రాలను తిరస్కరించారు. దీంతో రిమాండ్‌లో ఉన్న రాధాకిషన్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, ప్రణీత్‌రావు 'డీఫాల్ట్ బెయిల్' పిటిషన్ దాఖలు చేశారు. తమను అరెస్టు చేసి 100 రోజులు పూర్తయిందని, ఇప్పటికీ చార్జ్‌షీట్ దాఖలు చేయనందున డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాలని వారు కోర్టును అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై ఇరువర్గాల వాదనలను నమోదు చేసుకున్న జడ్జి.. తీర్పును శుక్రవారానికి వాయిదా వేశారు.

ప్రజాధనం వృథా కావొద్దు

రైతుభరోసా సాయంపై ఇప్పటివరకు ఎలాంటి పరిమితులు విధించలేదు

» చట్టసభల్లో చర్చించాకే జీవో: డిప్యూటీ సీఎం భట్టి
» చిన్న, సన్నకారుకు సక్రమంగా సాయం: తుమ్మల
» నాలుగు గోడల మధ్య నిర్ణయాలు ఉండవు: పొంగులేటి



ఉట్నూర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క; చిత్రంలో మంత్రులు తుమ్మల, పొంగులేటి, సీతక్క తదితరులు

ఆదిలాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రైతుల అభిప్రాయం మేరకే రైతు భరోసా పథకం అమలుపై తుది నిర్ణయం తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ప్రజాధనం వృథా కావొద్దని, అసలైన రైతులకే పెట్టుబడి సాయం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో రైతు భరోసా పథకం విధి విధానాల ఖరారుపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతులు, ప్రజా ప్రతినిధులు, మేధావులు, రైతు సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అందరి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు స్వీకరించారు. మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్, ఉప ముఖ్యమంత్రి భట్టితో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా, విలేకరుల సమావేశంలోనూ భట్టి మాట్లాడుతూ.. రైతుభరోసా సాయంపై ఇప్పటివరకు ఎలాంటి పరిమితులు విధించలేదని పేర్కొన్నారు. రైతుల అభిప్రాయాలను సేకరించిన అనంతరం చట్టసభల్లో ప్రతిపక్షాలతో చర్చిస్తామని, ఆ తర్వాత విధివిధానాలతో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తుందని వెల్లడించారు. రైతుల నుంచి సూచనలు తీసుకోవడానికి సీఎం రేవంత్ ఆదేశాల మేరకు ఉమ్మడి పది జిల్లాలను సందర్శిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం తప్పకుండా రెండు లక్షల రుణ మాఫీ చేస్తుందని ప్రకటించారు. గ్రామం యూనిట్‌గా తీసుకుని పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామన్నారు. పోడు రైతులకు ప్రభుత్వ సాయంపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్రానికి వచ్చే నిధులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతామని చెప్పారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రైతుభరోసా సాయం ఇకపై అనర్హులకు అందదని స్పష్టం చేశారు. చిన్న సన్నకారు రైతులకు సక్రమంగా పెట్టుబడి సాయాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందన్నారు. గతంలో అనర్హులకు రైతుబంధు దక్కిందని, నిజమైన రైతులకు పెట్టుబడి సాయం అందే విధంగా సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆయన కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో నాలుగు గోడల మధ్య ప్రభుత్వ నిర్ణయాలు ఉండవన్నారు. గత ప్రభుత్వం నాలుగు గోడల మధ్యనే నిర్ణయాలు తీసుకోవడంతో ప్రజావ్యతిరేకత వచ్చిందని పేర్కొన్నారు. అందుకే రైతుల సలహాలు, సూచనల మేరకే రైతుభరోసాపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. అసెంబ్లీలో ప్రతిపక్షాలతో చర్చించి రైతుల అభిప్రాయం మేరకు రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని ఆయన తెలిపారు.

ప్రజాధనాన్ని వృథా చేయం: సీతక్క

తమపై ఎంతో నమ్మకం ఉంచి ప్రజలు అధికారం ఇచ్చారని, ప్రతిపైసా ప్రజలకే దక్కేలా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని మంత్రి సీతక్క అన్నారు. వ్యవసాయం చేసినోడికే పెట్టుబడి సాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆల్మట్టికి తగ్గిన వరద

» 45 వేల క్యూసెక్కులకు పడిపోయిన ప్రవాహాలు
» మేడిగడ్డకు 43,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

హైదరాబాద్/గద్వాల/పాల్వంచ రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణాబేసిన్‌లో ఎగువన కర్ణాటకలో ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు వరద గణనీయంగా తగ్గింది. బుధవారం 84 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. గురువారం మధ్యాహ్నం కల్లా 45 వేల క్యూసెక్కులకు తగ్గింది. ఈ జలాశయం పూర్తి నిల్వ సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ఇందులో 87.75 టీఎంసీలున్నాయి. జలాశయం క్రమంగా నిండుతుండటంతో స్పిల్‌వే గేట్ల ద్వారా కాకుండా జలవిద్యుత్ ఉత్పాదన కోసం నీటిని దిగువకు వదులుతున్నారు. తుంగభద్ర జలాశయానికి 25 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రాజెక్టు సామర్థ్యం 105.79 టీఎంసీలకు ప్రస్తుతం 27.33 టీఎంసీలున్నాయి. ఇక గోదావరి బేసిన్‌లో ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 17,984 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టుకు 222 క్యూసెక్కులు, సింగూరుకు 391 క్యూసెక్కుల వరద రికార్డయింది. ఇక మేడిగడ్డ బ్యారేజీకి 43,500 క్యూసెక్కులు, అన్నారం 650 క్యూసెక్కులు, సుందిళ్ల 1,202 క్యూసెక్కులు, సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం) బ్యారేజీకి 75,400 క్యూసెక్కులు, దుమ్ముగూడెం (సీతమ్మసాగర్)కు 73 వేల క్యూసెక్కుల వరద రాగా... వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు. ఖమ్మం జిల్లాలోని కిన్నెరసాని జలాశయానికి వరద పెరుగుతోంది. ప్రాజెక్టు నీటిమట్టం 407 అడుగులకు ప్రస్తుతం 400 అడుగుల మేర నీరు చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

రికవరీ బంధు!

(మొదటిపేజీ తరువాయి)

అధికారులకు ఫిర్యాదు వచ్చింది. దీనిపై చర్యలు తీసుకోవాలని గత జూన్ నెల 29న ఘట్కేసర్ తహసీల్దారుకు ఆదేశాలు జారీచేశారు. రైతుబంధు కింద తీసుకున్న రూ. 16.80 లక్షలను రెవెన్యూ రికవరీ చట్టం కింద వసూలుచేయాలని, అలాగే తహసీల్దార్ లాగిన్‌లో 'ఎల్ఎన్ మాడ్యూల్ లో సదరు భూమిని వ్యవసాయ విభాగం నుంచి వ్యవసాయేతర విభాగానికి మార్చాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. కాగా ఈ ఉత్తర్వులు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. మరి.. రాష్ట్రమంతటా ఇదే పద్ధతిని అనుసరిస్తారా? అనే చర్చ జరుగుతోంది. అయితే ప్రభుత్వ వర్గాలు మాత్రం ఈ తరహా నిర్ణయం ఏమీ తీసుకోలేదని స్పష్టంగా చెబుతున్నాయి.



సాగుచేయని భూములకు సుమారు రూ. 26 వేల కోట్లు

గత ప్రభుత్వం రైతుబంధు పథకం అమలుచేసే క్రమంలో ఎలాంటి షరతులు విధించలేదు. ధరణి పోర్టల్‌లో వ్యవసాయ భూముల జాబితాలో ఉన్న భూములన్నింటికి రైతుబంధు నిధులు పంపిణీ చేసింది. మొత్తం 12 విడతల్లో కలిపి రూ. 80,458 కోట్ల నిధులు రైతుబంధు పథకంపై ఖర్చు చేసింది. ఇందులో సాగుకు యోగ్యంలేని భూములు, రాళ్లు, రప్పలు, కొండలు, గుట్టలు ఉన్న భూములు, రియలెస్టేట్ వెంచర్లకు రూ. 25,672 కోట్లు పంపిణీచేసినట్లు ఈ ప్రభుత్వం లెక్కలు తేల్చింది. ఇంత ప్రజాధనం దుర్వినియోగం అయ్యిందని వెల్లడించింది. అయినా ఈ సొమ్మును రికవరీచేసే ఉద్దేశం లేదని రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టంగా వెల్లడించాయి.

మైనర్లే రేప్ చేసి చంపేశారు!

ఆడుకుంటున్న తొమ్మిదేళ్ల బాలికను అపహరించి, అఘాయిత్యం

» నంద్యాల జిల్లాను కుదిపేస్తున్న బాలిక మిస్సింగ్ కేసు
» నిందితుల్లో ఒకరు 6వతరగతి, మరో ఇద్దరు టెన్త్ క్లాస్

నందికొట్కూరు/ పగిడ్యాల, జూలై 11: వారు ముగ్గురూ మైనర్లే! ఒకరు ఆరో తరగతి, మరో ఇద్దరు పదో తరగతి చదువుతున్నారు. నిండా పదిహేనేళ్లు కూడా లేవు! కానీ.. 9ఏళ్ల బాలికను అపహరించి, అఘాయిత్యం చేసి చంపేసి, మృతదేహాన్ని కాలువలో పడేసినట్లు పోలీసులకిచ్చిన వాంగ్మూలంలో అసలు గుట్టును బయటపెట్టారు. ఐదు రోజులుగా నంద్యాల జిల్లాను కుదిపేస్తున్న బాలిక అదృశ్యం కేసులో దారుణమిది!. బాలిక ఆచూకీని కనుగొనేందుకు జిల్లా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం తలమునకలై ఉంది. చివరికి గురువారం ఎన్‌డీఆర్ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందాలు రంగంలోకి దిగాయి. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలంలోని ముచ్చుమర్రి అప్రోచ్ కెనాల్‌లో మూడు రోజులుగా అదృశ్యమైన బాలిక కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

అసలేం జరిగిందంటే..

నందికొట్కూరు నియోజకవర్గం పగిడ్యాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(9) పాత ముచ్చుమర్రి ఉన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. ఆదివారం గ్రామంలోని పార్కులో ఆడుకునేందుకు వెళ్లిన ఆ చిన్నారి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి నందికొట్కూరు విజయోత్సవ ర్యాలీలో ఉండగా ఈ విషయం తెలుసుకుని... 24 గంటల్లో బాలిక ఆచూకీ కనుగొనాలని పోలీసులను ఆదేశించారు. దీంతో ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మూడు రోజులుగా దర్యాప్తు చేపట్టారు. రెండు రోజుల క్రితం డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగడంతో ఒక చోట క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు, బాలిక దుస్తులు లభ్యమైనట్లు తెలిసింది. కానీ.. ముగ్గురు బాలురు పార్కులో ఆడుకుంటున్న చిన్నారిని కిడ్నాప్ చేసి.. అఘాత్యానికి పాల్పడి ఆపై హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. దీంతో పోలీసులు ఆ ముగ్గురు బాలురను అదుపులోకి తీసుకొని విచారించగా సంఘటనా స్థలాన్ని చూపించారు. ఆ ముగ్గురిలో ఒకరు(12) ఆరోతరగతి, మరో ఇద్దరు(15) పదో తరగతి చదువుతున్నట్లు చెప్పారు. బాలురు ఇచ్చిన సమాచారం మేరకు ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం కాలువలో బాలిక మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. గురువారం 30 మందితో కూడిన ఎన్డీఆర్ఎఫ్ బృందం అత్యాధునిక టెక్నాలజీతో కూడిన కెమెరాలతో నీటిలో తనిఖీ చేశారు. కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ రఘువీర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పాప అదృశ్యమై ఐదు రోజులవుతున్నా ఆచూకీ లభించడం లేదని బాలిక కుటుంబ సభ్యులు, వారి బంధువులు కలెక్టర్ ఎదుట వాపోయారు. అనుమానితులుగా ఉన్న ముగ్గురు మైనర్ బాలురు తప్పుడు సమాచారంతో పోలీసులను పక్కదోవ పట్టిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

న్యాయవాదిపై దాడి చేసిన ఏఎస్సైని సస్పెండ్ చేయాలి

» లాయర్ల రక్షణ చట్టం అమలు చేయాలి
» న్యాయవాదుల డిమాండ్.. పలుచోట్ల విధులు బహిష్కరించి నిరసన ప్రదర్శన

అడ్డగుట్ట, రంగారెడ్డి జిల్లా కోర్టులు (ఆంధ్రజ్యోతి)/ సిద్దిపేట క్రైం/దుబ్బాక, జూలై 11: న్యాయవాదిపై దాడి చేసిన ఏఎస్సైని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వసంత్ కుమార్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓ కేసు విషయంలో బుధవారం నిందితుడి బెయిల్ పేపర్లు తీసుకొని పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన లాయర్ రవి కుమార్‌ను ఏఎస్సై ఉమారెడ్డి అసభ్యపదజాలంతో దూషించడమేకాకుండా దాడి చేశారన్నారు. అంతేకాకుండా న్యాయవాదిపై అకారణంగా కేసు నమోదు చేశారని చెప్పారు. న్యాయవాదిని కొట్టిన ఏఎస్సైని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ విధులను బహిష్కరించినట్లు తెలిపారు. కాగా న్యాయవాది రవి కుమార్‌పై దాడి చేయడాన్ని నిరసిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టుల న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. సిద్దిపేట టూ టౌన్ ఏఎస్సై ఉమారెడ్డిని జిల్లా హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేశారు. ఆయన న్యాయవాదితో దురుసుగా ప్రవర్తించారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని బుధవారం నుంచి జిల్లాలోని న్యాయవాదులు ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో ఉమారెడ్డిని జిల్లా హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా న్యాయవాదిపై పోలీసుల ప్రవర్తనకు నిరసనగా సిద్దిపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి విధులు బహిష్కరించారు. దుబ్బాక మున్సిఫ్ కోర్టులోనూ న్యాయవాదులు విధులు బహిష్కరించారు. కోర్టు ముందు నిరసన వ్యక్తం చేశారు.

కంకర.. మట్టి ఇవ్వండి..!

» జాతీయ రహదారుల నిర్మాణానికి.. రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన ఎన్‌హెచ్ఏఐ
» ఆరు జిల్లాల్లో తొమ్మిది ఎన్‌హెచ్ పనులు
» 90 లక్షల మెట్రిక్ టన్నుల కంకర అవసరం
» 2.19 కోట్ల మెట్రిక్ టన్నుల మట్టి కూడా

హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆరు జిల్లాల పరిధిలో తొమ్మిది రోడ్లను నిర్మిస్తున్న జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) కొత్త సమస్యను ఎదుర్కొంటోంది. ఆయా జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన కంకర, మట్టి సమీప ప్రాంతాల్లో లభించకపోవడంతో పనుల్లో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దీంతో.. కంకర, మట్టి కోసం ఎన్‌హెచ్ఏఐ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక అంచనా ప్రకారం.. ఈ రహదారుల నిర్మాణానికి 90 లక్షల మెట్రిక్ టన్నుల కంకర, 2.19 కోట్ల మెట్రిక్ టన్నుల మట్టి అవసరం. ఎన్‌హెచ్ఏఐ అధికారులు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో ఇదే విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన మైనింగ్ పాలసీతో ఈ సమస్యలు తలెత్తుతున్నాయని ఆయనకు వివరించారు.

మైనింగ్ పాలసీతో ఇబ్బందులు

గత ప్రభుత్వం 2022 నవంబరు 10న నూతన మైనింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకువస్తూ.. జీవోలు 44, 45లను విడుదల చేసింది. దీని ప్రకారం ఏదైనా కంపెనీలకు, లేదా అభివృద్ధి అవసరాలకు క్వారీలు కావాలంటే.. తప్పనిసరిగా ఆన్‌లైన్ వేలంలో పాల్గొనాలి. ఒకవేళ వేలంలో పాల్గొన్నా.. సంబంధిత కాంట్రాక్టర్‌కు క్వారీ దక్కుతుందన్న గ్యారెంటీ లేదు. బిడ్ దక్కించుకున్న వారికే క్వారీలను కేటాయిస్తారు. ఈ విధానం వల్ల జాతీయ రహదారుల పనులకు తీవ్ర ఆటంకాలేర్పడుతున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. కాంట్రాక్టర్లు పనులు ఒకచోట చేస్తుండడం.. క్వారీలో సుదూర ప్రాంతాల్లో ఉంటుండంతో దూరాభారం, రవాణా ఖర్చు పెరుగుతోందని, ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని, క్వారీల అనుమతులను సులభతరం చేయాలని కోరారు. 1967 సెప్టెంబరు 4 నాటి జీవో-1172 ప్రకారం క్వారీలను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. పరిష్కార బాధ్యతలను మైనింగ్ శాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిసింది.

తెలంగాణలో కోల్ మైనింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్!

» డిప్యూటీ సీఎం భట్టితో ఐఐటీ హైదరాబాద్, మోనాష్ వర్సిటీ ప్రొఫెసర్ల భేటీ



హైదరాబాద్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బ్యాటరీల్లో వాడే అరుదైన ఖనిజ నిక్షేపాలకు సంబంధించి 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ కోల్ మైనింగ్ అండ్ క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్' కేంద్రాన్ని తెలంగాణలో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ మేరకు తనని కలిసిన ఐఐటీ హైదరాబాద్, ఆస్ట్రేలియాకు చెందిన మోనాష్ విశ్వవిద్యాలయ బృందానికి భట్టి భరోసా ఇచ్చారు. ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్లు మూర్తి నర్సింహ, అశోక్ కామరాజ్, మోనాష్ వర్సిటీకి చెందిన ప్రొఫెసర్ ఎలిశెట్టి మోహన్ ఉపముఖ్యమంత్రితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. బ్యాటరీల్లో ఉపయోగించే అరుదైన ఖనిజాలను ప్రస్తుతం చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నామని, వాటిని సొంతంగా తయారు చేసుకుంటే దేశానికి లాభమని మంత్రికి వివరించారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు భాగస్వామ్యంతో 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ కోల్ మైనింగ్ అండ్ క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్‌'ను తెలంగాణలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రతిపాదించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ • శుక్రవారం 12 జూలై 2024
diksuchi@andhrajyothy.com

ఎన్‌జీ రంగా వర్సిటీలో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్‌ఏయూ)- బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అకడమిక్ మెరిట్ ఆధారంగా లాంలోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ కాలేజీకి ఐకార్ గుర్తింపు ఉంది. మొత్తం 83 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల కోసం 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు నిర్దేశించారు. గ్రామీణ అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. హాస్టల్ సౌకర్యం ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బైపీసీ/ఎంపీసీ/ఎంబైపీసీ గ్రూప్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

- మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా(హోం సైన్స్) ఉత్తీర్ణులైన అభ్యర్థుల కోసం పది శాతం సూపర్ న్యూమరరీ సీట్లు(ఎనిమిది సీట్లు) ప్రత్యేకించారు. గ్రామీణ అభ్యర్థులకు కేటాయించిన సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే ఒకటోతరగతి నుంచి ఇంటర్ స్థాయి వరకు కనీసం నాలుగేళ్లు గ్రామ పాఠశాలల్లో చదివి ఉండాలి. సంబంధిత ధ్రువపత్రాన్ని సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.
- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్లు మించకూడదు.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 29
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

ఇగ్నోలో ఓడీఎల్ కోర్సులు

న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో)- ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. పీజీ, డిగ్రీ, డిప్లొమా, సర్టిఫికెట్ తదితర కోర్సులు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన అర్హతల సమాచారాన్ని వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

అడ్వాన్స్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, పవర్ డిస్ట్రిబ్యూషన్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అప్రిసియేషన్ కోర్సు: కోర్సు వ్యవధి మూడు నెలలు. ఎన్విరాన్‌మెంట్, పాపులేషన్ అండ్ సస్టయినబుల్ డెవలప్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.



సర్టిఫికెట్ ప్రోగ్రామ్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. రష్యన్ లాంగ్వేజ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, బుక్ కీపింగ్, బిజినెస్ స్కిల్స్, కమ్యూనికేషన్ అండ్ ఐటీ స్కిల్స్, కమ్యూనిటీ రేడియో, కన్జూమర్ ప్రొటెక్షన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఎనర్జీ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, ఫ్యాషన్ డిజైన్, ఫస్ట్ ఎయిడ్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, ఫ్రెంచ్, ఫంక్షనల్ ఇంగ్లీష్, జనరల్ డ్యూటీ అసిస్టెన్స్, జీరియాట్రిక్ కేర్ అండ్ అసిస్టెన్స్, జర్మన్, గైడెన్స్, హెల్త్ కేర్ అండ్ మేనేజ్‌మెంట్, హోమ్ హెల్త్ అసిస్టెన్స్, హ్యూమన్ రైట్స్, ఐటీ, ఇంటర్నేషనల్ హ్యూమానిటేరియన్ లా, జపనీస్, కొరియన్ లాంగ్వేజ్ అండ్ కల్చర్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ నర్సింగ్, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, న్యూట్రిషన్ అండ్ చైల్డ్ కేర్, హిందుస్తానీ మ్యూజిక్, భరతనాట్యం, కర్ణాటక సంగీతం, రష్యన్, పర్షియన్, రూరల్ డెవలప్‌మెంట్ తదితర స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. బిజినెస్ ప్రాసెస్ అవుట్ సోర్సింగ్, క్రియేటివ్ రైటింగ్ ఇన్ ఇంగ్లీష్, డెయిరీ టెక్నాలజీ, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, ఫ్యాషన్ డిజైన్ అండ్ రిటైల్, హార్టికల్చర్, మీట్ టెక్నాలజీ, మోడరన్ ఆఫీస్ ప్రాక్టీస్, న్యూట్రిషన్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్, పారాలీగల్ ప్రాక్టీస్, థియేటర్ ఆర్ట్స్, టూరిజం స్టడీస్, ఉర్దూ, వాల్యూ ఎడ్యుకేషన్, వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్, ఉమన్ ఎంపవర్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్, అగ్రికల్చరల్ అండ్ కాస్ట్ మేనేజ్‌మెంట్, అప్పారెల్ మర్చండైజింగ్, రిటైలింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

డిగ్రీ ప్రోగ్రామ్‌లు

బీఏ, బీఏ ఆనర్స్, బీటీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీకాం, బీఎస్‌డబ్ల్యూ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్ వ్యవధి ఏడాది.

- **బీఏ స్పెషలైజేషన్‌లు:** ఎకనామిక్స్, ఇంగ్లీష్, హిందీ, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సంస్కృతం, సోషియాలజీ, ఉర్దూ, అప్లయిడ్ హిందీ, అప్లయిడ్ సంస్కృతం, అప్లయిడ్ ఉర్దూ, జెండర్ స్టడీస్, జర్నలిజం అండ్ డిజిటల్ మీడియా, ఫిలాసఫీ, టూరిజం స్టడీస్
- **బీఏ ఆనర్స్ స్పెషలైజేషన్‌లు:** ఎకనామిక్స్, ఇంగ్లీష్, హిందీ, హిస్టరీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, సంస్కృతం, సోషియాలజీ, ఉర్దూ
- **బీబీఏ స్పెషలైజేషన్‌లు:** రిటైలింగ్, సర్వీసెస్ మేనేజ్‌మెంట్
- **బీఎస్సీ స్పెషలైజేషన్‌లు:** ఆంత్రోపాలజీ, బయోకెమిస్ట్రీ, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ కంట్రోల్
- **బీఎస్సీ ఆనర్స్ స్పెషలైజేషన్‌లు:** ఆంత్రోపాలజీ, బయోకెమిస్ట్రీ

పీజీ ప్రోగ్రామ్‌లు

ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంటీటీఎం, ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎంఎల్ఐఎస్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది.

- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** హోం సైన్స్, మేథమెటిక్స్-కంప్యూటర్ అప్లికేషన్స్, కౌన్సెలింగ్ అండ్ ఫ్యామిలీ థెరపీ, అనలిటికల్ కెమిస్ట్రీ, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, బయోకెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫుడ్ న్యూట్రిషన్, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ మేనేజ్‌మెంట్, జాగ్రఫీ, జియోఇన్ఫర్మాటిక్స్, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, ఫిజిక్స్, రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ తదితరాలు
- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** అడల్ట్ ఎడ్యుకేషన్, ఆంత్రోపాలజీ, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, డెవలప్‌మెంట్ స్టడీస్, ఇంగ్లీష్, గాంధీ అండ్ పీస్ స్టడీస్, జెండర్ అండ్ డెవలప్‌మెంట్ స్టడీస్, హిందీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఫిలాసఫీ, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ, ట్రాన్స్‌లేషన్ స్టడీస్, భగవద్గీత స్టడీస్, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఎన్విరాన్‌మెంటల్ అండ్ ఆక్యుపేషనల్ హెల్త్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, ఫ్రెంచ్, హిందీ, హిందూ స్టడీస్.
- **ఎంబీఏ స్పెషలైజేషన్‌లు:** అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్

పీజీ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. అనలిటికల్ కెమిస్ట్రీ, కౌన్సెలింగ్ అండ్ ఫ్యామిలీ థెరపీ, గాంధీ అండ్ పీస్ స్టడీస్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, యానిమల్ వెల్ఫేర్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, ఆడియో ప్రోగ్రామ్ ప్రొడక్షన్, బుక్ పబ్లిషింగ్, కార్పొరేట్ అండ్ సోషల్ రెస్పాన్సిబిలిటీ, డెవలప్‌మెంట్ స్టడీస్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఎడ్యుకేషనల్ టెక్నాలజీ తదితర స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

పీజీ సర్టిఫికెట్: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. అగ్రికల్చర్ పాలసీ, క్లయిమేట్ ఛేంజ్, జియో ఇన్ఫర్మాటిక్స్, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఇన్వెంటరీ ప్లానింగ్ అండ్ వేర్‌హౌసింగ్ సిస్టమ్ ఫర్ ఇంజనీర్స్, మలయాళం-హిందీ ట్రాన్స్‌లేషన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 15
- **వెబ్‌సైట్:** ignouadmission.samarth.edu.in

ఎన్‌పీటీఐలో పీజీ డిప్లొమాలు

ఫరీదాబాద్‌లోని నేషనల్ పవర్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్‌పీటీఐ)- పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు. మహిళలకు ప్రోగ్రామ్ ఫీజులో పది శాతం రాయితీ లభిస్తుంది. పవర్ సంస్థలు స్పాన్సర్ చేసే అభ్యర్థుల కోసం 25 శాతం సీట్లు కేటాయించారు. అకడమిక్ మెరిట్ ఆధారంగా మెరిట్ లిస్ట్ రూపొందించి కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

పీజీ డిప్లొమా ఇన్ పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: కోర్సు వ్యవధి ఏడాది. ఫరీదాబాద్, నాగ్‌పూర్, నైవేలీ, దుర్గాపూర్, అలప్పుజా, శివ్‌పురి సెంటర్లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఒక్కో సెంటర్లో 60 సీట్లు చొప్పున మొత్తం 360 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ఇన్ హైడ్రో పవర్ ప్లాంట్ ఇంజనీరింగ్: కోర్సు వ్యవధి తొమ్మిది నెలలు. నంగల్ సెంటర్లో ఈ ప్రోగ్రామ్ ఉంది. ఇక్కడ 60 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ఇన్ రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ టెక్నాలజీస్: కోర్సు వ్యవధి ఏడాది. న్యూఢిల్లీ, శివ్‌పురి, నైవేలీ, అలప్పుజా సెంటర్లలో ఈ ప్రోగ్రామ్ ఉంది.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో (బీఈ/బీటెక్)(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/సీ అండ్ ఐ/పవర్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ గ్రిడ్ ఇంటర్ఫేస్ కోర్సుకు ఏ ఇంజనీరింగ్ విభాగంవారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 28
- **టెలిఫోనిక్ ఇంటర్వ్యూ:** జూలై 30, 31
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** ఆగస్టు 2
- **కౌన్సెలింగ్:** ఆగస్టు 5, 6
- **కోర్సులు ప్రారంభం:** ఆగస్టు 12 నుంచి
- **మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్స్:** ఆగస్టు 22
- **వెబ్‌సైట్:** www.npti.gov.in



జాబ్ కార్నర్

ఐటీబీపీలో హెడ్ కానిస్టేబుల్ పోస్టులు



ఖాళీలు 112

ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ).. హెడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన పురుష, మహిళా అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

పోస్టు: హెడ్ కానిస్టేబుల్(ఎడ్యుకేషన్ అండ్ స్ట్రెస్ కౌన్సెలర్)

అర్హత: ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సైకాలజీ ఒక సబ్జెక్టుగా బ్యాచిలర్స్ డిగ్రీ లేదా బ్యాచిలర్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ లేదా బ్యాచిలర్ ఆఫ్ టీచింగ్‌లో ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: 2024 ఆగస్టు 5 నాటికి 20 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి. అంటే 1999 ఆగస్టు 6 కంటే ముందుగానీ, 2004 ఆగస్టు 5 తరవాత గానీ జన్మించి ఉండకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు; ఓబీసీలకు మూడేళ్లు; ఎక్స్ సర్వీస్‌మన్(యూఆర్)లకు మూడేళ్లు; ఎక్స్ సర్వీస్‌మన్(ఓబీసీ)లకు ఆరేళ్లు; ఎక్స్ సర్వీస్‌మన్(ఎస్సీ/ఎస్టీ)లకు ఎనిమిదేళ్లు వయోపరిమితి నిబంధనలో సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, రిక్రూట్‌మెంట్ టెస్ట్ ద్వారా

రిక్రూట్‌మెంట్ టెస్ట్: ఇంగ్లీష్/హిందీ మాధ్యమంలో 100 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. 100 ప్రశ్నలు ఇస్తారు. జనరల్ ఇంగ్లీష్ నుంచి 10(10 మార్కులు), జనరల్ హిందీ నుంచి 10(10 మార్కులు), జనరల్ అవేర్‌నెస్ నుంచి 10(మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ అండ్ సింపిల్ రీజనింగ్ నుంచి 10(మార్కులు), సైకాలజీ నుంచి 60(60 మార్కులు) ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలు మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటాయి. పరీక్షను ఓఎంఆర్/కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 5

వెబ్‌సైట్: https://recruitment.itbpolice.nic.in/rect/index.php

సెయిల్‌లో మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

ఖాళీలు 249

స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్

అర్హత: కనీసం 65 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు గేట్-2024 స్కోరు సాధించి ఉండాలి.

వయోపరిమితి: 2024 జూలై 25 నాటికి 28 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

జీతభత్యాలు: రూ.60,000 - రూ.1,80,000

దరఖాస్తు రుసుము: రూ.700. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.200.

ఎంపిక ప్రక్రియ: గేట్-2024 స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 25

వెబ్‌సైట్: https://www.sail.co.in/en/home

सेल SAIL

ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్లు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)...రెగ్యులర్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న స్పెషలిస్ట్ క్యాడర్(ఎస్‌సీఓ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఖాళీలు: 16

1. సీనియర్ వైస్ ప్రెసిడెంట్(ఐఎస్ ఆడిటర్)(కాంట్రాక్ట్): **2 పోస్టులు**
వయసు: 38 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండాలి.
2. అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్(ఐఎస్ ఆడిటర్)(కాంట్రాక్ట్): **3 పోస్టులు**
వయసు: 33 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలి.
3. మేనేజర్(ఐఎస్ ఆడిటర్)(రెగ్యులర్): 4 పోస్టులు
వయసు: 28 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండాలి.
4. డిప్యూటీ మేనేజర్(ఐఎస్ ఆడిటర్)(రెగ్యులర్): 7
వయసు: 25 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలి

అర్హతలు: అభ్యర్థులు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్స్‌లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. పోస్టును అనుసరించి బ్యాంకింగ్/బీఎఫ్‌ఎస్‌ఐ సంస్థల్లో సంబంధిత విభాగంలో కనీసం 3 నుంచి 10 ఏళ్ల పని అనుభవం ఉండాలి.

పని ప్రదేశం: ముంబై/హైదరాబాద్/మొబైల్ డ్యూటీ

ఎంపిక ప్రక్రియ: కాంట్రాక్ట్ పోస్టులకు షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ, సీటీసీ నెగోషియేషన్ ద్వారా; రెగ్యులర్ పోస్టులకు షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 24

వెబ్‌సైట్: https://bank.sbi/web/careers

లిటిల్స్



రాజుగారి కల


విజయ నగరాన్ని పాలించే కృష్ణ దేవరాయలకు ఒక రాత్రి వింతైన కల వచ్చింది. ఆ కలలో ఆయన మహిమ గల సింహాసనం మీద కూర్చున్నాడు. ఆ ఆసనం మనసులో ఏ ప్రదేశాన్ని తలచుకుంటే అక్కడికి క్షణంలో తీసుకుపోతుంది. ఆ సింహాసనం మీద పొదిగి ఉన్న విలువైన రత్నాలు వజ్రాల్లో మొత్తం రాజుగారి రూపమే కనబడుతోంది. తర్వాత రాజు కొలువులో కూర్చుని,, తన కలలో కనిపించిన ఆసనం వంటిదే కావాలని ఆజ్ఞ ఇచ్చాడు



రాజోద్యోగులందరూ గాలిలో ఎగిరే 'ఆసనం, క్షణంలో కోరుకున్న చోటికి చేర్చే ఆసనం ఎలా సాధ్యం అని గుసగుసలు పోయారు. రోజులు గడుస్తున్నా, రాజుగారు తన కల గురించి అందులో తను చూసిన సింహాసనం గురించి చెప్పడం మానలేదు. ఒకరోజు ఒక పేదవృద్ధుడు రాజుగారి కొలువుకు వచ్చి, 'నేను దాచుకున్న వంద బంగారు కాసులు ఎవరో దొంగిలించారు, ఆ దొంగను పట్టుకుని శిక్ష వేసి, నా బంగారం నాకు ఇప్పించండి' అని మొర పెట్టుకున్నాడు. 'ఇంతకీ నీ సొమ్ము కాజేసింది ఎవరు?' అని రాజు అడిగాడు 'నిన్న రాత్రి నా కలలో కనిపించి, నా సొమ్ముకాజేసింది మీరే మహారాజా' అని అతను జవాబు చెప్పాడు. అక్కడున్న వారంతా ఆ ముసలి వాడికి మరణ దండన ఖాయం రాజుగారినే దొంగ అంటాడా. అనుకున్నారు. రాజు కూడా ముసలి వాడితో 'నేను నీ సొమ్ము ఎందుకు కాజేస్తాను? అలా ఎలా మాట్లాడుతావు? కలలో కనబడితే మాత్రం అది నిజం అవుతుందా?' అని గట్టిగా అడిగాడు వెంటనే ఆ వృధుడు తాను అతికించుకున్న గడ్డం, మాసిన దుస్తులు తొలగించి, మెరిసే బట్టలు ఆ భరణాలతో ముందుకు వచ్చి నిలబడి, 'కలలో జరిగిన దొంగతనం ఎలా నిజం కాదో, కలలో కనిపించిన ఎగిరే సింహాసనం కూడా నిజం కాదు కాబట్టి, ఇక దాని విషయమై అన్వేషణ కూడా ఆపు చేయించండి మహారాజా' అని చిరునవ్వు నవ్వాడు మారు వేషం తొలగించిన తెనాలి రామలింగ కవి. తనకు కను విప్పు కలగడానికే తెనాలి రాముడు ఇలా నాటకం ఆడాడు అని తెలుసుకున్న రాజుగారు ఎప్పటిలాగే తెనాలి రాముని సన్మానించి, అతని బుద్ధి కుశలతను ఎంతో మెచ్చుకున్నాడు.



6 తేడాలు గుర్తించండి!



దారి కనుక్కోండి

సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 356

			6	7			1	3
				5			2	
					3	4		
	3				7			2
7		4				5		8
5			4				6	
		8	9					
	2			8				
6	9			3	1			

సుడోకు - 355 సమాధానం

2	8	5	6	7	4	9	1	3
1	4	3	8	5	9	7	2	6
9	7	6	1	2	3	4	8	5
8	3	9	5	6	7	1	4	2
7	6	4	3	1	2	5	9	8
5	1	2	4	9	8	3	6	7
3	5	8	9	4	6	2	7	1
4	2	1	7	8	5	6	3	9
6	9	7	2	3	1	8	5	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.